తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM రాజమహేంద్రవరం : fb.com/vaartha Digital

Published from Rajahmundry, Tadepalligudem, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Srikakulam

5-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 125 పేజీలు: 8+4 వెల: 6.50




SHOWROOMS: ANDHRA PRADESH: RENAULT RAJAHMUNDRY Ph: 8860294871. RENAULT BHIMAVARAM Ph: 8448389650.




గురువారం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో శ్రీశ్రీ రవిశంకర్‌కు అభివాదం చేస్తున్న మంత్రి నారా లోకేష్

# ఇఎఫ్ స్టీల్ ప్లాంట్!

>> ఆత్యాధునిక ఇఎఫ్ స్టీల్ ప్లాంట్‌ను ఏపీలో నిర్మించాలని డెమ్యెంకోకు లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ పారిశ్రామిక హబ్ శ్రీసిటీలో తక్షణ రైల్వే సైడింగ్ కనెక్టివిటీతో కూడిన ప్రత్యేక సెజ్, రైల్వే ట్రాక్ రోలింగ్ మిల్లును ఏర్పాటు చేయాలని మంత్రి కోరారు. చెన్నై-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ పరిధిలోని ప్రాంతీయ ఆటోమోటివ్, షిప్‌బిల్డింగ్ పరిశ్రమలకు నేరుగా మెటీరియల్ సరఫరా చేసేలా ఒక ప్రత్యేకమైన హాట్-రోల్డ్ గాల్వనైజ్డ్ వైర్ ఫ్యాక్టరీని నిర్మించాలని ప్రతిపాదించారు. దీనితో పాటు నోవోస్టీల్‌మ్ సప్లయ్ చైన్ భాగస్వామ్యంతో, ప్రత్యేక వాటర్ ఫ్రంట్ బెర్త్‌లతో కూడిన ముడి పదార్థాల లాజిస్టిక్స్ హబ్‌ను అభివృద్ధి చేయడానికి జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసేందుకు చొరవ చూపాలని కోరారు. భారతదేశంలోని సౌర, పవన విద్యుత్ కారిడార్లతో అనుసంధానిస్తూ లోకర్సన్ ఉక్కు తయారీలో సహకార భాగస్వామ్యం పెంపొందించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. ఈ ప్రతిపాదనలను సానుకూలంగా పరిశీలిస్తామని ఐవాన్ డెమ్యెంకో లోకేష్‌కు హామీ ఇచ్చారు. ప్రపంచస్థాయి సాఫ్ట్‌వేర్, ఏఐ ఇంజనీర్లకు వేగంగా శిక్షణ ఇచ్చేందుకు, స్బేర్ బ్యాంక్ గిగాఫ్యాక్టరీ, పీర్‌టుపీర్ స్కూల్ 21 కోడింగ్ అకాడమీలను భారతదేశంలోని ప్రధాన విద్యాకేంద్రాలలో ఏర్పాటు చేయాలని లోకేష్ కోరారు. వేగవంతంగా అభివృద్ధి చెందు తున్న విశాఖలో ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిదారుల సౌలభ్యం కోసం దూర ప్రాంతాలకు రూపాయి రూబుల్ వాణిజ్య అను మతులు, వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేష్ విజ్ఞప్తి చేశారు. తమ బ్యాంక్ భారత్‌లోని న్యూఢిల్లీ కార్యాలయం ద్వారా ద్వైపాక్షిక కమర్షియల్ ఫైనాన్స్, కార్పొరేట్ బ్యాంకింగ్ కార్యకలాపాలు, భారత్ -రష్యా క్లయింట్ డెలివరీ సేవలను అందిస్తున్నట్లు స్బేర్ బ్యాంక్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆల్బర్ట్ యెఫిమోవ్ చెప్పారు. మంత్రి లోకేశ్ చేసిన ప్రతిపాదనలను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

# సిఎం పర్యావరణం స్పెషల్

>> బాధ్యత. సహజ వనరులను కాపాడుకుంటూ, గాలి, నీరు, నేలను కలుషితం కాకుండా అందరూ కృషి చేద్దాం. పచ్చదనం పెంపు, ఇంధన వనరులు పొదుపుగా వినియోగించడం అవసరం. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 5న సైకిళ్లు, ఈ సైకిళ్లపై ప్రయాణిద్దాం. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటుదాం. రేపటి నా విశాఖ పర్యటనలో నేను సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తాను. అంతా సహకరించాలని, మంచి కార్యక్రమానికి కలిసి రావాలని కోరుతు న్నాను అని సిఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# వానలొచ్చేశాయ్..

>> సాధారణంగా జూన్ 1న రావలసిన రుతుపవనాల రాకకు మూడు రోజుల ఆలస్యంగా, గురువారం కేరళంలో రుతుపవనాల ప్రవేశాన్ని భారత వాతావరణ శాఖ (ఐఎండి) ప్రకటించింది. నైరుతి రుతుపవనాలు కేరళ తీరంలోకి ప్రవేశించడానికి వాతావరణ పరిస్థి తులు అనుకూలంగామారడంతో ఈ ముందస్తురాక జరిగింది. కేరళంకు చేరుకున్న తర్వాత, రుతుపవనాలు సాధారణంగా దశలవారీగా ఉత్తరం వైపు కదులుతూ, జులై మధ్య నాటికి దేశంలోని అన్ని ప్రాంతాలకు విస్తరించనున్నాయి.

**వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి:**

ఇటు కేరళం, అటు తమిళనాడుపై కూడా రుతుపవనాల ప్రభావం కనిపిస్తోంది. తమిళనాడులో పలు ప్రాంతాల్లో ఇప్పటికే వర్షాలు ప్రారంభమయ్యాయి. రానున్న గంటల్లో 15 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తీరప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. కేరళలోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ఇప్పుడు క్రమంగా దేశంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించనున్నాయి. సాధారణ పరిస్థితులు కొనసాగితే రెండ్రోజుల్లో రాయలసీమలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించే అవ కాశముందని భారత వాతావరణశాఖ అంచనా వేసింది. ఇలాగే కొనసా గితే వచ్చే వారం రోజుల్లో తెలుగు రాష్ట్రాల్లోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. దీంతో ప్రస్తుతం తీవ్ర ఎండలతో ఇబ్బందులు పడుతున్న తెలుగు రాష్ట్రాలకు ఉపశమనం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సీటు

## నేడు బెంగళూరులో నామినేషన్ వేయనున్న ఖర్గే

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్4:** దేశ వ్యాప్తంగా రాజ్యసభ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం ఏడుగురు అభ్యర్థుల పేర్లను రాష్ట్రాల వారీగా ప్రకటించింది. రాజ్యసభ ఎన్నికలకు ఏడుగురు అభ్యర్థుల జాబితాను కాంగ్రెస్ అధిష్ఠానం విడుదల చేసింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌కు మధ్యప్రదేశ్ నుంచి అవకాశం కల్పించారు. కర్ణాటక నుంచి ఎఐసిసి జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే,పవన్ ఖేరా, మన్సూర్ అలీఖాన్,రాజస్థాన్ నుంచి నీరజ్ డాంగి,తమిళనాడు నుంచి ప్రవీణ్ చక్రవర్తి, జార్కండ్ నుంచి ప్రవీణ్ ఝూకి రాజ్యసభ సీట్లను కేటాయిస్తూ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కెసి వేణుగోపాల్ అధికారిక ప్రకటన చేశారు. కాగా, ఎఐఎడిఎంకె నాయకుడు షణ్ముగం ఇటీవల జరిగిన తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయన తన రాజ్యసభ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో తమిళనాడులో ఒక రాజ్యసభ స్థానం ఖాళీగా ఉంది. కేంద్ర ఎన్నికల సంఘం దేశంలో ఖాళీ అయిన అన్ని స్థానాలతో పాటు తమిళనాడులోని రాజ్యసభ స్థానానికి కూడా ఉప ఎన్నిక నిర్వహించేందుకు నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే తమిళనాడులో టివికె ప్రభుత్వాన్ని ఏకపక్షంగా మద్దతు ఇచ్చి ప్రభుత్వంలో భాగస్వామిగా చేరిన కాంగ్రెస్ ఇప్పుడు రాజ్యసభ స్థానాన్నికూడా తీసుకుంది. కాంగ్రెస్‌తో మరింత బంధాన్ని పెంచుకునేం దుకు టివికె అధినేత, ముఖ్యమంత్రి సి.జోసెఫ్ విజయ్ రాజ్యసభ స్థానాన్ని కాంగ్రెస్‌కే కేటాయించారు. దీంతో ఆ స్థానానికి ప్రముఖ రాజకీయ ఆర్థికవేత్త,ఎఐసిసి డేటా అనాలసిస్ విభాగం చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తిని అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానం ప్రకటించింది. తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షినటరాజన్‌కి మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు అవకాశం ఇవ్వడం టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ హర్షం వ్యక్తం చేశారు.

# కృష్ణా తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు

>> ఆమాత్యులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎపి పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు ఎన్ఆర్ఐడి-సిఎపి నుంచి రూ.300 కోట్ల రుణం పొందేందుకు ప్రభుత్వ హామీకి ఆమోదం తెలిపింది. కృష్ణా నది తీరంలో "అమరావతి ఐ" ప్రాజెక్టు అభివృద్ధికి టెండర్లకు అనుమతి ఇచ్చింది. రాజధాని అమరావతిలో పలు నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలు, సొసైటీలు, కార్పొరేషన్లు, గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచింది. సిపిఎస్ అమల్లోకి రాకముందు ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఎంపికై వివిధ కారణాలతో ఆ పరిధిలోకి వచ్చిన ఉద్యోగులకు పాత పింఛను అమలు ప్రతిపాదనలకు కేబినెట్ సమ్మతి తెలిపింది. నెగోషియేటెడ్ సెటిల్‌మెంట్ పాలసీలో సవరణలను ఆమోదించింది. పలు సంస్థలకు భూ కేటాయింపులకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అజీవికా మిషన్‌ను జూలై 1 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో అమలు చేసే ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.. ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ అండ్ టిష్యూస్ చట్ట అమలుకు కేబినెట్ అంగీకరించింది. 2011 కేంద్ర చట్టాన్ని ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేసేందుకు ఆమోదం తెలిపింది. అవయవ మార్పిడి ప్రక్రియలో పారదర్శకత, వైద్య సదుపాయాల మెరుగుదల లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నటు సిఎం సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో ఇప్పటికే అమలులో ఉన్న విధానాన్ని ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేయనున్నట్లు చెప్పారు. సుప్రీం కోర్టు సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఈ చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.బీచ్ షాక్స్ పాలసీకు కేబినెట్ ఆమోదం తెలిపింది. భీమిలి, విశాఖపట్నం, శ్రీకాకుళం, చీరాల బీచ్‌లలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పాలసీ అమలు చేయనున్నారు. గోవా, మహారాష్ట్ర, ఒడిశా రాష్ట్రాల అనుభవాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మాత్రమే బీచ్ షాక్స్‌లు తెరిచి ఉంచడానికి అనుమతి ఇవ్వనున్నారు. పరిమిత రకాల మద్యం విక్రయాలకు మాత్రమే అనుమతి ఉండనుంది. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే తదుపరి విస్తరించే అవకాశం ఉంది. రాజధాని అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామిక పార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి వివిధ రంగాల్లోని ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

# జూన్-4 చరిత్రలో మిగిలే రోజు

>> మంచి, కల్పిస్తున్న ఉపాధిపై దుష్ప్రచారం చేయడమే వైఎస్సార్సీ విధానమని చంద్రబాబు ఆరోపించారు. చెడు ప్రచారంతోనే గొడ్డలి పార్టీ అధినేత ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బూటకపు ప్రచారంతో ప్రజలను నమ్మించే యత్నాలకు ఎక్కడికక్కడ చెక్ పెట్టాలన్నారు. కూటమి ప్రభుత్వ పాలనా విజయాలు ప్రజలకు మంత్రులు వివరించాలన్నారు. పాలన చేపట్టినప్పుడు శాఖల వారీగా శ్వేతపత్రాలు విడుదల చేశామని గుర్తుచేశారు. పరిపాలనలో పారదర్శకత పెరిగిన విధానం ప్రజలకు అర్థంకావాలని చెప్పారు.రాష్ట్రంలో పప్పుధాన్యాల ఉత్పత్తి పెరిగిందని చంద్రబాబు పేర్కొన్నారు. పంట మార్పిడి విధానాలపై రైతులను చైతన్యపరచాలన్నారు. సముద్ర ఆహార ఉత్పత్తిలోనూ గణనీయ ప్రగతి సాధిద్దామని చెప్పారు. వట్టిచెరుకూరులో 22ఏ భూ సమస్య పరిష్కరించినట్లే ఇతర ప్రాంతాల్లోనూ చేయాలని సూచించారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటులో జాప్యంపై ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన లక్ష్యంగా రైతులు, మహిళలు, యువత, ఉద్యోగులు, కార్మికులు సహా ప్రతి వర్గ సంక్షేమం కోసం పని చేస్తున్నామన్నారు. అసమానతలు లేని సమాజం, అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధే తమ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ రాష్ట్రాన్ని హెల్తీ, వెల్తీ, హ్యాపీగా తీర్చిదిద్దడమే తమ సంకల్పమని సిఎం పేర్కొన్నారు. నాటి తీర్పును గౌరవించేలా, ప్రజలు గర్వపడేలా పాలన సాగిస్తున్నామని వినమ్రంగా ప్రకటించారు. మద్దతుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలుపుతూ 'జై ఆంధ్రప్రదేశ్' అంటూ సిఎం చంద్రబాబు నినదించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై కువిమర్శలు చేసే వారికి రాష్ట్రంలో జరుగుతున్న గ్రామీణాభివృద్ధి, అమరావతి రాజధానిలో పెట్టుబడులే నిదర్శనమన్నారు.ప్రజల గొంతు నొక్కిన రాక్షస పాలనకు చరమగీతం పాడి నేటికీ రెండేళ్లని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజల ఆశీర్వాదాలు, కేంద్రం సహకారంతో ఎపి మళ్లీ అభివృద్ధి బాటలో పయనిస్తోందని చెప్పారు పరిశ్రమలను తరిమేసిన పాలన మీదని, పరిశ్రమలను తీసుకొచ్చే పాలన మాదని తెలిపారు. సమర్థ నాయకత్వంతో పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని ఆనం రామనారాయణరెడ్డి వెల్లడించారు.సుపరిపాలనకు రెండేళ్లయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి పాలన. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యం. ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి 3 గ్రీన్ ఫీల్డ్ పోర్టులు. చంద్రబాబు సమర్థ, సుస్థిర పాలనతో పెట్టుబడిదారుల్లో విశ్వాసం పెరిగింది. రాష్ట్రంలో భయాందోళనలు లేని, ప్రశాంత ప్రజాస్వామ్య పాలనకు రెండేళ్లు పూర్తి. మోదీ, చంద్రబాబు, పవన్ జోడీతో సమగ్రాభివృద్ధి దిశలో ఏపీ పయనిస్తోందనిమంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పేర్కొన్నారు.మంత్రి మండలి సమావేశంలో సముద్ర ఆహార ఉత్పత్తులోనూ గణనీయ ప్రగతి సాధించే దిశగా చర్యలు చేపడుతున్నాట్లు చంద్రబాబు స్పష్టం చేశారు. అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటులో జాప్యంపై సిఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీ సిటీలో బిజినెస్ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పని చేసుకుంటూ ఉన్నత చదువులు చదువుకునేందుకు వీలుగా యూనివర్సిటీ ఉండాలని సిఎం చంద్రబాబు సూచించారు. సిఎం మంత్రులతో పలు అంశాలపై చర్చించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిననాటి నుంచి నేటి వరకు ప్రజలకు అందించిన ప్రత్యేక పథకాల ఫలాలను అందరికీ చేరేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు.

# టిడిపి-3, జనసేన-1

>> మాట్లాడారు. టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌తోపాటు టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీచైర్మన్ నాదెండ్ల మనోహర్ భేటీలో పాల్గొన్నారు. రాజ్యసభ అభ్యర్థుల ఎంపిక, సర్, రెండేళ్ల పాలన విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లే అంశాలపై భేటీలో ప్రధానంగా చర్చించారు. అలాగే రాష్ట్రంలో త్వరలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపైనా చర్చ జరిగింది. అందులో భాగంగా మూడు రాజ్యసభ స్థానాలను టిడిపి, ఒక స్థానాన్ని జనసేన తీసుకోవాలని నిర్ణయించారు.బిజెపి తమకు సీటు కేటాయించాలని సమావేశంలో అభ్యర్ధన చేసింది.అయితే పార్టీల పరంగా కాకుండా రాజ్యసభలో కూటమికి ప్రాతినిధ్యం పెంచుకుందామని సిఎం వ్యాఖ్యానించారు.ఇప్పటికే రాజ్యసభకు ఇద్దరు బిజెపి సభ్యులను పంపించామని,ఈ పారి జనసేన ప్రాతినిధ్యం కల్పిద్దామని సిఎం స్పష్టం చేసారు.నిర్ణయానికి సిఎంకే వదిలేసినట్లు బిజెపి చెప్పడంతో మూడు సీట్లకు టిడిపి, ఒక సీటుకు జనసేన పోటీ చేయాలని నిర్ణయించారు.ఈ నిర్ణయం తరువాత అంతర్గతంగా చర్చించుకుని రాజ్యసభ అభ్యర్థుల పేర్లను టిడిపి, జనసేన త్వరలో ప్రకటించనున్నాయి.వైఎస్సార్సీ హయాంలో ఆ పార్టీ తరఫున రాజ్యసభకు ఎన్నికైన పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, పరిమళ్ నత్వానీతో పాటు, కూటమి అధికారంలోకి వచ్చాక టిడిపి తరఫున రాజ్యసభకు వెళ్లిన సానా సతీష్‌ల పదవీ కాలం త్వరలో ముగుస్తోంది. శాసనసభలో ఉన్న మెజారిటీ దృష్ట్యా ఈ నాలుగు స్థానాలూ కూటమికే దక్కనున్నాయి. ఈ నేపథ్యంలో టిడిపి, జనసేన ఈ స్థానాలను పంచుకున్నాయి. గతంలో వైఎస్సార్సీ తరఫున రాజ్యసభ సభ్యులుగా ఉన్న ఆర్.కృష్ణయ్య, బీద మస్తాన్‌రావు, విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ కూటమి అధికారంలోకి వచ్చాక తమ పదవులకు రాజీనామా చేశారు. ఆ నాలుగు స్థానాల్లో రెండు బిజెపికి కేటాయించి, టిడిపి రెండు స్థానాలు తీసుకుంది. ఆర్.కృష్ణయ్య బిజెపి నుంచి రాజ్యసభకు వెళ్లారు. విజయసాయిరెడ్డి ఖాళీ చేసిన స్థానంలో బిజెపి నాయకుడు పాకా సత్యనారాయణను ఎంపిక చేశారు. బీద మస్తాన్‌రావు టిడిపిలో చేరగా, ఆ స్థానాన్ని మళ్లీ ఆయనకే కేటాయించారు. మోపిదేవి వెంకటరమణ స్థానంలో సానా సతీష్ రాజ్యసభకు ఎంపికయ్యారు.

**రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా పలు కీలక నిర్ణయాలు- పల్లా**

కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా ఈ సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకున్నామని పల్లా శ్రీనివాస్ తెలిపారు. మరికొన్ని కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయించామన్నారు. ఎన్డీయే కూటమి నేతల భేటీ అనంతరం నాదెండ్ల మనోహర్, పివిఎన్ మాధవ్‌తో కలిసి మీడియాతో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర పాలనా విజయాలు ప్రజల్లోకి తీసుకెళ్లేలా కార్యాచరణ రూపొందిస్తాం మన్నారు. సంక్షేమ కార్యక్రమాలపై ఈనెల 9నతిరుపతిలో, పరిపాలనపై 12న అమరా వతిలో, అభివృద్ధిపై 15న విశాఖపట్నంలో బహిరంగసభలు నిర్వహిస్తా మన్నారు. జిల్లాల అభివృద్ధిపైనా కార్యక్రమాలుచేపడతాం. దీనికి సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటిస్తామన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు నిర్వహించే కార్యక్రమాల్లో కేంద్ర మంత్రులు కూడా పాల్గొంటారని చెప్పారు. 24 నెలల పాలనలో చేపట్టిన 24 ప్రధాన కార్యక్రమాలతోపాటు పథకాలపై ప్రచారం చేస్తామని వివరించారు. ఈ కార్యాచరణ ద్వారా ప్రజల ఆశీస్సులను మరోసారి కోరతామన్నారు. జనసేన రాజ్యసభ అభ్యర్థి ఎవరనేది పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ ప్రకటిస్తారన్నారు.

## వారం - వర్జ్యం

05-06-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, రోహిణి కార్తె
పంచమి రా. 1.18, శ్రవణ పూర్తి
వర్జ్యం : ఉ.8.04-ఉ.9.50
దు.ఉ.8.10-ఉ.9.02,
2) మ.12.31-మ.1.23
శుభసమయం : ఉ.7.00-8.00
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:** కుటుంబసభ్యుల విషయముల మీద మీ దృష్టిని కేంద్రీకరిస్తారు. ఉద్యోగులకు స్థానచలనం ఉంటుంది.

**వృషభం:** చర్చలకు, గోష్ఠులకు సహో ద్యోగులతో కలిసి హాజరౌతారు. ఇతర భాషలపట్ల విదేశాలపట్ల ఆకర్షణ కలుగుతుంది.

**మిథునం:** అప్రయత్నంగా అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగ విద్యావకాశాలు లభిస్తాయి. ఆర్థికపరిస్థితి మెరుగవుతుంది.

**కర్కాటకం:** సన్నిహితుల నుండి ముఖ్యమైన సమాచారం అందుతుంది. కీలక వ్యవహారాలు పూర్తి చేస్తారు.

**సింహం:** కార్యాలయంలో ప్రతికూల వాతా వరణం నెలకొంటుంది. షేర్లుభూముల క్రయ విక్రయాలలో స్వల్పలాభాలు పొందుతారు.

**కన్య :** వాహనాలు, ఆభరణాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. రాజకీయ, పారి శ్రామిక రంగాల వారికి విదేశీపర్యటనం.

**తుల :** ఋణాలు తీరే మార్గం దొరికి నందుకు ఊరట చెందుతారు. కీలక నిర్ణ యాలలో స్వంతఆలోచనలు శ్రేయస్కరం.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులు సోదరుల సహకారంతో పూర్తి చేస్తారు. శుభ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు.

**ధనుస్సు:** కీలక వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. సంగీత, సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు.

**మకరం:** కొత్త పెట్టుబడులను వాయిదా వేయడం మంచిది. వివాదాలకు దూరంగా ఉండండి.బంధువుల కలయిక ఉంటుంది.

**కుంభం:** ముఖ్యమైన పత్రాలు, వస్తువుల భద్రతపట్ల జాగ్రత్తలు వహించండి. కాంట్రాక్టులు శ్రమానంతరం దక్కుతుంది.

**మీనం:** క్రయ విక్రయాలలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవడం శ్రేయస్కరం. అకాలభోజనం,అలసట ఇబ్బంది కలిగిస్తాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఎసిబి వలలో అటవీ అధికారి

## రూ. 2 లక్షల లంచం కేసు

**కొడిమ్యాల, ప్రభాతవార్త:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల అటవీశాఖ కార్యాలయంలో ఎన్నడూ లేని విధంగా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన ట్రాప్ ఆపరేషన్ స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది. ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలోనే లంచం తీసుకుంటూ ఫారెస్ట్ రేంజ్ అధికారి గులాం మొయినుద్దీన్ పట్టుబడటం అటవీశాఖ వర్గాల్లో సంచలనంగా మారింది. ఏసీబీ అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం టేకు చెట్ల నరికివేతకు అనుమతి, రవాణా పర్మిట్ జారీ కోసం సంబంధిత అధికారి భారీగా రూ.2 లక్షల లంచం డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.1 లక్ష తీసుకున్నారని, మిగిలిన మొత్తాన్ని రూ.80 వేలుగా తగ్గించి గురువారం మధ్యాహ్నం కొడిమ్యాల ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో స్వీకరిస్తుండగా ఏసీబీ కరీంనగర్ యూనిట్ అధికారి ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తమ అధికారుల సమన్వయంతో పక్కా ప్రణాళికతో వల పన్ని పట్టుకున్నారు. అధికారి కూర్చున్న టేబుల్ డ్రా నుంచి రూ.80 వేల కలుషిత లంచం సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అధికారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరుచనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. కొడిమ్యాల అటవీశాఖ కార్యాలయంలో చరిత్రలో తొలిసారి ఇలాంటి ఏసీబీ ట్రాప్ జరగడం అధికార వ్యవస్థలో పారదర్శకత, బాధ్యత, ప్రజా విశ్వాసంపై మరోసారి చర్చకు కారణమైంది. ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఆరోపణలు వెలుగులోకి వచ్చిన ప్రతిసారి ప్రజల్లో పనులు చేయించుకోవాలంటే లంచం తప్పదా..అనే ప్రశ్న మళ్లీ ముందుకు వస్తోంది. ఏసీబీ అధికారులు ప్రజలకు సూచిస్తూ ఎవరైనా ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064 ద్వారా ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ కోరారు.




గురువారం పంచాయతీ రాజ్ సాధించిన అవార్డులను సిఎం చంద్రబాబు సమక్షంలో ప్రదర్శిస్తున్న దృశ్యం

# పంచాయతీరాజ్ శాఖకు వచ్చిన కేంద్ర అవార్డులు కేబినెట్‌లో ప్రదర్శన

## డి. సిఎం పవన్‌కు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీరాజ్ శాఖ సాధిస్తున్న విజయాలపట్ల ఆ శాఖను నిర్వహిస్తున్న డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను సిఎం చంద్రబాబునాయుడు అభినందించారు.మంత్రివర్గ భేటీలో పంచాయతీరాజ్ శాఖకు వచ్చిన కేంద్ర అవార్డులను ప్రదర్శించారు. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్, పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సిఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.ప్రత్యేకించి కేంద్ర అవార్డులపై పవన్‌కల్యాణ్‌కు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపారు.. అన్ని శాఖలు అత్యుత్తమ పనితీరు కనబరిచేం దుకు ఈ అవార్డులను స్ఫూర్తిగా తీసుకోవాలని చంద్రబాబు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అందజేస్తున్న సహకారంతో పంచాయతీరాజ్ శాఖ నిబద్ధతతో ముందుకు వెళ్తూ,మంచి ఫలితాలను సాధిస్తుందని ఈ సందర్భంగా డీసీఎం చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు.

# ఏడు దశల్లో 'సర్'

>> కేంద్రాలను ఏర్పాటు చేస్తారన్నారు. నాల్గవదశలో జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేసి, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ముద్రిత, సాఫ్ట్ కాపీలను అందజేస్తారు. ఐదవ దశలో జూలై 21 నుంచి ఆగస్టు 20 వరకు అభ్యంతరాలు, దరఖాస్తులను స్వీకరిస్తారు. ఆరవదశలో వచ్చిన అభ్యర్థనలు, అభ్యంతరాలను విచారించి నిర్ణయాలు తీసుకోవడం.ఏడవ దశలో అన్ని ప్రక్రియలు పూర్తయ్యాక తుది ఓటర్ల జాబితాను ప్రకటించడం జరుగుతుందని తెలిపారు. గురువారం ఉదయం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)-2026 కార్యక్రమం అమలుపై ఉప కార్యదర్శి సంజయ్ కుమార్, తిరుపతి జిల్లా ఎన్నికల అధికారి,జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్ తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితాను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ఎన్నికల సంఘం చర్యలు చేపడుతోందన్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని ఆదేశించారు.ఉప కార్యదర్శి సంజయ్ కుమార్ మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిర్దేశించిన 7 దశల అంశాలపై కార్యక్రమానికి హాజరైన వారికి పిపిటి ద్వారా వివరించారు.

ఎన్యుమరేషన్ ఫారాల సేకరణ, పరిశీలన, ధృవీకరణ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ఓటర్ల వివరాలు మాత్రమే జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. డూప్లికేట్ నమోదులు, అనర్హమైన మార్పులు లేదా వివరాల లోపాలు లేకుండా ప్రతి దరఖాస్తును పూర్తిస్థాయిలో ధృవీకరించాలని తెలిపారు. రాజకీయ పార్టీలు లేదా ఇతర వర్గాలు సమర్పించే సమాచారం విషయంలో స్వతంత్రంగా పరిశీలన చేపట్టి, అవసరమైతే సంబంధిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను నిర్ధారించాలని సూచించారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో విశ్వాసం నిలబెట్టేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

పారదర్శకమైన, తప్పులేని ఓటరు జాబితాను రూపొందించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు. జూలై 14 నాటికి ఇంటింటి సర్వే పూర్తి చేసి సమగ్ర ముసాయిదా ఓటరు జాబితాను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేకంగా ఢిల్లీ నుంచి విచ్చేసి కార్యక్రమ పురోగతిని సమీక్షించి సూచనలు సలహాలు తెలిపిన భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్, ఉప కార్యదర్శి సంజయ్ కుమార్‌కి జిల్లా యంత్రాంగం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల సంయుక్త కలెక్టర్లు ఆర్. గోవిందరావు, ఆదర్శ్ రాజేంద్రన్, శివ్ నారాయణ్ శర్మ, తిరుపతి, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లాల రెవెన్యూ అధికారులు, జి.నరసింహులు, విజయ్ కుమార్, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఐసియులో అగ్నిప్రమాదం

>> లోపల ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారు. వీరిలో ఇద్దరు అక్కడే చనిపోయారు. మిగిలిన వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి చనిపోయాడు. దీంతో మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఇక, ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం జరిగినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. అగ్నిమాపక శాఖ అధికారి రామ్ నివాస్ పాండే మాట్లాడుతూ ఐసీయూ నుంచి 15 20 మందిని కాపాడామని,వారిలో ఇద్దరు అక్కడే చనిపోయారు. మిగిలిన వారిని దగ్గరలోని ఆస్పత్రికి తరలించాము. వారి ఆరోగ్య పరిస్థితి గురించి మాకు అప్‌డేట్ లేదని తెలిపారు. ఈ సంఘటనపై డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ సుబ్రత్ కుమార్ సేన్ మాట్లాడుతూ అగ్నిప్రమాదం జరిగిన సమయంలో ఐసీయూలో 13 మంది ఉన్నారు. సీసీయూలో మరి కొంతమంది ఉన్నారు. ఇప్పటి వరకు ముగ్గురు చనిపోయారు. దర్యాప్తు ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

# రాజ్యసభకు బిజెపి అభ్యర్థులు వీరే

**న్యూఢిల్లీ, జూన్ 4:** రాజ్యసభ ఎన్నికలు, ఒడిశా ఉప ఎన్నికకు సంబంధించి బీజేపీ తన అభ్యర్థుల జాబితాను గురువారం ప్రకటించింది. మొత్తం 11 మంది అభ్యర్థులతో జాబితాను విడుదలచేసింది. రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎంపీ అభ్యర్థులుగా సతీశ్ పూనియా, అల్కా గుర్జర్, మధ్యప్రదేశ్ నుంచి తరుణ్ చుగ్, రజనీశ్ అగ్రవాల్, అరుణాచల్ ప్రదేశ్ నుంచి తాయ్ తాగాక్, మణిపూర్ నుంచి శారదా దేవిని బరిలోకి దింపింది. గుజరాత్ నుంచి రాజూభాయ్ శుక్లా, ముకేశ్‌భాయ్ రాఠ్వా, మాన్‌సింగ్ పర్మార్, జితేంద్రసింగ్, మేఘ్‌జీభాయ్ కంజారియా బరిలో నిలిచారు.ఇక ఒడిశా రాజ్యసభ ఉపఎన్నికలో దేబాశిష్ సామంతరాయ్‌ను రంగంలోకి దించింది. జూన్ 18న ఎగువ సభకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

# నలుగురు చిన్నారుల మునక

>> చారు. సంఘటన విషయం తెలిసిన వెంటనే గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యల్లో పాల్గొన్నారు. తాలూకా సిఐ విజయ్ కృష్ణతో పాటు ఇతర అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. రాష్ట్ర సామాజిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. వేసవి సెలవుల నేపథ్యంలో చిన్నారులు స్నేహితులతో కలిసి ఈత కోసం నీటి కుంట వద్దకు వెళ్లినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. నీటి లోతు ఎక్కువగా ఉండటం, భద్రతా ఏర్పాట్లు లేకపోవడం ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఒకరిని కాపాడేందుకు మరొకరు ప్రయత్నించే క్రమంలో నలుగురూ నీటిలో చిక్కుకుని ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు. చిన్నారులు చదువుతున్న పాఠశాలల్లో విషాద వాతావరణం నెలకొంది. ఉపాధ్యాయులు, సహవిద్యార్థులు మృతుల కుటుంబాలకు ప్రగాఢ సాను భూతి తెలిపారు. గ్రామంలోని వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా మూసివేసి చిన్నారులకు నివాళులర్పించాయి. పలువురు ప్రజాప్రతినిధులు సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రమాదకరమైన నీటి కుంటలు, చెరువుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. చిన్నారులు ఒంటరిగా నీటి వనరుల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఈ ఘటన చెరువుకొమ్ముపాలెం గ్రామంతో పాటు జిల్లావ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది. పోలీసులు కేసు నమోదు చేసి పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నారు.ఘటనపై స్పందించిన మంత్రి బాల వీరాంజనేయ స్వామిఒంగోలు నగర పరిధిలోని చెరువు కొమ్ముపాలెం వద్ద నీటి కుంటలో పడి నలుగురు చిన్నారులు మృతి చెందిన ఘటనపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి స్పందించారు విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎస్పీతో మంత్రి మాట్లాడారు గాలింపు చర్యలు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

రాజమహేంద్రవరం

: fb.com/vaartha Digital

Published from Rajahmundry, Vijayawada, Hyderabad, Visakhapatnam, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

5-6-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 125 పేజీలు: 8+4 వెల: 6.50

తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్‌కు రాజ్యసభ సీటు 2లో

మహాకుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు 5లో


గురువారం ఉండవల్లిలో జరిగిన ఎన్డీయే కూటమి సమావేశంలో పాల్గొన్న సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నాదెండ్ల, బిజెపి అధ్యక్షుడు మాధవ్

## టిడిపి - 3 జనసేన - 1

### రాజ్యసభ సీట్ల పంపకం

### త్వరలో పేర్లు ప్రకటన

### ఎన్డీయే సమావేశంలో నిర్ణయం

**విజయవాడ,జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ 3, జనసేన పార్టీ ఒక స్థానం కేటాయించాలని సిఎం చంద్రబాబు నేతృత్వంలో గురువారం సాయంత్రం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి ఎన్‌డిఎ కూటమిలో కీలక నిర్ణయం తీసుకున్నారు.ఈ సమావేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రెండేళ్లపాలనపై ఉమ్మడి కార్యాచరణ, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నంలో బహిరంగ సభలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశం అనంతరం ఆయా పార్టీల నేతలు విలేకర్లతో >>2

# కృష్ణా తీరంలో 'అమరావతి ఐ' ప్రాజెక్టు

### మంత్రిమండలి సమావేశంలో ఆమోదం

### ప్రభుత్వరంగ సంస్థలు, గురుకులాల్లో రిటైర్మెంట్ 62 యేళ్లకు పెంపు

### కొత్త ఏవియేషన్ పాలసీ, ఎక్సైజ్ పాలసీ మార్గదర్శకాలను ఆమోదించిన కేబినెట్

### అవయవ మార్పిడి చట్టం అమలుకు నిర్ణయం


గురువారం సిఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం దృశ్యం

**విజయవాడ,జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** అమరావతి అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, ఏవియేషన్, ఉపాధి, మత్స్యరంగం, పోలవరం, పారిశ్రామికపార్కులు, పోర్టులు, పర్యాటకం వంటి అంశాల ప్రతిపాదనలపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రిజర్వాయర్ల కేజ్ కల్చర్ పాలసీ 2025 ముసాయిదాను ఆమోదించింది. మద్దువలస, యేలేరు రిజర్వాయర్లలో ఫిషిన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు కేజ్ కల్చర్ యూనిట్ల ఏర్పాటుకు కేబినెట్ అనుమతించింది. నేడు సిఎం చంద్రబాబు అధ్యక్షతన మూడు గంటల పాటు కేబినెట్ భేటీ జరిగింది.ఆంధ్రప్రదేశ్ ఏవియేషన్ పాలసీ2026కు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అమరావతి క్వాంటమ్ వ్యాలీకి కేటాయించిన భూమి రిజిస్ట్రేషన్‌పై స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయింపునను ఆమోదించింది. మానవ అవయవ మార్పిడి చట్టం అమలుకు ఆర్డినెన్స్ జారీ చేసే ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. చీరాల, విశాఖపట్నంలో బీచ్ షాక్స్ ఏర్పాటుకు ఎక్సైజ్ పాలసీ మార్గదర్శకాలకు కేబినెట్ ఆమోదించింది. జలవనరుల శాఖలో పోలవరం సహా వివిధ ప్రాజెక్టుల పనులకు మంత్రివర్గం పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అగ్రిగోల్డ్ తదితర డిపాజిటర్ల కేసుల పరిష్కారం కోసం 21 పోస్టుల మంజూరుకు >>2

## జూన్-4 చరిత్రలో మిగిలే రోజు

### మళ్లీ అభివృద్ధి బాటలో ముందుకు: సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూన్4,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ చరిత్రలో జూన్ 4, 2024 చిరస్థాయిగా నిలిచిపోయే రోజని ముఖ్యమంత్రి చంద్రబాబు అభివర్ణించారు. విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని నడిపించాలని ప్రజలు అపూర్వమైన తీర్పు ఇచ్చిన చారిత్రక దినానికి నేటితో రెండేళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఆ విజయం తమకు అధికారం కాదని, రాష్ట్ర పునర్నిర్మాణానికి ప్రజలు అప్పగించిన మహోన్నత బాధ్యత అని సిఎం స్పష్టం చేశారు. ఆ బాధ్యతనుగౌరవిస్తూ ప్రతి క్షణం ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.కేబినెట్ భేటీలోను, ముగిశాక వివిధ అంశాలపై మంత్రులతో సిఎం చంద్రబాబు చర్చించారు. ప్రభుత్వం చేస్తున్న >>2

## వానలొచ్చేశాయ్..

### కేరళంలోకి రుతుపవనాలు ప్రవేశం

### రెండు రోజుల్లో రాయలసీమలోకి



**తిరువనంతపురం / న్యూఢిల్లీ, జూన్ 4:** ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు కేరళంలోకి అధికారికంగా ప్రవేశించాయి. దీంతో కేరళంలో విస్తృతంగా వర్షాలు కురుస్తుండగా, రానున్న రోజుల్లో ఇవి దేశంలోని ఇతర ప్రాంతాలకు కూడా విస్తరించనున్నాయి. దీంతో భారతదేశపు అత్యంత ముఖ్యమైన వర్షాకాలం ప్రారంభమైంది. >>2

## సిఎం పర్యావరణం స్పెషల్

### నేడు సైకిల్‌పై ప్రయాణించనున్న చంద్రబాబు



**విజయవాడ, జూన్4, ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలు, ప్రజా ప్రతినిధులు, నేతలు, ఉద్యోగులు ఈ నెల 5న సైకిల్‌పై ప్రయాణించి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం తీసుకోవాలని సిఎం చంద్రబాబు 'ఎక్స్' వేదికగా చేసిన పోస్టులో పిలుపునిచ్చారు. పచ్చదనం పెంచేలా ప్రతీ ఒక్కరూ ఒక మొక్క నాటాలని సిఎం చంద్రబాబు కోరారు,ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అందరం కలిసి ఒక సంకల్పం చేద్దాం. భూమి మన ఇల్లు.. ప్రకృతి మన జీవనాధారం. పర్యావరణాన్ని రక్షించుకోవడం మన >>2

## ఎపికి 5 జాతీయ పంచాయతీ అవార్డులు

**విజయవాడ జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అనకాపల్లి జిల్లా శృంగవరానికి గుడ్ గవర్నెన్స్ అవార్డు రూ.కోటి నగదుబహుమతి దక్కింది. గుడ్ గవర్నెన్స్ విభాగంలో జాతీయ స్థాయిలో శృంగవరం గ్రామానికి మొదటిస్థానం లభించింది. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో మొదటిస్థానం లభిచింది. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ విభాగంలో తిరుపతి జిల్లా బొక్కసం పాలేనికి మొదటి స్థానంతో పాటు రూ.కోటి నగదు బహుమతి దక్కింది. పేదరిక నిర్మూలన విభాగంలో కడప జిల్లా చెమ్ముల‌పల్లికి రెండో స్థానంతోపాటు రూ.75 లక్షలునగదు బహుమతి లభించింది. స్వయం సమృద్ధి విభాగంలో ప్రకాశం జిల్లా గుండమాలకు మూడో స్థానం దక్కడంతోపాటు రూ.50 లక్షలు నగదు బహుమతి లభించింది. సుస్థిరాభివృద్ధి విభాగంలో కుప్పం మండలానికి మూడో స్థానంతో పాటు కోటి 50 లక్షలు నగదు బహుమతి దక్కింది.

# రాష్ట్రానికి ఇఎంఫ్ స్టీల్ ప్లాంట్!

### సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నోవోస్టల్-ఎం చైర్మన్ ఇవాన్ డెమ్చెంకోతో మంత్రి లోకేష్ చర్చలు

### వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సమావేశం

### ఫార్మా వ్యవసాయ ఉత్పత్తిదారులకోసం వ్యవస్థీకృత రుణాలు అందించాలని లోకేష్ వినతి


గురువారం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో నోవోస్టల్-ఎం, వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సమావేశమైన మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** రష్యాకు చెందిన ప్రముఖ మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ నోవోస్టల్ - ఎం సంస్థ ఛైర్మన్ ఇవాన్ డెమ్చెంకోలతో ఐటి శాఖా మంత్రి లోకేష్ సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో కీలక సమావేశమయ్యారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలను లోకేష్ ఆయనకు వివరించారు. రష్యాలో పర్యటిస్తున్న విద్య,ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖలమంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా వివిధ పారిశ్రామిక సంస్థల ప్రతినిధులతో సమావేశం అవుతున్నారు. ఈ క్రమంలోనే తన మూడవ రోజు పర్యటనలో భాగంగా మెటలర్జికల్ హోల్డింగ్ కంపెనీ నోవోస్టల్ - ఎం సంస్థ ఛైర్మన్ ఇవాన్ డెమ్చెంకో భేటీ అయ్యారు దేశంలో వేగవంతమైన పర్యావరణ అనుమతులు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాల మార్కెట్ మద్దతుతో భారత్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు.

ఉన్నత శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే ఒక అత్యాధునిక ఇఎఫ్ స్టీల్ ప్లాంట్‌ను ఎపిలో నిర్మించాలని డెమ్చెంకోకు లోకేష్ విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు ఉన్న అనుకూలతలను లోకేష్ వివరించారు. దేశంలో వేగవంతమైన పర్యావరణ అనుమతులు, శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మౌలిక సదుపాయాల మార్కెట్ మద్దతుతో భారత్ దూసుకుపోతోందని ఆయన పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉన్నత శ్రేణి రీబార్, వైర్ రాడ్‌లను తయారుచేసే ఒక >>2

## పవన్‌పై వైఎస్ కేసులు పెట్టారా?

### ఆరోపణలు అసత్యం..

### పోలీసు అధికారికి లైడిటెక్టర్ టెస్ట్ చేయాలి..

### డి. సిఎంకు కెవిపి ఘాటు లేఖ

**విజయవాడ జూన్4 ప్రభాతవార్త ప్రతినిధి:** పవన్ కల్యాణ్‌కు కేవీపీ ఘాటు లేఖ రాశారు. కాంగ్రెస్ అనగానే వైఎస్ గుర్తొచ్చినందుకు ధన్యవాదాలు, వైఎస్సార్ విషయంలో మీ వ్యాఖ్యలను ఖండిస్తున్నా వైఎస్సార్‌కు వైసీపీకి ఎలాంటి సంబంధం లేదు. వైఎస్ సిఎంగా ఉన్నప్పుడు మీపై ఎలాంటి కేసులు పెట్టలేదు. వైఎస్ కేసులు పెట్టమన్నారన్న పోలీస్ అధికారికి లై డిటెక్టర్ టెస్ట్ చేయాలి. పోలీసు అధికారి చెప్పింది నిజమైతే సిఎం రిలీఫ్‌ఫండ్‌కు లేదా స్వచ్ఛంద సంస్థకు రూ.10 కోట్లు ఇస్తా. వైఎస్ చనిపోయిన 17 ఏళ్ల తర్వాత కూడా ఆయనపై ఆరోపణలు చేయడం అవివేకం తెలుగు రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలంగా ఉందని అన్నారు.

## బీహార్‌లోని ఆస్పత్రి ఐసియులో అగ్నిప్రమాదం

### ఐదుగురు మృతి, పలువురికి తీవ్రగాయాలు

**పాట్నా, జూన్ 4:** బీహార్‌లో పెను విషాదం చోటుచేసుకుంది. ఆస్పత్రి ఐసీయూలో అగ్ని ప్రమాదం జరిగిన ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోగా 20 మంది వరకూ తీవ్రంగా గాయ పడ్డారు. గురువారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. ముజఫర్‌పూర్ జిల్లాలోని ఓ ఆస్పత్రి ఐసీయూలో గురువారం తెల్లవారుజామున 3.55 గంటల ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో ఐసీయూలో 20 మంది దాకా పేషంట్లు ఉన్నారు. వారందరూ మంటల్లో చిక్కుకుపోయారు. ఆస్పత్రి సిబ్బంది వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బందితో పాటు పోలీసులు కూడా సంఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక చర్యలు చేపట్టారు. >>2


నీటికుంటవద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న పోలీసులు, స్థానికులు

## నీటికుంటలో నలుగురు చిన్నారుల మునక

### ఒంగోలు పరిధిలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో దుర్ఘటన

**ఒంగోలు క్రైమ్, జూన్ 4, ప్రభాతవార్త:** ఒంగోలు నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెం గ్రామంలో గురువారం హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కరేటి అభిరామ్ (14), కరేటి సుశాంత్ (12), పొదిలి చిన్ను (11), ఇల్లా దినేష్ (10) అనే నలుగురు చిన్నారులు సమీపంలోని నీటి కుంట వద్దకు వెళ్లి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందారు. చిన్నారులు ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గాలింపు చేపట్టిన సమయంలో నీటికుంట ఒడ్డున వారిదుస్తులు, చెప్పులు కనిపించడంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు సంఘటనా స్థలానికి చేరుకుని విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. తొలుత అన్నదమ్ములు కరేటి అభిరామ్, కరేటి సుశాంత్ మృతదేహాలను వెలికితీయగా, అనంతరం పొదిలి చిన్ను, ఇల్లా దినేష్ మృతదేహాలను కూడా నీటి కుంటలో గుర్తించి బయటకు తీశారు. చిన్నారుల మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిం >>2

# ఏడు దశల్లో 'సర్'

### 14వ తేదీలోగా శిక్షణ కార్యక్రమాలు పూర్తి

### రెండో దశలో ఇంటింటి సర్వేలు

### మూడో దశలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ

### ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ వెల్లడి


గురువారం తిరుపతిలో 'సర్' అమలుపై సమీక్ష నిర్వహిస్తున్న భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ తదితరులు

**తిరుపతి,జూన్ 4ప్రభాతవార్తప్రతినిధి:** ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని భారత ఎన్నికల సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ కుమార్ తెలిపారు. ఎన్నికల సంఘం 2026 మే 14న 20 రాష్ట్రాల్లో ప్రత్యేక విస్తృత ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని ప్రకటించిందన్నారు. ఈకార్యక్రమం మొత్తం ఏడుదశల్లో నిర్వహించబడు తుందన్నారు. మొదటిదశలో శిక్షణ కార్యక్రమాలు, ఫారాల ముద్రణ వంటి సన్నాహక చర్యలు చేపట్టి జూన్ 14 నాటికి పూర్తి చేయనున్నారని, రెండో దశలో బూత్ స్థాయి అధికారులు (బిఎల్‌ఒలు) ఇంటింటి సర్వే నిర్వహించి ఓటర్ల వివరాలను సేకరిస్తారని, ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బందిని బదిలీ చేయరాదని ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. మూడో దశలో పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ చేపడతారని, ఒక పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండేలా కొత్త >>2

## గాదె సాయికృష్ణను కోర్టులో హాజరు పర్చండి

### హెబియస్ కార్పస్ పిటిషన్‌లో ఆదేశాలిచ్చిన హైకోర్టు 6లో

వార్త


క్షమించడం, క్షమాపణ పొందడం ఒకే నాణేనికి రెండు వైపులు. వాటి మధ్య సమన్వయం సాధించడమే ముఖ్యమైన కర్తవ్యం.

-ఇ. గిబ్బన్

# నిర్లక్ష్యానికి పరాకాష్ట!


దేశ రాజధాని ఢిల్లీలో మెడికల్ టూరిజానికి ఏమాత్రం భద్రత ఉండదని అనుమానించే దుర్ఘటనకు బుధవారం రాజధానిలో జరిగిన అగ్నిప్రమాదం 21 మంది ప్రాణాలను బలితీసుకోవడం సాక్షీభూతమైంది.'అభివృద్ధి, సాంకేతిక పురోగతి గురించి గర్వంగా మాట్లాడుకునే సమాజంలో ఇప్పటికీ ప్రాథమిక భద్రతా ప్రమాణాల నిర్లక్ష్యమే ఇలాంటి దుర్ఘటనలకు కారణమవడం విచారకరం. దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్‌లోని 'ఫ్లోరిష్ స్టే' అనే బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ హోటల్‌లో బుధవారం ఉదయం 8:50 గంటలకు భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గ్రౌండ్ ఫ్లోర్‌లోని 'లెమన్ గ్రీన్'రెస్టారెంట్ నుంచి మొదలైన మంటలు ఆరు అంతస్తులకు వ్యాపించాయి. ఎంతో మంది ప్రాణాలు సజీవ దహనమయ్యాయి. వారిలో ఎక్కువ మంది వైద్య సేవలు కోసం భారత్‌కు వచ్చిన విదేశీ అశ్రితులే. తీవ్రమైన మంటల మధ్యన భయంతో పైఅంతస్తు నుంచి కిందకు దూకుతున్న వీడియోలు అందరికీ ఎంతో హృదయ విదారకంగా అనిపించాయి. వారిని ఏ విధంగానూ రక్షించలేని పరిస్థితుల్లో ప్రత్యక్ష సాక్షులు కూడా విలవిల్లాడిపోయారు. ప్రమాద సమయంలో లాడ్జిలో ఉన్న వారంతా గాఢనిద్రలో మునిగి ఉన్నందున మృత్యువునుంచి తప్పించుకోలేకపోయారు. ఈ ఘటనలో అనేక మంది పొగతో ఉక్కిరిబిక్కిరై మరణించగా, కొందరు ప్రాణాలను కాపాడుకోవడానికిభవనంపై అంతస్తుల నుంచి దూకాల్సిన పరిస్థితి ఏర్పడింది. అత్యవసర పరిస్థితుల్లో బయటపడేందుకు ఒక్క దారీ సరైనదిలేకపోవడం,ప్రత్యామ్నాయ మార్గమే ఏర్పాటులో లేకపోవడం, భవన యజమానులు భద్రతా నిబంధనలను పాటించకపోవడం, నిరంతర తనిఖీలలో లోపాలు ఉండటం వంటి అంశాలు ఈ విషాదానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. భవనానికి ఫైర్ డిపార్ట్‌మెంట్ అనుమతి లేదు. ఇన్‌హౌస్ ఫైర్ ఫైటింగ్ వ్యవస్థ లేదు. పై అంతస్తులకు ఒకేదారిలో సాధారణ మెట్లు నిర్మితం, ఒకే ప్రవేశ నిష్క్రమణ ద్వారం మాత్రమే. ప్రాథమిక నివేదికల ప్రకారం భవనంలో సరైన అగ్నిమాపకభద్రతా ఏర్పాట్లు లేకపోవడం, ఒకే ప్రవేశ నిష్క్రమణ మార్గం ఉండటం వంటి అంశాలు ప్రాణనష్టాన్ని పెంచినట్లు తెలుస్తోంది. ప్రాథమిక దర్యాప్తులో భవనంలో అగ్నిమాపక భద్రతా ప్రమాణాలు తగిన స్థాయిలో లేవని వెల్లడైంది. మృతుల్లో బంగ్లాదేశ్, నైజీరియా,మొజాంబిక్, లైబీరియా, తుర్క్‌మెనిస్తాన్ వాసులు ఉన్నారు. వారు దగ్గరలోని ఆస్పత్రిలో చికిత్స కోసం ఉండేవారు. అంటే ఈ ప్రాంతం 'మెడికల్ టూరిజం' కోసం వచ్చేవారికి ఆశ్రయం కల్పిస్తోందన్న జిజ్ఞాసఉంది. కానీ అక్కడ భద్రత శూన్యమనీ,అక్రమ నిర్మాణాలకు ఆశ్రయం ఇచ్చేవ్యవస్థలో మార్పురాకపోతే,మాలవియా నగర్‌లో ఇలాంటి ఘటనలు మళ్లీ మళ్లీ జరగవనే గ్యారంటీ ఏమీ లేదు. విచిత్రమే మిటంటే ఆ భవనానికి అగ్ని నుండి భద్రత కలిగించే ఒక్క జాగ్రత్త కూడా తీసుకోలేదు.మరి ఏలిన వారు ఏమి చేస్తున్నారో. తిలాపాపం తలో పిడికెడు అన్నట్లు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్ వారి భాగస్వామ్యమూ ఈ హోటల్ అనుమతులలో నిర్లక్ష్యం ఉంది. ఆ హోటల్‌లో 20 గదులున్నాయి. కానీ కేవలం 6 గదులకు మాత్రమే అనుమతులున్నాయి. భవనయజమాని లోకేష్ బజాజ్‌ని అరెస్ట్ చేశారు. ఎంతోమంది బలైపోయిన ఒక సంఘటనలో భవన యజమానిని అరెస్ట్‌తో పోలీసుశాఖ, బాధ్యులైన ఇతర అధికారుల బాధ్యత తీరుతుందా.? ఇలాంటి ప్రమాదాల్లో ఒక అరెస్ట్ చేసేసి పోలీసులు చేతులుదులు పుకుంటారని మనకు తెలిసిందే. ఢిల్లీ అగ్నిప్రమాదం కేవలం ఒక ప్రమాదం కాదు, ఇది భద్రతా వ్యవస్థల్లో ఉన్న లోపాలపై ఒక హెచ్చరిక. పోయిన ప్రాణాలు తిరిగిరావు. అయితే వారి మరణాలు అధికారిక సమాజాన్ని తట్టి లేపాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం, భద్రతపై రాజీ పడిన ప్రతి చోట మరో విషాదం పొంచి ఉందని ఈ ఘటన ప్రభుత్వాలకు గుర్తుచేస్తోంది. అగ్నిమాపక భద్రత నిబంధనలు ఉల్లంఘించే అన్ని గెస్ట్‌హౌస్‌లు, హోటళ్లను సీల్ చేయాలి. బాధ్యులపై ఢిల్లీ ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. అన్ని వాణిజ్య భవనాలకు ఏటా ఫైర్ సేఫ్టీ ఆడిట్ చేయాలి. సర్టిఫికేట్ లేకపోతే కరెంట్ కట్, లైసెన్స్ రద్దు. అంతస్తుల పైన ఉన్న ప్రతి భవనానికి కనీసం 2వైపులా మెట్లు, ఫైర్ ఎస్కేప్ తప్పనిసరి చేయాలి.లేకపోతే అనుమతినీయకుండా నిబంధాలను రూపొందించుకోవాలి.ఫైర్ ఆఫీసర్ అనుమతిలేకుండా హోటల్ నడిపితే యజమానితో పాటు సంబంధిత అధికారిని కూడా బాధ్యులను చేయాలి.ఢిల్లీ టూరిజం, ఆస్పత్రులు విదేశీ రోగులకు భద్రత చెక్‌లిస్ట్ ఇవ్వాలి. అన్ని గెస్ట్ హౌస్‌లలో ఆటోమేటిక్ స్ప్రింక్లర్, స్మోక్ డిటెక్టర్ తప్పనిసరి. నానోసెన్సార్ల ద్వారా రియల్‌టైమ్ మానిటరింగ్. షార్ట్ సర్క్యూట్‌లు, విద్యుత్ లోపాలు అనేకఅగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నందున నిరంతర తనిఖీలు అవసరం. భవనం భద్రతా నిబంధనలు పాటించకపోతే, అవి ముందుగానే గుర్తించాల్సిన బాధ్యత తనిఖీ అధికారులపై కూడా ఉంటుంది. ఫైర్ సేఫ్టీ తనిఖీలు క్రమం తప్పకుండా జరిగి ఉంటే ప్రమాదం తీవ్రత తగ్గే అవకాశం ఉండేది.దేశంలో అనేకప్రాంతాల్లో భవననియమాలు, అగ్నిమాపక నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయనే విమర్శలు తరచుగా వినిపిస్తుంటాయి. ఈ ఘటన కూడా అమలు లోపాలను బహిర్గతం చేసింది. దేశవ్యాప్తంగా హోటళ్లు, లాడ్జీలు, రెస్టారెంట్లలో భద్రతా తనిఖీలను తప్పనిసరి చేయడం కూడా అత్యవసరం.

తరచూ అబద్ధాలు చెప్పినందువల్ల ఒక్కోసారి నిజం చెప్పి కూడా ఎదుటి వారిని నమ్మించలేని పరిస్థితి తెచ్చుకుంటాం.



బైరన్

జ్ఞానం ఉపదేశాల వల్ల, ఉపన్యాసాలు వినడం వల్ల రాదు. అనుభవపూర్వకంగా మాత్రమే తెలిసేది.



మార్షల్

## ప్రజావాక్కు



### పతనమవుతున్న విలువలు

మనదేశంలో వినోదమే ప్రధానంగా సాగే టీవీ ఛానళ్లలో ప్రసారం అయ్యేసీరియళ్లలో విలువలు పతనమవుతున్నాయి. దేశంలోని అన్ని భాషలలో వచ్చే సీరియళ్ళు దాదాపుగా ఒకే మూస పద్ధతిలో ఉంటున్నాయి.ఈ సీరియళ్ళు ప్రముఖంగా పగ, ప్రతీకారం,ఈర్ష, ద్వేషం, మోసం, దగా, కుయుక్తులు, కుట్రలు, హత్యలు, దొంగవేషాలు, నమ్మించి మోసగించటం వంటికథాంశాలతో ఊదరగొడుతున్నాయి.వృద్ధులు,మహిళలు,పనీపాట లేనివారు ఇత్యాది వర్గాలు వీరి టార్గెట్. ఉదయం నుంచి రాత్రి వరకు ఎడతెరపి లేకుండా, ఆ ఛానల్ ఈ ఛానల్ అని లేకుండా అన్ని ఛానళ్లలో వినోదరంగం ప్రజలను టీవీలకు అతుక్కుపోయేంతగా బానిసలను చేస్తోంది.టీవీ సీరియళ్లలోని వివిధ భావోద్వేగాలు ప్రజలను ప్రభావితం చేస్తూ వారిని దుష్ట మార్గంలోకి లాగుతున్నాయి. ప్రజలు మానసిక రుగ్మతలు కలిగించే టీవీ సీరియళ్ళ జోలికి పోకుండా పుస్తక పఠనమో లేక కొత్త అభిరుచులను పెంచుకుంటూ వాటిలో నిమగ్నమై సమాజానికి తోడ్పాటు కాగలగాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

### ప్రైవేట్ విద్యా సంస్థలు ఆగడాలు

ఈ ఏడాది మా విద్యాసంస్థలో మీ సర్వీసులు కొనసాగించాలంటే ఒక్కొక్కరూ ఖచ్చితంగా 20అడ్మిషన్లు చేయాలి. లేదంటే మీ సేవలు మాకు అవసరం లేదు అని ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పనిచేసే ఉపాధ్యాయులకు, సిబ్బందికి ఆయా యాజమాన్యాలు లక్ష్యాలు నిర్దేశిస్తున్నాయని ప్రచారం కొనసాగుతుంది. దీంతో గ్రామాల్లో అడ్మిషన్ల వేటమొదలైంది.మా స్కూల్‌లో కాలేజీలో చేర్పించండి. మీ పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతాం. ఫీజు రాయితీలు కూడా కల్పించి నాణ్యమైన విద్య నందిస్తామంటూ ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకాలేజీల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులకు గాలం వేస్తున్నారు.

- కె. సతీష్, వరంగల్‌జిల్లా

### ఖాళీ సీట్లను భర్తీ చేయాలి

గురుకులాల్లో పనిచేస్తున్నలెక్చరర్స్,టీచర్స్,నాన్ టీచింగ్ స్టాఫ్, పిల్లలకు కూడా గురుకులాల్లో మిగిలిన సీటు, ఖాళీ సీట్లు భర్తీ చేయాలి. ప్రతి గురుకులం ప్రతి తరగతిలో సంవత్సరం మొత్తం సీట్లు మిగిలి ఉంటున్నాయి. వృధాగా ఉండే కంటే గురుకులాల్లో పని చేస్తున్న వారి పిల్లలకు ఇవ్వాలి.ఈసంవత్సరం మొత్తం భర్తీ చేయాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### శిశు అక్రమ విక్రయాలు

రెండు తెలుగు రాష్ట్రాలలో దత్తత పేరిట యధేచ్ఛగా సాగుతున్న శిశు విక్రయాలను అడ్డుకోవడం అత్యవసర సామాజిక బాధ్యతగా మారింది. ఇటీవలి కాలంలో వెలుగుచూస్తున్న అక్రమ దత్తతలు,మధ్యవర్తుల మోసాలు,అంతరాష్ట్ర శిశు విక్రయ ముఠాల ఉదంతాలు ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నాయి.సంతానం లేని దంపతుల ఆరాటాన్ని, పేదరికాన్ని ఆసరాగా చేసుకుని దళారులు రూ.లక్షల్లో వ్యాపారం చేస్తున్నారు. సాంకేతికతను వాడుకుంటూ రహస్య సంప్రదింపుల ద్వారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు.పిల్లల దత్తతకు చట్టబద్ధమైన మార్గం ఒక్కటే. కేంద్ర ప్రభుత్వ సంస్థ కారా మహిళా, శిశుసంక్షేమ శాఖల ద్వారానే ఈ ప్రక్రియ జరగాలి. అక్రమ దత్తతలను అనుమతిస్తే బాలల అక్రమ రవాణా విపరీతంగా పెరిగిపోతుందని అత్యున్నతన్యాయస్థానం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.ఈ ముఠాల ఆటకట్టించడానికి ప్రభుత్వాలు, పోలీస్ యంత్రాంగం, ఫెర్టిలిటీ కేంద్రాలు, అంగన్వాడీలు సమన్వయంతో పనిచేయాలి. ప్రైవేటు ఆసుపత్రులలో జనన రికార్డులను నిరంతరం పర్యవేక్షిస్తూ అనుమానాస్పద కేసులపై గట్టి నిఘా పెట్టాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### జీతాలలో కోత విధించాలి

ఈ మధ్య కొన్ని ఐటీ దిగ్గజ సంస్థలు సైతం తమకు లాభాలు తగ్గిపోతున్నాయని వేల మంది ఐటీ వుద్యోగుల్ని ఆగమేఘాల మీద తొలగించి వేస్తున్నాయి. వారికి తగిన పరిహారం కూడా చెల్లిస్తున్నామని సంస్థలు ప్రకటిస్తున్నాయిగాని, సంవత్సరాల తరబడి ఆ కంపెనీ వృద్ధికి సేవచేసి జీవితంలో స్థిరపడుతున్న వేళయుజ్ అండ్‌త్రో అన్నవిధంగా వున్న పళంగా వారి వుద్యోగాలు తొలగించటం అన్యాయం.గొప్పలకోసం పెద్ద వేతనాలు ఇస్తున్న ఈ సంస్థలు తమ నష్టాలను తొలగించుకోవాలని భావిస్తే వుద్యోగులను తొలగించే బదులు వారి వేతనాలపై కోత విధించవచ్చు.

- టి. సాంబశివరావు, గుంటూరు

### గందరగోళానికి గురి చేయొద్దు

ఇటీవల ప్రతి విషయం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడం సర్వసాధారణమైపోయింది.నూతన పెన్షన్లు, దరఖాస్తులు అంటూ ప్రభుత్వం అధికారికంగా ప్రకటించినప్పటికీ మీసేవ, నెట్ సేవ సెంటర్లు ప్రజల వద్ద డబ్బులు వసూలు చేస్తూ గందరగోళానికి గురి చేస్తున్నారు. ఇలాంటి చర్యల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి విధానాలను అరికట్టితేనె మేలు జరిగే అవకాశం.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి
ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)


# తరుముతున్న పర్యావరణ సంక్షోభం!

**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధిగా చూడలేదు. ఆయన దృష్టిలో అభివృద్ధి అంటే సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ అని చెప్పారు. అడవులను కోల్పోయేది ఎక్కువగా గిరిజన సమాజాలే. లాభాలు పొందేది ప్రధానంగా పెద్ద పెట్టుబడిదారులు.ఈ అసమానత అంబేద్కర్ ఊహించిన ప్రజాస్వామ్య అభివృద్ధి నమూనాకు విరుద్ధం. అభివృద్ధి అవసరమే కానీ ప్రకృతిని నాశనం చేసే అభివృద్ధి చివరికి సమాజాన్నే నాశనం చేస్తుంది. కార్పొరేట్ పెట్టుబడులు రావాలి, పరిశ్రమలు రావాలి, ఉద్యోగాలు పెరగాలి. అయితే ఇవన్నీ ప్రకృతి పరిరక్షణ, గిరిజన హక్కులు,పర్యావరణ న్యాయం అనే మూడు సూత్రాలపై ఆధారపడి ఉండాలి. పర్యావరణ సంక్షోభం అనేది చెట్లకొరత సమస్య కాదు, అది రాజకీయ సంకల్పం, కార్పొరేట్‌ల బాధ్యత, ప్రజల అవగాహన, యువత చైతన్యం, భవిష్యత్ తరాల మనుగడకు సంబంధించిన సమస్య.**



డాక్టర్ ఎ. భాగ్యరాజ్

ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచం పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము. పాఠశాలల్లో మొక్కలు నాటడం, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రమాణాలు చేయడం, రాజకీయ నాయకులు ఫోటోలు దిగడం, కంపెనీలు ప్రకటనలు విడుదల చేయడం హంగు ఆర్భాటాలతో జరుగుతున్నాయి. అయితే దేశంలో పర్యావరణం నిజంగా రక్షించబడుతోందా? అని చూస్తే దేశంలో వాయుకాలుష్యం పెరుగుతోంది, నదులు, సరస్సులు కలుషితమవుతున్నాయి. క్రమంగా అడవులు తగ్గుతున్నాయి, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి, వాతావరణ మార్పుల కారణంగా తీవ్ర ఉష్ణోగ్రతలు, వరదలు,కరవులు, అకాల వర్షాలు పెరుగుతున్నాయి. పర్యావరణ పరిరక్షణ నేడు ప్రకృతి సమస్య కాదు. ఇది దేశ ఆర్థిక, రాజకీయ, సామాజిక, ఆరోగ్య, జాతీయ భద్రత సమస్యగా మారింది. భారతదేశం ఎదుర్కొంటున్న పర్యావరణ సంక్షోభం ప్రముఖంగా, భారత్ గత రెండు దశాబ్దాల్లో ఎన్నడూ లేని వేడి తరంగాలను ఎదుర్కొంటోంది. ఢిల్లీ, రాజస్థాన్ ప్రాంతాల్లో 50 డిగ్రీలు దాటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి, ప్రతి సంవత్సరం వేలాదిమంది వడదెబ్బలతో బాధపడుతున్నారు, వ్యవసాయ దిగుబడులు తగ్గిపోతున్నాయి. భారత్ ప్రపంచ జనాభాలో 18 శాతం కలిగి ఉన్నా, ప్రపంచ మంచినీటి వనరుల్లో కేవలం 4 శాతం మాత్రమే ఉంది. ఇప్పటికేఅనేక నగరాలలో నీళ్లలేని పరిస్థితిని చూస్తున్నాము. పలు అధ్యయనాల ప్రకారం 2030 నాటికి మరింత ప్రమాదం ఎదుర్కొనే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి. ఇక వాయు కాలుష్యానికి వస్తే ప్రపంచంలో అత్యధిక కాలుష్య నగరాల జాబితాలో అనేక భారత నగరాలు ఉన్నాయి. ఇందులో ముఖ్యంగా రాజకీయ నాయకుల పాత్రని చూస్తే ప్రతి ఎన్నికల సమయంలో అభివృద్ధి పేరుతో భారీ ప్రాజెక్టులు ప్రకటిస్తారు. కానీ ఎన్ని ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతులు సక్రమంగా తీసుకుంటున్నారు? ఎన్ని అడవులు నాశనం అవుతున్నాయి? ఎన్ని నదులు పారిశ్రామిక కాలుష్యానికి బలవుతున్నాయి? ఇలా చూస్తుంటే చాలా సందర్భాల్లో రాజకీయ వ్యవస్థకు పర్యావరణం కంటే తక్షణ ఎన్నికల లాభాలే ముఖ్యమవుతున్నాయి. ప్రస్తుతం అండమాన్, నికోబార్ దీవులలో అడవుల విధ్వంసానికి ప్రధాన కారణం, వివాదాస్పదమైన రూ. 72,000-81,000 కోట్ల 'గ్రేట్ నికోబార్ ఐలాండ్ ప్రాజెక్టు' ఈ భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టు 160 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇది రాబోయే రెండు దశాబ్దాలలో, దీని కారణంగా సుమారు 7 నుండి 10 లక్షల చెట్లు నరికివేయబడతాయని అంచనా. అలానే ఛత్తీస్గఢ్, మణిపూర్ రాష్ట్రాలలో కూడా అటవీ ప్రాంతం గనులకోసం కనుమరుగుకాబోతున్నాయి. పర్యావరణ పరిరక్షణ కంటే 'వ్యాపారం చేసే సౌలభ్యం'కు ప్రాధాన్యతనిచ్చినందుకు, ముసాయిదా పర్యావరణ ప్రభావ అంచనా (ఈ.ఐ.ఏ) నోటిఫికేషన్ 2020 పర్యావరణవేత్తలు పౌరసమాజం నుండి తీవ్రవిమర్శలను ఎదుర్కొంది. ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ రాజకీయాలు అభివృద్ధి పేరుతో విధ్వంసము సృష్టిస్తోంది. ప్రస్తుతం దేశంలో కార్పొరేట్ రాజకీయాలు అభివృద్ధి పేరుతో విధ్వంసం సృష్టిస్తున్నాయి. కార్పొరేట్ రంగం ఆర్థికాభి వృద్ధి దేశానికి అవసరం. కానీ





నియంత్రణ లేకుండా జరిగే అభివృద్ధి పర్యావరణానికి ముప్పుగా మారుతుంది. ప్రధానంగా గనుల తవ్వకాలు, అడవుల విధ్వంసం,గిరిజనుల నిర్వా సనం, భూగర్భ జలాల కలుషితం, పారిశ్రామిక కాలుష్యం, నదుల్లో వ్యర్థాల విడుదల చేయడం, భూమిని,గాలిని కలుషితం చేస్తున్నారు. అనేక కంపెనీలు 'గ్రీన్, సస్టైనబుల్'అనే ప్రచారం చేస్తాయి. కానీ వాస్తవంలో అధిక కర్బనఉద్గారాలు విడుదల చేయడం, అధిక నీటి వినియోగం, ప్లాస్టిక్‌వ్యర్థాలు ఇలా కొనసాగుతూనే ఉంటాయి. నేటి జెన్ జి (భవిష్యత్తు తరం) అంటే 1997-2012 మధ్య జన్మించిన వారు,భారత జనాభాలో కీలక శక్తి వారే. భవిష్యత్ ఓటర్లు, ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, విధాన నిర్ణేతలు వారే. సోషల్ మీడియా ద్వారా పర్యావరణ అవగాహనను, ప్రజా ఒత్తిడిని, సమా చార వ్యాప్తి వేగంగా చేయగలరు.వినియోగదారులు ఏ ఉత్పత్తులు కొనాలి? ఏ కంపెనీలను బహిష్కరించాలి? అనేది భవిష్యత్తు తరం నిర్ణయించగలదు. ఉదాహరణకు క్రోచ్ పార్టీ సోషల్ మీడియాలో చేసిన సవాలునుచూశాం. భవిష్యత్తులో యువత పర్యావరణ విధానాలను వాతావరణ చర్యలను ప్రభావితం చేయగల స్థితికి రావాలి. చాలామంది యువత డి.పిలు మార్చడం, హ్యాష్ట్యాగ్ పోస్టులు పెట్టడం వరకే పరిమితం అవుతున్నారు. కానీ అసలు అవసరం ఏమిటంటే స్థానిక ఉద్యమాలు, చెరువుల పరిరక్షణ, చెట్ల సంరక్షణ, సమాచార హక్కువినియోగం, ప్రజా సమస్యల్లో, విచారణలో పాల్గొనడం అవసరం. భారత రాజ్యాంగం ఆర్టికల్ 48ఎ ప్రకారం రాష్ట్రం పర్యావరణాన్ని రక్షించాలి. ఆర్టికల్ 51ఎ(జి)ప్రకారం ప్రతి పౌరుడు ప్రకృతిని పరిరక్షించాల్సిన బాధ్యత కలిగి ఉంటాడు. అంటే పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు. ప్రజలరాజ్యాంగ విధి కూడా. అభివృద్ధి, పర్యావరణంపై చర్చ సందర్భాలలో అభివృద్ధి కావాలంటే కొంత పర్యావరణ నష్టంతప్పదుఅనేది కొంత వరకు నిజం. కానీ సరైన ప్రశ్న ఏంటంటే ఏ అభివృద్ధి? ఎవరి కోసం? ఎంత నష్టం? ఒక పరిశ్రమ 1000 ఉద్యోగాలు ఇస్తే, లక్షల మందికి నీటిసమస్య తెస్తే, ఆరోగ్య సమస్యలు తెస్తే,అది నిజమైన అభివృద్ధి కాదనిప్రశ్నించాలి. 2047 నాటికి భారతదేశంలో ఇప్పటిలాగే కొనసాగితే నీటి కొరత, తీవ్ర ఉష్ణోగ్రతలు,ఆహారసంక్షోభం, కాలుష్య వ్యాధులు పెరుగుతాయి. దేశం సుస్థిరమైనఅభివృద్ధి కోసం పునరుత్పాదక ఇంధనం, వర్షపు నీటిసంరక్షణ, పట్టణ ప్రణాళిక, అడవుల విస్తరణ వైపువెళితే గ్రీన్ ఉద్యోగాలుపెరుగుతాయి. మనదేశంలో పర్యావరణ రక్షణకు పర్యావరణ నేరాలకుకఠిన శిక్షలు విధించడం, అడవుల సంరక్షణకు రాజకీయ ప్రమేయం లేకుండా స్వతంత్ర కమిషన్ ఏర్పాటుచేయడం, కాలుష్య పరిశ్రమలపై కఠిన నియంత్రణ, పర్యావరణ డేటాను ప్రజలకు అందుబాటు ఉంచడం, పాఠశాలల్లో పర్యావరణ విద్యను ఆచరణాత్మకంగా చెయ్యడం,యువతకు గ్రీన్ వాలంటీర్ కార్యక్రమాలు స్థానిక సంస్థలకు అధిక అధికారాలు ఇవ్వడం, క్లైమేట్ బడ్జెట్ ప్రవేశపెట్టడం, పాశ్చాత్య దేశాలలో లాగా సమాజంలో సామూహిక సేవలు పెంచి, సామాజిక పర్యావరణ స్పృహను పెంచడం అవసరం. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అభివృద్ధిని కేవలం ఆర్థిక వృద్ధిగా చూడలేదు. ఆయన దృష్టిలో అభివృద్ధి అంటే సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ అని చెప్పారు. అడవులను కోల్పోయేది ఎక్కువగా గిరిజన సమాజాలే. లాభాలు పొందేది ప్రధానంగా పెద్ద పెట్టుబడిదారులు.ఈ అసమానత అంబేద్కర్ ఊహించినప్రజాస్వామ్య అభివృద్ధి నమూనాకు విరుద్ధం. అభివృద్ధి అవసరమే కానీ ప్రకృతిని నాశనం చేసే అభివృద్ధి చివరికి సమాజాన్నే నాశనం చేస్తుంది. కార్పొరేట్ పెట్టుబడులు రావాలి, పరిశ్రమలు రావాలి, ఉద్యోగాలు పెరగాలి. అయితే ఇవన్నీ ప్రకృతి పరిరక్షణ, గిరిజన హక్కులు,పర్యావరణ న్యాయం అనే మూడు సూత్రాలపై ఆధారపడిఉండాలి. పర్యావరణ సంక్షోభంఅనేది చెట్ల కొరత సమస్య కాదు,అది రాజకీయ సంకల్పం, కార్పొరేట్‌ల బాధ్యత, ప్రజల అవగాహన, యువత చైతన్యం, భవిష్యత్ తరాల మనుగడకు సంబంధించిన సమస్య. ●

# తెలంగాణలో మరో విస్మృత యోధుడు



కొడాటి ప్రదీప్

'తెలంగాణ షైనింగ్' అనే పదం ఈరోజు హైదరాబాద్లో ఎక్కడ చూసినా కనిపిస్తుంది. అయితే, ఈ దక్షిణ భారత నగరంలోని 70 లక్షల జనాభాలో చాలా మందికి, ఈ ప్రాంతానికి రాష్ట్ర హోదా అంత సులభంగా రాలేదనే విషయం మసకబారిపోయింది. 1960 చివరి దశలో, 1970 ప్రారంభంలో చదువులు పూర్తిచేసిన హైదరాబాద్ యువతకు 'తెలంగాణ ఆందోళన ఇప్పటికీ గుర్తుండే ఉంటుంది. ఆ కాలంలో ఉపవాస దీక్షలు,హింస, పోలీసుల కాల్పులు ఎన్నో ప్రాణాలను బలితీసుకున్నాయి. అప్పటి ప్రజాదరణ పొందిన నేత ఎం. చెన్నారెడ్డి పేరు కాలక్రమేణా ప్రజల మదిలో మసకబారిపోయినా, తెలంగాణ ప్రజల అసంతృప్తి మాత్రం ఆగలేదు. ప్రత్యేక తెలంగాణ కోసం ఉన్న న్యాయమైన డిమాండ్ ఎంతోకాలం కలగానే మిగిలింది. 2000లో ఉద్యమం మళ్లీ ఊపందుకున్నప్పటికీ, తెలంగాణ రాష్ట్రం 2014జూన్లోనే నిజమైంది. ప్రత్యేక తెలంగాణ కోసం దశాబ్దాలపాటు సాగిన పోరాటానికి అనేకప్రముఖుల పేర్లు అనుబంధమయ్యాయి.అయితే, అందులో ఒక ముఖ్యమైన పేరు మాత్రం విస్మరించబడింది దివంగత ఎం. కమాలుద్దీన్ అహ్మద్.తెలంగాణ ఆర్థిక వెనుకబాటుతనాన్ని మొదటగా ప్రస్తావించిన స్వరాల్లో ఆయన ఒకరు.రాజకీయ కేంద్రంగా ఉన్న హైదరాబాద్ నుంచిఉద్యమం నడిపిన చాలామందికి భిన్నంగా, కమాలుద్దీన్‌గ్రామీణ తెలంగాణ మట్టిలో పెరిగిన వ్యక్తి. అదే ఆయనకుప్రజలతో బలమైన అనుబంధాన్ని ఇచ్చింది. 1960 ప్రారంభంనుంచి 1990 వరకు కమాలుద్దీన్ తెలంగాణ ప్రజల కోసం నిరంతరం పనిచేశారు. ఆయన 1962,1967లో తెలియాల్ జనగామ నియోజకవర్గాల నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1980, 1989, 1991-96 మధ్య వరంగల్/హన్మకొండ నుంచి ఎంపీగా సేవలందించారు. అనంతరం కేంద్రంలో పౌర సరఫరాలు, ప్రజాపంపిణీ శాఖల సహాయ మంత్రిగా, అలాగే వాణిజ్య శాఖ సహాయ మంత్రిగా పని చేశారు. 1985-89 మధ్య నాఫెడ్ ఛైర్మన్గా ఉన్నప్పుడు, స్థానిక సమస్యలకు కేంద్ర స్థాయిలో ప్రాధాన్యం కల్పించారు. 1994లో అప్పటి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తెలంగాణ ఎండబారిన భూములకు సాగునీటి ప్రాజెక్టులపై కమాలుద్దీన్ ప్రత్యేక దృష్టి పెట్టారు. శ్రీరాం సాగర్ ప్రాజెక్టు ద్వారా కరీంనగర్ వరంగల్ ప్రాంతం పచ్చదనాన్ని సంత రించుకోవడంలో ఆయన కృషి ఎంతో



ఎం. కమాలుద్దీన్ అహ్మద్

ఉంది. అత్యంత ముఖ్యంగా, భారత స్వాతంత్ర్య 50వ వార్షికోత్సవ సందర్భంగా 1997సెప్టెంబర్ 1న లోక్‌సభలో జరిగిన చర్చల్లో, 'నిజమైన తెలంగాణ' వెనుకబాటుతనాన్ని కమాలుద్దీన్ బలంగా ప్రస్తావించారు. ముఖ్యంగా ఆంధ్ర ప్రాంతంతో పోలిస్తే తెలంగాణ ఎలా అన్యాయానికిగురైందో వివరించారు. ఇది అవకాశవాది రాజకీయ నాయకుడి స్వరం కాదు. తెలంగాణ నేల కొడుకుది. తెలంగాణ రాష్ట్ర సమితి ప్రత్యేక తెలంగాణ కోసం పిలుపునివ్వడానికిదాదాపు పదేళ్ల ముందే ఆయన ఈ స్వరాన్ని వినిపించారు.అయితే, పార్లమెంటులో చేసిన ఆ బహిరంగ ప్రస్తావన ఆయనకు చేదు అనుభవాలను తెచ్చింది. తెలంగాణ కోసం పోరాడిన చరిత్రలో ఆయన పాత్రను గుర్తించకపోవడమే కాకుండా, ఆయనను అవమానించే ప్రయత్నాలు జరిగాయి. 1997 తర్వాత ఆయనకు దగ్గరగా ఉన్నఅనేకమంది సహచరులు, మిత్రులు ఆయనను దూరం పెట్టారు. చాలామంది ప్రత్యేక తెలంగాణ వ్యతిరేక వాదనకు మద్దతు పలికారు.1998/99 లోక్‌సభ ఎన్నికల్లో ఆయన ఓటమి ఈ నిరాశకు ప్రతిబింబం. సన్నిహితుల ప్రవర్తనతో తీవ్రంగా కలత చెందిన కమాలుద్దీన్ రాజకీయాల నుంచి ముందుగానే విరమణ చేశారు. తెలంగాణలో ఆయనకు తగిన గుర్తింపు తగ్గినా, 2001లో ఆయన ప్రణాళికా సంఘం సభ్యుడయ్యారు. రాజకీయ దూరదృష్టితో పాటు, తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ భాషల్లో పాండిత్యం కలిగిన పండితుడిగా కూడా ఆయన పేరు పొందారు. ఆయన సరళ స్వభావం రాజకీయ వర్గాలన్నింటికీ ఆయనను దగ్గర చేసింది.మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి ఆయనను 2002-04 మధ్య సౌదీ అరేబియాకు భారత రాయబారిగా నియమించారు. తెలంగాణ కోసం జీవితాన్ని అంకితం చేసిన ఇలాంటి నాయకుడికి జరిగిన అన్యాయం మాటల్లో చెప్పలేనిది. కీర్తి రావలసిన చోట దక్కకపోవడం సాధారణమే అయినా, ఇంతటి సేవ చేసిన నాయకుడిని చరిత్ర నుంచి చెరిపేయాలనే ప్రయత్నం మాత్రం కక్షసాధింపుగా భావించాల్సిందే. 2018 సెప్టెంబర్లో కమాలుద్దీన్ మరణించినప్పుడు జరిగిన ఘటన మరింత బాధాకరం. హైదరాబాద్లో ఆయనకురాష్ట్ర అంత్యక్రియలు నిర్వహించలేదు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి జీవితాంతం పోరాడిన నేతకు కనీస గౌరవం కూడా ఇవ్వలేదు. మరింత విచారకరం ఏమిటంటే, ఈ నిర్లక్ష్యం పెద్దగా ఎవరినీ కదిలించలేదు. ఇప్పుడు తెలంగాణలో మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఈ సమయంలో, కమాలుద్దీన్ అహ్మద్‌కు తగిన గౌరవం,గుర్తింపు ఇవ్వడానికి మంచి అవకాశం ఉంది. తెలంగాణ ఉద్యమ చరిత్ర ఆయన పేరు లేకుండా అసంపూర్ణంగానే మిగులుతుంది. ప్రాంతీయ గుర్తింపు ఆర్థిక అభివృద్ధి కోసం పోరాడిన ఈ నిస్వార్థ యోధుడి సేవలు చిరస్మరణీయమైనవి. ●

# ప్రపంచాన్ని ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్న యుద్ధాలు

ఫిరోజ్ ఖాన్

అమెరికా, ఇరాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలు కేవలం రెండు దేశాల మధ్య ఘర్షణగా మాత్రమే కాకుండా, ప్రపంచ శక్తి సమీకరణాలను ప్రభావితం చేసే కీలక పరిణామంగా మారుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధం, మధ్యప్రాచ్య అస్థిరత, ఇండోపసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న పోటీ వంటి అంశాల మధ్య ఈ పరిణామాలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అమెరికా తన సాంకేతిక ఆధిక్యంతో ఆధిపత్యం సాధిస్తుందని భావించినప్పటికీ, ఇరాన్ అనుసరిస్తున్న వ్యూహాలు పరిస్థితులను క్లిష్టతరం చేస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. అమెరికా సైన్యం గర్వకారణంగా భావించే స్టెల్త్ ఫైటర్ జెట్ల సామర్థ్యం ఈ ఘర్షణలో చర్చనీయాంశంగా మారింది. కొన్ని అంతర్జాతీయ నివేదికల ప్రకారం, ఇరాన్ తన వద్ద ఉన్న పాత తరహా క్షిపణి వ్యవస్థలతో కూడిన వ్యూహాల ద్వారా స్టెల్త్ టెక్నాలజీకి సవాళ్లు విసురుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు వంటి ప్రత్యామ్నాయ గుర్తింపు పద్ధతుల ప్రాముఖ్యత పెరుగుతోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అయితే, ఇలాంటి సంఘటనలపై అధికారిక ధృవీకరణలు పరిమితంగానే అందుబాటులో ఉన్నాయి.అయినప్పటికీ, స్టెల్త్ టెక్నాలజీ పూర్తిగా అజేయం కాదన్న అభిప్రాయం రక్షణ వర్గాల్లో వినిపిస్తోంది. ఇరాన్ తన పరిమిత వనరులతో కూడిన సమన్వయ వ్యూహాల ద్వారా అమెరికా వైమానిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పరిణామాలు భవిష్యత్తులో వైమానిక యుద్ధ స్వరూపం మారే అవకాశాన్ని సూచిస్తున్నాయి.ఆధునిక యుద్ధాల్లో మానసిక ఒత్తిడి కూడా ఒక కీలక ఆయుధంగా మారుతోంది. 'డర్టీ బాంబ్' వంటి ముప్పుల గురించి వినిపించే హెచ్చరికలు ప్రత్యర్థి సేనలపై భయాన్ని సృష్టించగలవని నిపుణులు భావిస్తున్నారు. ఇవి వాస్తవ వినియోగం కంటే వ్యూహాత్మక ఒత్తిడిని పెంచే సాధనాలుగా పరిగణించబడతాయి. ఇలాంటి పరిస్థితుల్లో నిర్ణయాలు తీసుకోవడం మరింత క్లిష్టంగా మారుతుంది. రక్షణ వ్యవస్థలు ఈ తరహా ముప్పులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, పూర్తిస్థాయిలో అడ్డుకోవడం సవాలు



గా మారుతుందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఈ నేపథ్యంలో భయం కూడా యుద్ధ వ్యూహంలో భాగమవుతున్నట్లు కనిపిస్తోంది. ఇరాన్ అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పబడుతున్న హైపర్‌సోనిక్ క్షిపణి వ్యవస్థలు ప్రపంచ రక్షణ రంగంలో చర్చకు దారితీస్తున్నాయి. ఈ క్షిపణులు అధిక వేగంతో ప్రయాణిస్తూ లక్ష్యానికి చేరుకునే సమయంలో దిశ మార్చుకునే సామర్థ్యం కలిగి ఉంటాయని నివేదికలు సూచిస్తున్నాయి. అమెరికా రక్షణ వ్యవస్థలు ఈ తరహా సవాళ్లను ఎదుర్కొనే క్రమంలో కొత్త పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పూర్తిస్థాయి సమర్థతపై ఇంకా చర్చలు కొనసాగుతున్నాయి. వేగం, మెన్యువరబిలిటీ కలయిక భవిష్యత్తు యుద్ధాల్లో కీలకంగా మారుతుందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. పరిణామాలు ప్రపంచ రక్షణ వ్యూహాలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఆధునిక యుద్ధాల్లో ఆర్థిక అంశం కీలకంగా మారుతోంది. కొన్ని ప్రాథమిక అంచనాల ప్రకారం,తక్కువ ఖర్చుతో రూపొందించే డ్రోన్లు, క్షిపణులు ఖరీదైన రక్షణ వ్యవస్థలకు సవాళ్లు విసురుతున్నాయి. అధిక వ్యయంతో కూడిన ఇంటర్‌సెప్టర్ మిస్సైళ్లను ఉపయోగించి తక్కువ విలువ గల లక్ష్యాలను అడ్డుకోవాల్సిన పరిస్థితి ఆర్థిక ఒత్తిడిని పెంచుతోందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. ఇరాన్ అనుసరిస్తున్న తక్కువ ఖర్చు, గరిష్ట ప్రభావం వ్యూహం ఈ సందర్భంలో ప్రాధాన్యం పొందుతోందని నిపుణులు చెబుతున్నారు. గల్ఫ్ ప్రాంతంలోని పరిణామాలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. అయినప్పటికీ, ఖచ్చిత గణాంకాలు అధికారికంగా వెలువడే వరకు అంచనాలను జాగ్రత్తగా పరిగణించాల్సి ఉంటుంది. యుద్ధం ఇప్పుడు కేవలం సైనిక పోరాటమే కాకుండా ఆర్థిక పోటీగా కూడా మారుతోంది. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు యుద్ధాలు కేవలం సైనిక శక్తితోనే నిర్ణయించబడవని స్పష్టంగా సూచిస్తున్నాయి. వ్యూహాత్మక చాతుర్యం, మానసిక ప్రభావం, ఆర్థిక సమర్థత కలిసి ఫలితా లను ప్రభావితం చేస్తున్నాయి. ఇరాన్ తన వ్యూహాలతో కొంత మేర పైచేయి సాధించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నప్పటికీ, తుది ఫలితం ఇంకా స్పష్టంగా లేదు. భవిష్యత్తులో యుద్ధాల దిశను ఈ పరిణామాలు ప్రభావితం చేసే అవకాశముంది. ●

## తిరుమల సమాచారం





### ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.20 లక్షలు విరాళం

**తిరుమల, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తున్న పలు ట్రస్ట్‌లు, పథకాలకు భక్తులైన దాతలు తమవంతుగా విరాళాలందించి అవసరమైన వారికి సేవలందించేందుకు ముందుకు వస్తున్నారు. తిరుమలకు వచ్చిన భక్తులకు ఆకలి అనేది తెలియకుండా నిరంతరాయంగా రుచిగా శుచిగా అందిస్తున్న అన్నప్రసాదం ట్రస్ట్‌కు గురువారం రూ.20లక్షలు విరాళాలందాయి. హైదరాబాద్‌కు చెందిన దాతలు సంజయ్ బాబు రూ.10 లక్షలు, హోమిపెట్స్ అధినేత హార్షవర్ధన్ బాబు మరో రూ.10 లక్షలు విరాళంగా అందించారు. విరాళం చెక్కులను తిరుమలలో టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు. శ్రీవారి అనుగ్రహం ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.





### టిటిడి ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.20 లక్షలు విరాళం

తిరుమల, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో నిరుపేదలకు ప్రాణరక్షక వైద్యసేవలు అందిస్తున్న వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్ట్‌కు హైదరాబాద్‌కు చెందిన శ్రీకాంత్ ప్రొడక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండి పల్లమాల సుధాకర్, కులశేఖర్ ఇద్దరూ రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళానికి సంబంధించిన డిడిని తిరుమలలో గురువారం దాతలు టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు అందించారు. సమాజహితాన్ని దృష్టిలో ఉంచుకుని టిటిడి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ఉదారంగా విరాళం అందించడంతో దాతను అభినందించారు. తిరుపతికి చెందిన బాలాజీ రైల్వే డివిజన్ సాధన సమితి కన్వీనర్ కుప్పాల గిరిధర్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఆయన మనవరాలు కుప్పాల దర్శన పేరుతో అందించిన ఈ విరాళానికి సంబంధించిన డిడిని తిరుమలలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరికి గురువారం అందించారు. ఈ సందర్భంగా అదనపు ఇఒ చిన్నారి దర్శనను ఆశీర్వదించి, సమాజహితాన్ని దృష్టిలో ఉంచుకుని టిటిడి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలకు ఉదారంగా విరాళం అందించిన కుప్పాల గిరిధర్ కుమార్ కుటుంబ సభ్యులను అభినందించారు. టిటిడి చేపడుతున్న వైద్య, మానవతా సేవలకు భక్తులు, దాతలు అందిస్తున్న సహకారం మరెందరికో ప్రాణదానంగా నిలుస్తోందన్నారు.



### 26నుండి శ్రీవారి జ్యేష్ఠాభిషేకం

**తిరుమల, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న కలియుగ వైకుంఠం తిరుమలలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు మూడురోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్ మాసంలో జ్యేష్టా నక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బంగారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరింపజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమోక్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఈనెల 26వ తేదీ మంగళవారం రుత్వికులు శాంతి హోమం నిర్వహిస్తారు. హోమాలు, అభిషేకాలు, శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు వజ్రకవచం అలంకరిస్తారు.ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు యధావిధిగా కైంకర్యాలు నిర్వహించి ఉత్సవమూర్తులకు ముత్యాలకవచం ధరింపజేస్తారు. చివరగా మూడవరోజు జూన్ 28వ తేదీ గురువారం విశేష పూజలు, అభిషేకాలు జరిపించి మళ్ళీ బంగారుకవచం ధరింపజేస్తారు. బంగారు కవచంలోనే ఏడాదంతా విశేష పూజలు, ఉత్సవాలు జరిపించుకుంటారు. ఇప్పటికే జూన్ నెలలో జరిగే ఈ మూడురోజుల జ్యేష్టాభిషేకాలకు ఆన్‌లైన్‌లో సేవా టిక్కెట్లు విడుదల చేశారు.

### తిరుమలలో కర్ణాటక విశ్రాంతి గృహాల సముదాయాలకు గౌరవాధ్యక్షుడుగా దివాకర్‌రెడ్డి



**తిరుమల, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి బోర్డు సభ్యుడు, తుడ ఛైర్మన్ సి.దివాకర్‌రెడ్డిని తిరుమలలోని కర్ణాటక గెస్ట్ హౌస్, కర్ణాటక కళ్యాణ మండపాల సముదాయాల ఉద్యోగస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు. జనసేన పార్టీ నాయకుడు కిరణ్ రాయల్‌తో కలిసి వెళ్లిన ఉద్యోగులు, తుడా ఛైర్మన్‌కి పుష్పగుచ్ఛం అందించారు. తిరుమలలోని కర్ణాటక గెస్ట్ హౌస్ కళ్యాణ మండపాలకు సంబంధించిన ఉద్యోగస్తుల నివాస సముదాయాలకు, ఉద్యోగ సంఘానికి గౌరవాధ్యక్షుడుగా వ్యవహరించాలని దివాకర్ రెడ్డిని కోరారు. తమకు అండగా ఉంటూ, ఉద్యోగుల సంక్షేమానికి తమ సముదాయం అభివృద్ధికి తగిన సహకారం అందించాలని ఈ సందర్భంగా వాళ్ళు తుడా ఛైర్మన్‌కి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక గెస్ట్ హౌస్ కళ్యాణ మండపాల ఉద్యోగస్తులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యంకు సిఎం చంద్రబాబు నివాళి

**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ గాయకుడు, పద్మవిభూషణ్ ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు నివాళి అర్పించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. "తన మధుర గాత్రంతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకుని, సంగీత ప్రపంచానికి స్వరాభిషేకం చేసిన ఆయన చిరస్మరణీయుడు. తెలుగు భాష ఉన్నంతకాలం ఆయన జీవించే ఉంటారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా, ఆయన పాడిన వేలాది పాటల రూపంలో ఎప్పటికీ మన గుండెల్లో జీవించే ఉంటారు. ఆ గాన గంధర్వుడికి మరొక్క మారు నివాళి అర్పిస్తున్నాను" అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ పోస్టులో పేర్కొన్నారు.

# మహా కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం

- తక్షణమే పుష్కరాల ఏర్పాట్లకు దేవాదాయ శాఖ బ్లూప్రింట్ సిద్ధం చేయాలి • ఆరు జిల్లాల్లో నది పరీవాహక ప్రాంతాల్లో ఆలయల నిర్మాణం
- మౌలిక సదుపాయాల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి • అధికారులకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దిశానిర్దేశం



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న గోదావరి పుష్కరాలను దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలిచే విధంగా, మహా కుంభమేళా తరహాలో అత్యంత ఘనంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, ఇంజనీరింగ్ విభాగ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై విస్తృతంగా చర్చించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించి సమగ్ర బ్లూప్రింట్‌ను అత్యవసరంగా సిద్ధం చేసి ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల కోసం చేపట్టాల్సిన అన్ని అభివృద్ధి పనులను వెంటనే ప్రారంభించి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని సూచించారు.

గోదావరి నది పరివాహక ప్రాంతంలోని ఆరు జిల్లాల్లోని పుష్కర ఘాట్ల నిర్మాణాపు పనులు, మరమ్మతులు, విస్తరణ, పరిశుభ్రత, విద్యుత్, తాగునీరు, పారిశుద్ధం, భక్తుల వసతి, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. త్వరలోనే ఆయా జిల్లాల కలెక్టర్లు, స్థానిక శాసనసభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి పుష్కర ఘాట్లను స్వయంగా పరిశీలించనున్నట్లు తెలిపారు.

ఆరు జిల్లాల దేవాదాయ శాఖ అధికారులు సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమన్వయం చేసుకుని ఆలయాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో స్థానిక శాఖల అధికారులతో ప్రత్యేక సమన్వయ సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు సాంప్రదాయ, ఆధ్యాత్మిక సేవలను మరింత సమర్ధవంతంగా అందించేందుకు పిండప్రదాన కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆనం సూచించారు. ఇందుకు అవసరమైన వేద పండితులు, అర్చకులు, బ్రాహ్మణుల సంఖ్యపై అంచనాలు రూపొందించి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.

అలాగే శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఆరు జిల్లాల్లోని ఆలయాల నిర్మాణం, అభివృద్ధికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల నుంచి ప్రతిపాదనలు స్వీకరించి వాటిని ప్రాధాన్యత ఆధారంగా అమలు చేయాలని సూచించారు.

గోదావరి నది రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్న మంత్రి, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి మరియు అధికారులతో త్వరలో సమావేశమై పరస్పర సహకారంతో ఉభయ రాష్ట్రాల్లో గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. పుష్కరాల నిర్వహణలో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య, రోడ్లు భవనాలు, విద్యుత్, పర్యాటక తదితర శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయం ఉండాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ మహత్తర ఆధ్యాత్మిక వేడుకలను విజయవంతం చేయడానికి ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రతి నెలా గోదావరి పుష్కరాల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. చేపడుతున్న పనుల పురోగతిపై అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.

గోదావరి పుష్కరాలు రాష్ట్ర ప్రతిష్టకు అద్దం పట్టే మహత్తర ఆధ్యాత్మిక ఉత్సవంగా నిలిచేలా ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపడుతోందని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఈ సమీక్ష సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి హరిజవహర్ లాల్, దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, రాష్ట్ర దేవాలయ పరిపాలన సంస్థ (శిక్షణ సంస్థ) ముక్తేశ్వరరావు, అదునపు కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ చీఫ్ ఇంజనీర్ శేఖర్, దేవాదాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల్లో సికిల్‌సెల్ అనీమియా నివారణపై దృష్టి

### ఎన్‌సి, ఎస్‌టి ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్య



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త:** గిరిజన ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న సికిల్‌సెల్ అనీమియా నివారణపై ప్రధాని నరేంద్రమోడీ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమీషన్ (ఎన్‌సిఎస్‌టి) ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్య తెలిపారు. గురువారం విజయవాడలోని ఓహోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఛైర్మన్ మాట్లాడుతూ తనతోపాటు కమీషన్ సభ్యులు రాష్ట్రంలోని పలు గిరిజన ప్రాంతాల్లో పర్యటించి సంక్షేమ కార్యక్రమాల అమలు, రాజ్యాంగపరమైన రక్షణలు, ఉద్యోగుల సమస్యలపై ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. గిరిజనుల హక్కులను పరిరక్షించటం, అభివృద్ధి సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేయటం లక్ష్యంగా తాము పర్యటనలు చేసినట్లు పేర్కొన్నారు. సమీక్షలకు ముందు మూడురోజులపాటు రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో పర్యటించి ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించినట్లు చెప్పారు. ఇందులో భాగంగా గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాలు, ప్రజలతో సమావేశం అయినట్లు వివరించారు. గిరిజన ప్రాంతాల్లో తీవ్రంగా ఉన్న సికిల్‌సెల్ అనీమియా నివారణకు అవగాహనా సదస్సులు నిర్వహించటంతోపాటు, కళాశాలల్లో విద్యార్థులతో యువసంవాద్ కర్యాక్రమాలు నిర్వహిస్తూ యువతలో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు కృషిచేస్తున్నామన్నారు. గిరిజన ప్రాంతాల్లో తాము సేకరించిన ప్రజాభిప్రాయాలను సమగ్ర నివేదిక రూపంలో ముఖ్యమంత్రికి అందచేస్తామన్నారు. రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి అధ్యక్షతన జరుగబోయే రాష్ట్రస్థాయి సమీక్షా సమావేశంలో గిరిజనుల సమస్యలు, పెసా చట్టం అమలు, సికిల్‌సెల్ అనీమియా నివారణకు చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చిస్తామని ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్య తెలిపారు. ఈకార్యక్రమంలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి యం.యం.నాయక్, డైరెక్టర్ భార్గవి, కమీషన్ సభ్యులు జటోతు హుస్సేన్, నిరుపమ్ చక్మా, కమీషన్ కార్యదర్శి ప్రశాంతకుమార్‌సింగ్, డైరెక్టర్ డాక్టర్ పి.కళ్యాణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 'నవచేతన' బాల్యారంభ అభివృద్ధి స్క్రీనింగ్ షురూ!


- ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- తొలి 1,000 రోజులు చిన్నారి భవిష్యత్తును నిర్ణయించే స్వర్ణావకాశం : మంత్రి సంధ్యారాణి



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతి చిన్నారికి జీవితంలో అత్యుత్తమ ఆరంభాన్ని అందించాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధి, అభివృద్ధి స్క్రీనింగ్‌పై రాష్ట్రవ్యాప్త సామర్థ్యాభివృద్ధి కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గర్భధారణ నుండి రెండేళ్ల వయస్సు వరకు ఉండే తొలి 1,000 రోజులు చిన్నారి జీవితంలో అత్యంత కీలకమైన కాలమని పేర్కొన్నారు. ఈ సమయంలో పిల్లల మెదడు అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుందని, ప్రతి సెకనుకు దాదాపు 10 లక్షల న్యూరల్ కనెక్షన్లు ఏర్పడతాయని తెలిపారు. పిల్లల మెదడు అభివృద్ధిలో 80శాతం మూడు సంవత్సరాల వయస్సులోపు, 90శాతం ఆరు సంవత్సరాల వయస్సులోపు పూర్తవుతుందని వివరించారు. ప్రారంభ సంవత్సరాల్లో అందే పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్పందనాత్మక సంరక్షణ, ప్రారంభ అభ్యసన అవకాశాలు, భద్రత, ప్రేరణ పిల్లల భవిష్యత్తు విద్య, ఆరోగ్యం, ఉత్పాదకత, శ్రేయస్సుపై గణనీయమైన ప్రభావం చూపుతాయని మంత్రి పేర్కొన్నారు. బాలల అభివృద్ధిలో ఆలస్యాలను ముందుగానే గుర్తించి సకాలంలో జోక్యాలు చేపట్టేందుకు స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వైద్య ఆరోగ్య శాఖతో సమన్వయంగా "నవచేతన" అనే మొబైల్ ఆధారిత అభివృద్ధి స్క్రీనింగ్ సాధనాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ సాధనం 0 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల అభివృద్ధిని అంచనా వేయడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. నవచేతన వేదిక ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు పిల్లలలో స్థూల చలన నైపుణ్యాలు, సూక్ష్మ చలన నైపుణ్యాలు, భాషా అభివృద్ధి, జ్ఞానవికాసం, సామాజిక-భావోద్వేగ అభివృద్ధి వంటి ఐదు ప్రధాన అభివృద్ధి రంగాలను వ్యవస్థీకృతంగా పరిశీలించగలరని తెలిపారు. దీని ద్వారా అదనపు మద్దతు లేదా ముందస్తు జోక్య సేవలు అవసరమయ్యే పిల్లలను త్వరగా గుర్తించవచ్చని చెప్పారు. "ప్రతి చిన్నారి విలువైనవాడు" అనే నమ్మకంతో ప్రభుత్వం బాల్యారంభ అభివృద్ధిలో పెట్టుబడి పెడుతోందని, నవచేతన కార్యక్రమం ద్వారా అభివృద్ధి సంబంధిత సమస్యలు ఉన్న ఏ చిన్నారి కూడా గుర్తించబడకుండా మిగలకుండా చూడటమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. "పిల్లలే మన గొప్ప సంపద. తొలి 1,000 రోజులు జీవితంలో ఒక్కసారి మాత్రమే వస్తాయి. ఈ రోజు ముందస్తు గుర్తింపు, పోషణాత్మక సంరక్షణ, తల్లిదండ్రుల సాధికారతలో పెట్టుబడి పెట్టడం ద్వారా ఆరోగ్యవంతమైన, బలమైన, అభివృద్ధి చెందిన స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి పునాది వేస్తున్నాము" అని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు.

## తిరుమలలో తరుముకొస్తున్న నీటి సమస్య!

- తీవ్ర వర్షాభావ పరిస్థితులు • 90రోజులకు సరిపడే నీటి నిల్వలు



తిరుమలలోని గోగర్భమ్ డ్యామ్ తాజా పరిస్థితి

**తిరుమల, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** కలియుగ వైకుంఠం తిరుమలకు ప్రతి రోజూ లక్షమంది వరకు భక్తుల తాకిడి.. పెరిగిన నీటి వినియోగం... వెరసి వర్షాభావ పరిస్థితులతో తిరుమలలోని జలాశయాల్లో 90 రోజులకు సరిపడే నీరునిల్వ ఉంది. ఇప్పుడు వేసవితో బాటు భక్తుల సంఖ్య కూడా పెరగడంతో వర్షాలు కురవకపోతే రానున్న రోజుల్లో నీటి కొరత ఏర్పడే ప్రభావం ఉందనేది తెలుస్తోంది. ప్రతిరోజూ కొండపై 45 లక్షల గ్యాలన్ల వరకు నీరు వినియోగిస్తున్నారు. ఇందులో 18లక్షల గ్యాలన్ల నీరు తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాలు గోగర్భమ్, ఆకాశగంగ, పాపవినాశనమ్, కుమారధార, పసుపుధారతీర్థాల డ్యామ్‌ల నుండి లభ్యమవుతుండగా మిగిలిన నీరు చంద్రగిరిలోని కల్యాణిడ్యామ్ నుండి సరఫరా అవుతోంది. తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో 14,304లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం కాగా ప్రస్తుతం నాలుగువేల లక్షల గ్యాలన్లనీరు పైగామాత్రమే అందుబాటులో ఉంది. ఈ నీరు కేవలం 90 రోజులు మాత్రమే అవసరాలకు సరిపోతుందనేది టిటిడి వర్గాల సమాచారం. వరుణదేవుడు దయతో వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేయాల్సిన అవసరం వస్తోంది.

**వర్షాభావ పరిస్థితుల్లోనే వెదుక్కుంటారా!?:** నిత్యం లక్షమంది వరకు భక్తులు వస్తున్న తిరుమల క్షేత్రానికి నీటి సమస్య శాశ్వత పరిష్కారానికి 2014లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం బాలాజీ రిజర్వాయర్ ప్రాజెక్టు ప్రతిపాదనలు తయారుచేసి పనులు మొదలుపెట్టినా 2019లో మళ్ళీ ఆగిపోవడంతో "బాలాజీ రిజర్వాయర్" కలగానే మారింది. నాలుగుసంవత్సరాల క్రిందట తిరుమలలో నీటి సమస్య ఎదురైనపుడు బాలాజీ రిజర్వాయర్ నిర్మాణంపై గత ఐదేళ్ళలో అప్పటి టిటిడి పాలకమండలి ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, అప్పటి తిరుపతి ఎమ్మెల్యే కరుణాకర్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి, ఈ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయడానికి సుముఖత చూపారు. అయితే పనులు మాత్రం చేపట్టలేదు. 2019లోనే బాలాజీ రిజర్వాయర్ పరిస్థితిని టిటిడి ఇంజనీరింగ్ విభాగం అధికారులు, ప్రభుత్వ నీటిపారుదల శాఖ అధికారులతో కలసి పరిశీలించారు. తిరుమలకు భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకుండా, శాశ్వత పరిష్కారానికి ప్రత్యామ్నాయంగా 1టిఎంసి నీటిని తిరుమల తాగునీటి అవసరాలకు వినియోగించు కోవాలనేది బాలాజీ రిజర్వాయర్ ప్రధానమని భావించారు. అయితే దీనికి గ్రహణం వీడలేదు.

తిరుమలలో తాగునీటి జలాశయమైన గోగర్భండ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్ల నీటి సామర్థ్యం, కుమారధార తీర్థం 4,258లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం. అడపాదడపా వర్షాలు కురిసినా నీరు చేరలేదు.

## రైతులకు నూతన బిటి పత్తి విత్తనాలు

- విత్తన వ్యయాన్ని తగ్గించి అధిక దిగుబడులు అందించే సరికొత్త పత్తి రకం
- ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలకు మంత్రి అభినందనలు



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ఆంగ్రూ) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన నూతన బీటీ పత్తి రకం 'లాం బీజీ టూ2208 (ఆదిత్య బీజీ2)' విత్తనాలను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆవిష్కరించి రైతులకు పంపిణీ చేశారు. విజయవాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆంగ్రూ ఉపకులపతి డా. పాలడుగు వెంకట సత్యనారాయణతో కలిసి మంత్రి ఈ విత్తనాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, రైతులు ప్రతి సంవత్సరం ప్రైవేట్ కంపెనీల నుంచి అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితిని తగ్గించేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు చేపడుతున్న పరిశోధనలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని అన్నారు. పత్తి విత్తనాల్లో కల్తీ సమస్యల వల్ల రైతులు నష్టపోతున్న నేపథ్యంలో, ఆంగ్రూ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ నూతన రకం రైతులకు భరోసానిచ్చేలా ఉందన్నారు. బీటీ సాంకేతికతపై పేటెంట్ హక్కులు ముగిసిన అనంతరం సుమారు తొమ్మిదేళ్లపాటు శాస్త్రీయ పరిశోధనలు, అఖిల భారత స్థాయి పరీక్షలు నిర్వహించి ఈ రకాన్ని అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జాతీయ విత్తన విడుదల కమిటీ ఆమోదంతో విడుదలైన ఈ రకం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రంగంలో అభివృద్ధి చేసిన తొలి బీటీ పత్తి రకం కావడం గర్వకారణమన్నారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా సాగుకు అనుకూలంగా ఈ రకాన్ని సిఫారసు చేసినట్లు తెలిపారు.

### మన బడి పిలుస్తోంది.. మనబడి గెలుస్తోంది

- పాట ఆవిష్కరించిన పాఠశాల విద్యాశాఖ కమిషనర్


**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "బడి పిలుస్తోంది" ప్రవేశాల ప్రచార కార్యక్రమంలో భాగంగా రూపొందించిన "మనబడి పిలుస్తోంది" పాటను కమిషనరేట్లో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ తమీమ్ అన్సారియా ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య, విద్యార్థుల సంక్షేమ కార్యక్రమాలు, డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం, విద్యా రంగంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న పలు సంస్కరణలను ఈ పాట ద్వారా ప్రజల్లోకి చేరేలా చక్కగా వివరించారని కమిషనర్ ఈ పాటను రాసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు చల్ల మధుసూదనరావుని, పనిచేసిన బృందాన్ని అభినందించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ సూర్యనారాయణ రాజు మాట్లాడుతూ, ప్రభుత్వ విద్యా కార్యక్రమాలు, విద్యా ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఇటువంటి సృజనాత్మక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణ, బాలల సంక్షేమం, బాలల వికాసానికి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో కమిషన్ తనవంతు పాత్ర పోషిస్తుందని చెప్పారు. విద్యా మంత్రి ఓఎస్డీ ఆకుల వెంకటరమణ, విద్యాశాఖ అధికారులు, సాంకేతిక బృంద సభ్యులు ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జాస్తికి వీర్ సావర్కర్ జాతీయ అవార్డు



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త:** అఖిలభారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు వీర్ సావర్కర్ జాతీయ అవార్డు అందుకున్నారు. రెండు దశాబ్దాలకు పైగా సామాజికసేవ, గ్రామీణాభివృద్ధి, సాంస్కృతిక పరిరక్షణ, ప్రజాసంక్షేమ కార్యక్రమాల్లో విశిష్టసేవలు అందిస్తున్న జాస్తి సేవలను గుర్తించిన భారతీ యువ అసోసియేషన్ ఈ అవార్డు అందచేసింది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లోక్‌పాల్‌సింగ్ చేతుల మీదుగా జాస్తి ఈఅవార్డు అందుకున్నారు. సామాజికసేవ, విద్య, కళలు, సంస్కృతి, వ్యవసాయం, ప్రజాసంక్షేమం వంటి రంగాల్లో విశేష కృషి చేసిన వ్యక్తులు, సంస్థలకు ప్రతి ఏటా ఈ అవార్డును అందిస్తారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న జాస్తిని పలువురు అభినందించారు. తనకు ఈ అవార్డు అందచేసిన భారతి యువఅసోసియేషన్‌కు వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు

# మహానాడు నిర్వహణలో కోవూరు అగ్రస్థానం


కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

**కోవూరు (నెల్లూరు), జూన్ 4 ప్రభాతవార్త:** మహానాడు కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్‌గా కోవూరు నియోజకవర్గానికి ప్రథమస్థానం వచ్చిందని, ఇందుకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్త లు, బూత్ కన్వీనర్లు ఐటిడిపి వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నానని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరులోని టిడిపి కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ మహానాడులో మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించడం జరిగిందని, ప్రతి కుటుంబంలోని మహిళలను స్థానిక సంస్థలకు సిద్ధం చేయాలని ఈ సందర్భంగా ఆమె పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పాటు జరిగిన డిజిటల్ మహానాడు కార్యక్రమంలో 20 లక్షల పైగా పాల్గొని టిడిపి సత్తా చాటారన్నారు. 33 సంవత్సరాలుగా కదలిక లేని ఇఫ్కో కిసాన్ సెజ్‌లో కదలిక తీసుకువచ్చి ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవ, పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో కంపెనీ రావడం జరిగిందన్నారు. మొత్తం 13 వేల కోట్ల రూపాయలతో రానున్న రోజుల్లో పరిశ్రమలు రానున్నాయన్నారు. కోవూరు నియోజకవర్గంలో 600 కోట్లతో రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా మరో 10 కోట్లు పనులు మంజూరు అయ్యాయని, త్వరలో వాటితో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. టిడిపిలో కార్యకర్తనే అధినేత అన్నారు. కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతూనే ఉన్నాయన్నారు. అసలు వెన్నుపోటు కార్యక్రమాన్ని ఎందుకు చేస్తున్నారో ప్రతిపక్ష పార్టీకే తెలియదన్నారు. ఐదు సంవత్సరాలు రాష్ట్రాన్ని అదోగతి పాలు చేసి ప్రస్తుతం ప్రజల మెప్పు పొందేందుకు ఇటువంటి నాటకాలు ఆడుతున్నారన్నారు. 16 వేల మందికి పైగా నిరుద్యోగ యువతకు డిఎస్సీలో ఉపాధి కల్పిస్తే దానిని కూడా మోసం అని చెప్పడం ఆ పార్టీకే తగిందన్నారు.

**ఎస్ఐఆర్‌పై ప్రత్యేక దృష్టి:** కోవూరు నియోజకవర్గంలో ఈ నెల 14 నుంచి ఎస్ఐఆర్ కార్యక్రమంపై బిఎల్ఒలు ఇంటింటికీ వెళ్లి ఫారంలు అందజేస్తారని, దీనిని దృష్టిలో పెట్టుకుని నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవల్ ఏజెంట్లు సమిష్టిగా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పిలుపునిచ్చారు. ఎక్కడా కూడా దొంగ ఓట్లు ఉండడానికి వీలు లేదని, రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమన్నారు. నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను వ్యక్తిగతంగా పరిశీలించాలని పిలుపునిచ్చారు. కోవూరు నియోజకవర్గంలో 324 పోలింగ్ బూత్ ఏజెంట్లు తప్పనిసరిగా ఈ ఎస్ఐఆర్ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, జొన్నవాడ దేవస్థాన చైర్మన్ అశోక్‌రెడ్డి, మాజీ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, పడుగుపాడు సొసైటీ చైర్మన్ శ్యామ్ సుందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు కాటంరెడ్డి కృష్ణారెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు అత్తిపల్లి శివప్రసాద్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పార్టీ నేతలు సీహెచ్ పెంచలయ్య, శ్రీనివాసులు నాయుడు, బాల రవి, రాధాకృష్ణ, ఎన్. వెంకట్, సుధాకర్, మాజీ సర్పంచ్ విజయ, ఆదాల శివారెడ్డి, సుబ్బానాయుడు, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

# పాత కక్షలతో యువకులపై బీర్ బాటిళ్లతో దాడి

## • 10 మంది నిందితుల అరెస్ట్

**నెల్లూరు (క్రైం), జూన్ 4 ప్రభాతవార్త:** పాత కక్షల నేపథ్యంలో ఒక యువకులను అంతమొందించాలనే ఉద్దేశంతో సమూహంగా ఏర్పడి, బీర్ బాటిళ్లతో తల, శరీరంపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసును పోలీసులు ఛేదించారు. ఈ హత్యాప్రయత్నం కేసుకు సంబంధించి 10 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలను గురువారం రూరల్ డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కోవూరు సీఐ సుధాకర్ రెడ్డి వెల్లడించారు. కుడితిపాలెం గ్రామానికి చెందిన షేక్. నాగూర్ బాబు అనే యువకుడు 2024లో స్త్రైలీ అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే, ఆమె 2025లో ఆత్మహత్య చేసుకోగా, ఆ విషయమై నాగూర్ బాబుపై కేసు నమోదైంది. ఆ తర్వాత అతను బెయిల్‌పై విడుదలయ్యాడు. అప్పటి నుండి స్త్రైలీ సోదరులైన మసూరి బన్నీ, మసూరి చక్రిలు నాగూర్ బాబుపై కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలో ఈ నెల రెండో తేదీ రాత్రి నాగూర్ బాబు తన సోదరుడు షఫీతో కలిసి ఇందుకూరుపేట మండలం, ముదివర్తిపాలెం గ్రామంలో జరిగిన ఒక కార్యక్రమానికి వెళ్లి తిరిగొస్తూ, శివాలయం సమీపంలోని పెన్నా నది ఒడ్డుకు వెళ్లారు. అక్కడ అప్పటికే పొంచివున్న నిందితులు నాగూర్ బాబును హత్య చేయాలనే ఉద్దేశంతో బీర్ బాటిళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. అడ్డుకోబోయిన అతని సోదరుడు షఫీపై కూడా దాడి చేశారు. షఫీ గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు రావడం గమనించి నిందితులు బైక్‌లపై పరారయ్యారు. ప్రస్తుతం బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి సోదరుడు షఫీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందుకూరుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ డా. అజిత వేజండ్ల ఉత్తర్వుల మేరకు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలో సాంకేతిక ఆధారాలు, సమాచార సేకరణతో నిందితులను గుర్తించారు. గురువారం మధ్యాహ్నం 3.00 గంటలకు నెల్లూరు రూరల్ మండలం, కొత్తూరు అంబాపురం టైడ్కో గృహసముదాయాల సమీపంలో 10 మంది నిందితులను



పోలీసులు అరెస్ట్ చేశారు. మసూరి బన్నీ, మసూరి చక్రి, బండారు మహేష్ బాబు, పార్వతాల కార్తీక్, పాపకారి నాని, పోలేపల్లి జశ్వంత్, పచ్చిగళ్ల భాను, కొమ్మూరు వెంకట ద్వారక శైలేష్, జక్కల మణికంత, షేక్ సలాంలు అరెస్టైన వారిలో ఉన్నారు. నేరానికి ఉపయోగించిన 3 మోటారు బైకులు, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే వారిపై, వ్యక్తిగత కక్షలతో హింసాత్మక మార్గాల్లో వివాదాలను పరిష్కరించుకోవాలని చూసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, అటువంటి వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని నెల్లూరు జిల్లా పోలీసులు స్పష్టం చేశారు.



# ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలు అరెస్టు


## • రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం: డిఎస్పీ వెంకటనారాయణ వెల్లడి

**చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:** చిత్తూరు వన్‌టౌన్ పోలీసులు 38 లక్షల రూపాయల బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. చిత్తూరు పోలీస్ గెస్ట్‌హౌస్‌లో గురువారం డిఎస్పీ వెంకట నారాయణ విలేకరులతో మాట్లాడుతూ చిత్తూరులోని మిట్టూరు ప్రాంతంలోని ఓ ఇంట్లో జరిగిన భారీ దొంగతనం కేసును వన్‌టౌన్ పోలీసులు విజయవంతంగా ఛేధించి ఇద్దరు అంతర్‌రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రూ.38 లక్షల విలువైన బంగారు, వెండి నగలను స్వాధీనం చేసుకున్నారన్నారు. మిట్టూరులోని ఎన్‌పి గౌతమ్ కిరణ్ ఇంట్లో సభ్యులు ఎవరులేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బంగారు, వెండి ఆభరణాలను దొంగలించుకెళ్ళారన్నారు. ఈ కేసుకు సంబంధించి తన ఆధ్వర్యంలో టుటౌన్ ఇన్స్‌పెక్టర్ నెట్టికంఠయ్య ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సాంకేతిక పద్ధతుల్లో దర్యాప్తు న్విహించారన్నారు. నేరస్థలంలో లభించిన సాక్ష్యాధారాలు, సాంకేతిక సమాచారం, ఇతర ఆధారాల విశ్లేసణ ద్వారా తమిళనాడు రాష్ట్రంకు చెందిన పెరుమాళ్ళకృష్ణ అలియాస్ పి.కృష్ణ, అతని కుమారుడు కృష్ణ సంతోష్‌కుమార్‌లు ఈ దొంగతనంకు పాల్పడినట్లు గుర్తించడం జరిగిందన్నారు. చిత్తూరు నగరంలోని కట్టమంచి ప్రాంతంలో నిందితులు వున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో గురువారం వీరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు విచారిస్తే నిందితులు నేరంను అంగీకరించడంతో వారి నుండి రూ.28 లక్షల విలువైన బంగారు నగలు, రూ.10 లక్షల విలువైన 3.75 కిలోల వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారన్నారు. పోలీసుల దర్యాప్తులో నిందితులు తాళాలు వేసిన ఇళ్ళను లక్ష్యంగా చేసుకుని వరుస చోరీలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. వీరిపై కర్నాటక రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో 17 కేసులు, తిరుపతి పరిసరాల్లో 3 కేసులు నమోదైనట్లు డిఎస్పీ వెంకట నారాయణ వెల్లడించారు. ఈ కేసు ఛేధించడంలో ప్రతిభ కనబరచిన వన్‌టౌన్ ఎస్ఐ కె.శివశంకర్, ఎఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్ళు, పోలీసు సిబ్బందిని డిఎస్పీ వెంకట నారాయణ అభినందిస్తూ రివార్డులు ప్రకటించారు.

## అదుపుతప్పిన ఐచర్... డివైడర్‌ను దాటి కారును ఢీ

# ఆగివున్న లారీని ఢీకొట్టిన మరో లారీ

## • ఒకరు దుర్మరణం.. ఇద్దరికి తీవ్రగాయాలు





**చంద్రగిరి, జూన్ 4 ప్రభాతవార్త:** నిద్రలేమితో వాహనాన్ని నడిపి మరో వ్యక్తి ప్రాణాలను హరించిన దుర్ఘటన బుధవారం అర్ధరాత్రి తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం ఐతేపల్లి సమీపంలో చోటుచుకున్నది. వివరాలను పరిశీలిస్తే విజయవాడ నుండి బెంగుళూరుకు వెళుతున్న ఐచర్ (మినీలారీ) వాహనం డ్రైవర్ నాగేశ్వర్‌రావు(50) పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారి ఐతేపల్లి సమీపంలో నిద్రలేమి, అతివేగం కారణంగా వాహనాన్ని అదుపు చేయలేని దుస్థితిలో డివైడర్‌ను అధిగమించి అటువైపు ఎదురుగా వస్తున్న కారును బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బెంగళూరు నుండి తిరుపతి వస్తున్న జీవకోనకు చెందిన కారు డ్రైవర్ రాజ్‌కుమార్(35), కారులోని వెంకటేష్ నాయుడు(52) తీవ్ర గాయాలపాలయ్యారు. అదేవిధంగా ఐచర్ డ్రైవర్ తన వాహనంలో చిక్కుకుపోయి తీవ్రగాయాల పాలయ్యాడు. ఈ ప్రమాదంతో వాహనాలు ఆగిపోయిన నేపథ్యంలో వేగంగా వచ్చిన లారీ ఆగివున్న మరో లారీని ఢీకొట్టింది. దీంతో వరుసగా వాహనాలు ముందున్న వాహనాలను ఢీకొట్టాయి. ప్రమాద సమాచారం అందుకున్న ఎస్ఐ మురళీమోహన్, ఇతర సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని ప్రమాదానికి గురైన కారులోని, ప్రమాదానికి కారణమైన లారీలలోని క్షతగాత్రులను స్థానికుల సహాయంతో ఆసుపత్రికి తరలించారు. యుద్ధప్రాతిపదికన క్రేన్ తెప్పించి ప్రమాదానికి గురైన వాహనాలను రోడ్డుపై తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. 108 ద్వారా తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యలో కారు డ్రైవర్ రాజ్‌కుమార్ మృతి చెందాడు. ఎస్ఐ మురళీమోహన్ రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# నెల్లూరులో భారీ దొంగతనం

## 210 గ్రాములు బంగారం చోరీ

**నెల్లూరు (క్రైం), జూన్ 4 ప్రభాతవార్త:** నమ్మకంతో ఇంటి తాళాలను బయట దాచడం ఓ కుటుంబానికి భారీ నష్టాన్ని మిగిల్చింది. దుండగులు అదను చూసి బీరువాలో ఉన్న సుమారు 210 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించుకు పోయిన ఘటన నెల్లూరు నగరంలోని కుమ్మరివీధిలో చోటుచేసుకుంది. కుమ్మరి వీధికి చెందిన షఫీ పండ్ల వ్యాపారం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లలను ట్యూషన్‌కు తీసుకెళ్లే సమయంలో ఇంటి తాళాలను బయట ఉన్న వాషింగ్ మెషీన్ కవర్‌లో ఉంచడం షఫీ భార్యకు అలవాటు. ఇదే అలవాటును కొనసాగిస్తూ, ఆ రోజు కూడా తాళాలను అక్కడే ఉంచి కుటుంబ సభ్యులంతా బయటకు వెళ్లారు. పిల్లలను ట్యూషన్ నుంచి తీసుకుని తిరిగి ఇంటికి వచ్చిన షఫీ భార్యకు లోపలి దృశ్యం చూసి షాక్ కు గురైంది. ఇంటి తలుపులు తీసి ఉండటంతో పాటు, బెడ్‌రూమ్‌లో ఉన్న బీరువా తెరిచి ఉంది. లోపల వెతకగా, 210గ్రాముల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దుండగులు ఇంటితాళం తీసి లోపలికి ప్రవేశించి, ఎవరూ లేని సమయం చూసి బీరువాను పగలగొట్టి నగలను దోచుకున్నారని ప్రాథమికంగా నిర్ధారించారు. సమాచారం అందుకున్న చిన్నబజార్ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్ ఆధారాలను సేకరించారు. ఇంటి బయట తాళాలు ఉంచే విషయం ఎవరికి తెలుసు? లేదా దొంగలు నిఘా పెట్టి ఈ పని చేశారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక సీసీ కెమెరాలను పరిశీలిస్తున్నారు.

# ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పిటిషన్ డిస్మిస్



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 4 ప్రభాతవార్త:** వైఎస్సార్సీపీ ఎమ్మెల్సీ అనంతబాబుకు తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఏసీబీ కోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. డ్రైవర్ సుబ్రమణ్యం హత్య కేసులో బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. బెయిల్ కోసం అనంతబాబు వేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. అనంతబాబుకు బెయిల్ ఇవ్వొద్దని ప్రత్యేక పీపీ ముప్పాళ్ల సుబ్బారావు కోర్టుకు తెలిపారు. సాక్షులను చంపుతానని అనంతబాబు బెదిరించారని పిపీ వివరించారు. కేసు విచారణ కీలకదశలో ఉన్నందున బెయిల్ ఇవ్వొద్దని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక పీపీ వాదనతో ఏకీభవించిన జడ్జి, అనంతబాబు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేశారు. డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసుకు సంబంధించి సాక్షుల విచారణ అనంతరం గురువారం జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్ పై వాదోపవాదములు జరిగాయి. ఈ పిటిషన్ పై ఇరువర్గాలు తరఫున ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఏసీబీ ఇంచార్జ్ కోర్ట్ న్యాయమూర్తి వెంకటేశ్వరరావు బెయిల్ తిరస్కరిస్తూ ఆదేశాలు ఇచ్చారు. జిల్లా జడ్జి స్పెషల్ కోర్టు వెకేషన్ లో ఉన్నారు కాబట్టి ఈ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీన కోర్టులో మరల వాదనలు ప్రారంభమైతాయని ఆయన వివరించారు.

# జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీల నియామకం

**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** జనసేన పార్టీ నిర్మాణ సమాచార సేకరణ కమిటీలను ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కల్యాణ్ నియమించారు. జనసూనికుల నుంచే భవిష్యత్తు నాయకత్వాన్ని తీర్చిదిద్దే వినూత్న ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. 25 పార్లమెంట్, 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసే దిశగా కసరుత్త చేస్తున్నామని పవన్ వ్యాఖ్యానించారు. కేడర్ ఆధారిత నాయకత్వ వ్యవస్థను మరింత పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్లాలను సూచించారు. క్షేత్రస్థాయి సమాచారాన్ని పరిశీలించి పార్టీ భాధ్యత కేటాయింపుపై తుది నిర్ణయం తీసుకుంటామని పవన్ పేర్కొన్నారు.

## ప్రతి పాటలో కొత్త భావాన్ని పంచిన మహాగాయకుడు ఎస్‌పి బాలు: వైఎస్ జగన్



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ గాయకుడు, పండితారాధ్యుల ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నివాళుల ర్పించారు. సామాజిక మాధ్యం ఎక్స్ వేదికగా స్పందిస్తూ సంగీతానికి భాష, ప్రాంతీయ సరిహద్దులు లేవని తనగాత్రంతో ప్రపంచానికి చాటిపెప్పిన గాన గంధర్వుడు, పద్మవిభూషన్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని కొనియాడారు. ప్రతి పాటలో కొత్త భావాన్ని పంచిన మహాగాయకుడు ఎస్పీబీ అని జగన్ అన్నారు. సంగీతానికి భాష, ప్రాంతీ సరిహద్దులు లేవని తన అమృత గాత్రంలో ప్రపంచానికి చాటిచెప్పిన గాన గంధర్వుడు పద్మవిభూషన్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. వేలాది పాటలు ఆలపించినా ప్రతి పాటలో కొత్త భావాన్ని కొత్త అనుభూతిని పంచిన మహాగాయకుడు ఆయన, తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా నివాళులు అంటూ జగన్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# కట్టా ప్రణయ్ ప్రకాశ్‌ను జైలులో ప్రశ్నిస్తామని సిట్ అధికారుల పిటిషన్

**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణంలో కీలక నిందితుల్లో ఒకడైన కట్టా ప్రణయ్ ప్రకాశ్‌ను జైలులో ప్రశ్నిస్తామని విజయవాడ ఏసీబీ కోర్టులో సిట్ అధికారులు పిటిషన్ వేశారు. పిటిషన్‌పై విచారణ చేపట్టి కోర్టు తీర్పు 8కి వాయిదా వేసింది.

మద్యం కుంభకోణంలో గుంటూరు జిల్లా జైలులో ప్రణయ్ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఇటీవల సిట్ మద్యం కుంభకోణంపై ఏసీబీ కోర్టులో దాఖలు చేసిన తాజా చార్జ్‌షీటులో ప్రణయ ప్రకాశ్‌పై కీలక ఆరోపణ చేసింది. ఆయన చేసిన పలు ఆర్థిక నేరాలను ప్రస్తావించింది.

## పోక్సో కోర్టులో విచారణకు మాజీ ఎంపి మాధవ్ గైర్హాజరు



**విజయవాడ, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అత్యాచారానికి గురైన బాలిక వివరాలను మీడియాలో వెల్లడించిన కేసు పోక్సో కోర్టులో విచారణకు వైఎస్సార్సీపీ మాజీ ఎంపీ మాధవ్ గైర్హాజరయ్యారు. గోరంట్ల మాధవ్ తరఫున న్యాయవాదులు గైర్హాజరు పిటిషన్ వేశారు. పోక్సో న్యాయస్థానం తదుపరి విచారణ జులై 13కు వాయిదా వేసింది.

# గాదె సాయికృష్ణను కోర్టులో హాజరుపర్చండి

## • హెబియస్ కార్పస్ పిటిషన్‌లో ఆదేశాలిచ్చిన హైకోర్టు


అదృశ్యమైన గాదె సాయికృష్ణ ఫైల్ ఫొటో

**విజయవాడ (క్రైం), జూన్ 4 ప్రభాతవార్త:** విజయవాడ కృష్ణలంక పోలీసులు అదుపులోకి తీసుకున్న తర్వాత అదృశ్యమైన సస్పెక్ట్ షీటర్ గాదె సాయికృష్ణను కోర్టులో హాజరుపర్చాలని జస్టిస్ హరిహర నాథ శర్మ, జస్టిస్ సుబ్బారెడ్డిలతో కూడిన హైకోర్టు ధర్మాసనం పోలీసులను ఆదేశించినట్లు తెలియవచ్చింది. గాదె సాయికృష్ణ పోలీసు కస్టడీలో హింసించడంతో చనిపోయి ఉంటాడని బెజవాడ బార్ అసోసియేషన్ లాయర్లు కోర్టుకు ఫిర్యాదు చేయడంతో 15వ తేదీ లోగా సాయికృష్ణను కోర్టులో హాజరుపర్చాలని, కస్టోడియల్ టార్చర్ నేపథ్యలో గాదె సాయికృష్ణకి ప్రాణ హాని తలెత్తి ఉండొచ్చని న్యాయవాదులు అనుమానం వ్యక్తం చేయడంతో హైకోర్టు ధర్మాసనం పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గాదె సాయికృష్ణను గత నెలలో కృష్ణలంక పోలీసులు మార్కాపురం నుండి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అయితే అతని తల్లి విజయలక్ష్మి పలు సార్లు స్టేషన్‌కు వెళ్ళి తన కుమారుని చూపించమని అడిగినప్పటికీ విధి నిర్వహణలో ఉన్న సిఐ నాగరాజు 'నీ కుమారునిపై ఆశ వదులుకో, అతనిని చంపేస్తామని' తనతో పేర్కొన్నట్లు విజయలక్ష్మి బెజవాడ బార్ అసోసియేషన్ మానవహక్కుల కమిటీ నిర్వహించిన విలేకరుల సమావేశంలో పేర్కొంది. ఈ నేపథ్యంలో తన కుమారుడిని సదరు కృష్ణలంక పోలీసులు చంపేసి ఉంటారని సదరు ప్రెస్‌మీట్‌లో అనుమానం వ్యక్తం చేసింది. గాదె సాయికృష్ణపై పలు కేసులు నమోదయ్యాయని పోలీసులు పేర్కొంటున్న నేపథ్యంలో పాత కేసుల విచారణలో భాగంగా గత నెలలో మార్కాపురం నుండి విజయవాడ పోలీసులు గాదె సాయికృష్ణను బలవంతంగా అదుపులోకి తీసుకుని, స్టేషనుకు తరలించారని అతని తల్లి విజయలక్ష్మి పేర్కొంది.

ఈ నేపథ్యంలో గాదె సాయికృష్ణ అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులు బార్ అసోసియేషన్‌ను ఆశ్రయించారు. నిందితునికి పోలీసుల కస్టడీలో ప్రాణ ప్రమాదం జరిగి ఉండవచ్చని బెజవాడ బార్ అసోసియేషన్ ప్రతినిధులు డివిజన్ బెంచ్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. నిందితుడు సాయికృష్ణ తమ అదుపులో లేదని పిపి న్యాయస్థానానికి సమా చారం ఇవ్వడంతో 15వ తేదీ లోపు అతడిని కోర్టులో హాజరుపర్చాలని ధర్మాసనం ఆదేశించి నట్లు సమాచారం.

**నలుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు:** ఈ కేసులో బెజవాడ బార్ అసోసియేషన్ మరో కీలక నిర్ణయం తీసుకుంది. భవిష్యత్ కార్యాచరణ రూపొందించడానికి మరికొన్ని నిజా నిజాలు వెలికి తీయడానికి నలుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ బిబిఎ అధ్యక్షులు వి.లక్ష్మీనారాయణ, వి.కిరణ్‌కుమార్‌లు నిర్ణయం తీసుకున్నారు. కమిటీ సభ్యులుగా సీనియర్ న్యాయవాదులు ఎఎస్ఎస్ రాంప్రసాద్, బిబిఎ మాజీ అధ్యక్షులు సంపర దుర్గా శ్రీనివాసరావు, బిబిఎ ఉపాధ్యక్షులు బండారుపల్లి లెనిన్, సప్పా రమేష్‌లను నియమించారు.


నెల్లూరులో ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తదితరులు

# నెల్లూరులో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహావిష్కరణ

**నెల్లూరు(వైద్యం), జూన్ 4 ప్రభాతవార్త:** అమర స్వర గాయకుడు పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతి సందర్భంగా నెల్లూరులో ఆయన కాంస్య విగ్రహాన్ని మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. అనంతరం సంగీతార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ, "ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం జీవితం సినీ సంగీత చరిత్రలో ఓ మైలురాయి. తెలుగు సినిమా సంగీతానికి ఘంటసాల - బాలూ ద్వయం స్వర్ణయుగం తీసుకొచ్చారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. వీరిద్దరూ తెలుగు పాటలకు పట్టాభిషేకం చేసి.. ప్రేక్షకుల హృదయ సింహాసనంపై కూర్చోబెట్టారు. రోజూ నిద్రలేచి మిగతా దినచర్య ప్రారంభించే ముందు శ్రీఅన్నమాచార్యుల కీర్తనలు, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం పాటలు విని ఇతర కార్యక్రమాలు ప్రారంభిస్తాను. అంతగా వారి గాత్రం నా జీవితంలో అంతర్భాగం అయ్యింది. తాను మాత్రమే కాదు, ఎందరో తెలుగు ప్రజల జీవితాల్లోనూ, ఆలయ సుప్రభాత సంగీత నివేదనల్లోనూ ఆయన స్వరం నిత్యం ధ్వనిస్తూనే ఉంది. బాలసుబ్రహ్మణ్యం పేరు స్మరించుకోగానే దేవరకొండ బాలగంగాధర్ తిలక్ రాసిన అమృతం కురిసిన రాత్రిగుర్తుకు వస్తుంది" అని అన్నారు. మన భాషను, సంస్కృతిని పరిరక్షించుకోవడమే బాలూ లాంటి వారికి ఇచ్చే నిజమైన నివాళి. వారు సమాజం నుంచి కోరుకున్నది కూడా అదేనని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

# సైబర్ నేరాలు, మహిళల భద్రతపై శ్రీవారి సేవకులకు అవగాహన



**తిరుమల, జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల వినియోగంపై తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ఆదేశాల మేరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి సేవకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుమల టూ టౌన్ సీఐ, టిటిడి విజిలెన్స్ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీవారి సేవకులకు సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, ఆన్‌లైన్ మోసాల నివారణ, సోషల్ మీడియా విని యోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళల భద్రతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. యాత్రికులకు సేవలందించే సమయంలో భద్రతా ప్రమాణాలను పాటిస్తూ, అనుమానాస్పద వ్యక్తులు, ఘటనలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారమందించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్112 సేవలు, సైబర్ నేరాల ఫిర్యాదు విధానం, మహిళల రక్షణకు అందుబాటులో ఉన్న సహాయ వ్యవస్థల గురించి వివరిం చారు. శ్రీవారి సేవకులు భక్తులకు సేవలందించడం తో పాటు భద్రతా పరిరక్షణలో కూడా కీలక పాత్ర పోషించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ సిఐ రాముడు, ట్రాఫిక్ సిఐ హరిప్రసాద్, టిటిడి ఏవీఎస్ఒ శివకుమార్, శ్రీవారి సేవకుల కోఆర్డినేటర్ శ్రీధర్, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.



జాతీయ ఎస్సీ, ఎస్టీ కమీషన్ ఛైర్మన్‌కు దుర్గమ్మ చిత్రపటం అందిస్తున్న ఇఒ

## దుర్గమ్మ ఆలయంలో సంకష్టహర చతుర్థి

**ఇంద్రకీలాద్రి, జూన్ 4, ప్రభాతవార్త :** శ్రీ దుర్గమ్మవారి ఆలయంలో సంకష్టహర చతుర్థి పూజాదికాలు జరిపారు. గణేశునికి పంచద్రవ్యాభిషేకం నిర్వహించిన అనంతరం చూడముచ్చటగా అలంకరించి వర్ణమయ పుష్పాలంకృతం చేశారు. అనంతరం ధూప, దీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా గణేశ హోమం నిర్వహించి పూర్ణాహుతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని శ్రీ అమ్మవారి ఆలయంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయాన్ని దర్శించుకున్నారు.

- నేడు పవిత్ర సంగమం వద్ద నదీహారతులు పునఃప్రారంభం: పవిత్ర సంగమం వద్ద సాయంత్రం 5.30లకు నవ హారతులు పునఃప్రారంభం అవుతాయని ఇఒ వికె శీనా నాయక్ తెలిపారు. కృష్ణ, గోదావరి పవిత్ర నదీ సంగమం వద్ద జరిగే ఈ నవహారతులను భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని వీక్షించాలని కోరారు.

- దుర్గమ్మవారి సేవలో జాతీయ ఎస్సీ ఎస్టీ కమిషన్ ఛైర్మన్: దుర్గమ్మవారిని జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఛైర్మన్ అంతర్‌సింగ్ ఆర్య గురువారం దర్శించుకున్నారు. ఆయనకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను ఇఒ వికె శీనా నాయక్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

- విరాళాలు: దుర్గమ్మవారి ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన తోట మల్లికార్జునరావు, మల్లేశ్వరి దంపతులు రూ.1,01,116ల విరాళం, మంగళగిరికి చెందిన పివిపి కృష్ణకుమార్ కుటుంబీకులు, అనిల్‌కుమార్ దంపతులు రూ.1,00,116ల విరాళాన్ని గురువారం అందించారు. దాతలకు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు అందించారు.

# ఆసుపత్రుల ఆవరణలో మొక్కలు నాటాలి

## పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి: మంత్రి సత్యకుమార్‌యాదవ్

**విజయవాడ,జూన్ 4,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్ని రకాల ఆసుపత్రుల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్య మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, నీటి సంరక్షణ, ఇంధన పొదుపు, ఆరోగ్య సంస్థల్లో సుస్థిర విధానాల అమలుపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆసు పత్రులు, కళాశాలల ఆవరణలో మొక్కల్ని నాటడంతో పాటు అవగాహన సదస్సులు, ఉపన్యాసాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నీటి సంరక్షణ, విద్యుత్ పొదుపుపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు కూడా చేపట్టాలన్నారు. సిబ్బంది, విద్యార్థులు, రోగులు, వారి సహాయకులు, సందర్శకులకు వీలైనంత మేర మొక్కలను పంపిణీ చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణ, సుస్థిర ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించే పోస్టర్లు, బ్యానర్లు, ఐఈసీ ప్రచార సామగ్రిని ప్రదర్శించాలని సూచించారు. డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ చక్రధర్ బాబు, వైద్య విద్యా సంచాలకులు (డీఎంఈ) డాక్టర్ విష్ణువర్ధన్ గురువారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. సెకండరీ హెల్త్ శాఖలోని ప్రతి ఉద్యోగి తమ కార్యాలయాలు, ఆసుపత్రుల ఆవరణలో కనీసం ఒక మొక్కను నాటి దాని సంరక్షణ బాధ్యతను స్వీకరించాలని చక్రధర్ బాబు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సెకండరీ హెల్త్ ఆసుపత్రులు, కార్యాలయాల్లో జూన్ 5న కనీసం 12,500 మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని కోరారు. మొక్కల మనుగడ శాతం పెరిగేలా అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఆరోగ్యవంతమైన మొక్కల్ని ఎంపిక చేసుకోవాలన్నారు. మొక్కలు నాటే ముందు తగిన పరిమాణంలో గుంతలు తవ్వి, స్థానిక సేంద్రియ ఎరువులతో నింపాలని సూచించారు. అలాగే ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులు, బోధనాసుపత్రులు, ప్రత్యేక వైద్యాసుపత్రులు, ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు, పాఠశాలల్లో పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని డిఎంఈ డాక్టర్ విష్ణు వర్ధన్ ఆదేశాలు పంపారు. డాక్టర్లు, సిబ్బంది అందరినీ భాగస్వామ్యం చేయాలని ఆయన సూచించారు. గోదావరి పుష్కరాల్లో నేత్ర వైద్య శిబిరాలు నిర్వహించాలి. వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం వచ్చే ఏడాది జూన్ లో జరగనున్న పవిత్ర గోదావరి పుష్కరాల్ని పురస్కరించుకుని వైద్య సేవల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఆదేశించారు. ముఖ్యంగా నేత్ర వైద్య శిబిరాల్ని నిర్వహించాలని స్పష్టంచేశారు. ఖఆంధ్రప్రదేశ్ రైట్ టు సైట్ సొసైటీఖ గవర్నింగ్ బాడీ సమావేశం వెలగపూడిలోని ఏపీ సచివాలయంలో 11 ఏళ్ల అనంతరం తొలిసారిగా మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగింది. దీనికి సీఎం చైర్మన్‌గా ఉన్నారు. వైస్‌చైర్మన్‌గా ఉన్న మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ పారా మెడికల్, ఆప్తాల్మిక్ ఖాళీల భర్తీకి ప్రాంతీయ సంచాలక కార్యాలయాలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఖాళీల భర్తీకి జీరో వేకెన్సీ విధానాన్ని వర్తింప చేయాలని అధికారులకు స్పష్టంచేశారు. అలాగే.. పారా మెడికల్ ఆప్తాల్మిక్ అసిస్టెంట్ కోర్సు నిర్వహణ, రిజిస్ట్రేషన్ల నిర్వహణ గురించి విపులంగా ఈ సమావేశంలో చర్చించారు. జాతీయ అంధత్వ నియంత్రణ, దృష్టిలోపాల నివారణ కార్యక్రమాల అమలు పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. వైద్య సేవలు ఇంకా మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టంచేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైద, ఆరోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీర పాండియన్, ప్రజారోగ్య శాఖ సంచాలకులు డాక్టర్ పద్మావతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## నీటివనరుల్లో ఆక్రమణలను తొలగించండి

**విజయవాడ జూన్ 4 ప్రభాతవార్త ప్రతినిధి:** నీటి వనరులను పరిరక్షించకపోతే నీరు అందకపోతే ఒకవైపు రైతులకు ఇబ్బంది మరోవైపు కాలుష్యం వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు తప్పదు. ఆక్రమణల విషయంలో చాలా సీరియస్‌గా వ్యవహరించాలని అని జల వనరులశాఖ అధికారులను అసెంబ్లీ వినతుల కమిటీ ఆదేశించింది. 6-9 నెలల గడువు పెట్టుకుని ఆలోపు కాలువలు, చెరువుల్లాంటి అన్ని నీటి వనరుల్లో ఆక్రమణలను తొలగించాలని స్పష్టం చేసింది. కమిటీ ఛైర్మన్ ఉపసభాపతి కె.రఘురామకృష్ణరాజు అధ్యక్షతన ఈ కమిటీ బుధవారం అసెంబ్లీలోని కమిటీహాల్లో అధ్యక్షతన ఈ కమిటీ బుధవారం అసెంబ్లీలోని కమిటీహాల్లో సమావేశమైంది. కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పల్లా శ్రీనివాస్, గురజాల జగన్ మోహన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. నీటి వనరుల్లో ఆక్రమణలపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. నీటి వనరుల పరిరక్షణ అంశాన్ని జలవనరులశాఖ అధికారులు పూర్తిగా వదిలేశారు. ఎవరో వచ్చి ఫిర్యాదు చేస్తేనే వెళ్లి చూద్దామనుకుంటే కుదరదు అని రఘురామకృష్ణరాజు అన్నారు. కోర్టు కేసులు ఉన్నాయని అధికారులు చెప్పబోగా ఛైర్మన్ కల్పించుకుని ఆక్రమణలను తొలగించ వద్దని కోర్టులు అనవు. ప్రక్రియను పాటించాలని చెబుతాయి. నా నియోజకవర్గమైన ఉండిలో ఇలాంటి 1000 ఆక్రమణలను తొలగించాం. దాన్నే కేస్ స్టడీగా వచ్చి చూడండి అదే పద్ధతిలో ఇతర ప్రాంతాల్లోనూ ఆక్రమణలపై చర్యలు తీసుకోండి అని ఆదేశించారు.

# దొంగ ఓట్లకు చెక్.. ప్రతి బూత్‌పై పట్టు

## - టిడిపి యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

## - ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



మహానాడు విజయోత్సవం కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**కొడవలూరు (నెల్లూరు), జూన్ 4, ప్రభాతవార్త :** ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత పెంపు, ఓటరు జాబితాల ప్రక్షాళన కోసం ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పిలుపునిచ్చారు. మండలం నార్తురాజుపాలెంలోని పీఎస్ఆర్ కళ్యాణ మండపంలో గురువారం సాయంత్రం తెలుగుదేశం పార్టీ మహానాడు హైబ్రిడ్ విధానంలో నిర్వహించిన వర్చువల్ విజయోత్సవ సభలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కోవూరు నియోజకవర్గ పరిధిలోని 324 పోలింగ్ కేంద్రాల్లో పనిచేస్తున్న బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్ఏలు) అప్రమత్తంగా వ్యవహరించి, ఓటరు జాబితాల్లోని నకిలీ నమోదులు, అనర్హుల పేర్లు, ఇతర అక్రమాలను గుర్తించి తొలగించే ప్రక్రియలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటరు జాబితాల స్వచ్ఛతతోనే ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలందరూ మై టీడీపీ యాప్‌ను విస్తృతంగా వినియోగించడంతో పాటు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల స్థలాలు, గృహాల కేటాయింపుల్లో చోటుచేసుకున్న సమస్యలు, ఆక్రమణలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రతి ఓటు, ప్రతి బూత్ పార్టీకి కీలకమని, బూత్ స్థాయి నాయకులు, ఏజెంట్లు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తల పార్టీ అని, కార్యకర్తల కృషి, అంకితభావంతోనే పార్టీ మరింత బలోపేతం అవుతోందని అన్నారు. మహానాడు విజయోత్సవ సభలో పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొనడం పార్టీ బలానికి నిదర్శనమని పేర్కొన్నారు. మహానాడు విజయోత్సవం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, కరకట్ల మల్లికార్జున్ , తువ్వర ప్రవీణ్ కుమార్, కేతు వెంకటరామిరెడ్డి, ఖూలోకం విజయ్ కుమార్, జొన్న శివకుమార్, గరికపాటి రాజా, కోవూరు వెంకీ, నక్క రమణయ్య, పది శ్రీనివాసులు, దావులూరు గోపి, భాష, మల్లి లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్థాన్‌తో దోస్తీకి పావులు కదుపుతున్న బంగ్లాదేశ్!



**ఢాకా, జూన్ 4:** బంగ్లాదేశ్‌లో కొత్తగా ఏర్పడిన తారిక్ రెహమాన్ బీఎన్‌పీ ప్రభుత్వం పాకిస్థాన్‌తో స్నేహానికే మొగ్గు చూపుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. బంగ్లాదేశ్‌కు చెందిన 12 మంది సీనియర్ సివిల్ సర్వెంట్లు మిడ్ కెరీర్ ట్రైనింగ్ కోసం పాకిస్తాన్ వెళ్లారు. ఒక అడిషనల్ సెక్రటరీ, 11 మంది జాయింట్ సెక్రటరీలు లాహోర్‌లోని సివిల్ సర్వెంట్ అకాడమీలో మే 4 నుంచి 21వ తేదీ వరకు శిక్షణ పొందారు. ఈ ఖర్చు మొత్తాన్ని పాకిస్తాన్ భరించింది.నిజానికి బంగ్లాదేశ్‌కు చెందిన అధికారులు 2024 వరకు భారత్‌లో శిక్షణ పొందడానికి వచ్చేవారు. ముస్సోరీ అకాడమీలో వెయ్యి మందికిపైగా బంగ్లా సివిల్ సర్వెంట్లు శిక్షణ పొందారు. 2024 వరకు ముస్సోరీలోని లాల్ బహదూర్ శాస్త్రి బంగ్లా సీనియర్ అధికారులు మిడ్ కెరీర్ ట్రైనింగ్ పొందేవారు. గడచిన వడేళ్లలో నేషనల్ సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రోగ్రాం కింద వెయ్యి మందికిపైగా బంగ్లాదేశ్ సివిల్ సర్వెంట్లు భారత్‌లో శిక్షణ పొందారు. 2500 మంది బంగ్లాదేశ్ అధికారులు భారత్‌లోని వేర్వేరు సంస్థల్లో శిక్షణ పొందారు. కానీ 2024లో షేక్ హసీనా పదవిని కోల్పోయిన తర్వాత ఈ ప్రక్రియ ఆగిపోయింది. ఇప్పుడు బంగ్లాదేశ్ తన అధికారులను శిక్షణ కోసం తొలిసారి పాకిస్తాన్‌కు పంపించింది. బంగ్లాదేశ్ తన దౌత్య సంబంధాలను, అంతర్జాతీయ భాగస్వామ్యాన్ని విస్తరించే ప్రణాళికలో భాగంగా ఇలా చేస్తోందని కొందరు విశ్లేషకులు చెబుతున్నారు. బంగ్లాదేశ్ ప్రజలు పాకిస్తాన్ కారణంగా తీవ్ర సమస్యలను ఎదుర్కొన్నారు. అలాంటిది ఇప్పుడు తమ దేశ అధికారులను శిక్షణ కోసం పంపించడం బంగ్లా పాలకులు సౌకర్యవంతంగా ఉంటే వారి నిర్ణయం వాళ్ల చేతుల్లోనే ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. ఇక నుంచి తముకు భారత్ తొలి ప్రాధాన్యం కాదనే సంకేతాలను బంగ్లాదేశ్ ఇస్తోంది. షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు బంగ్లాదేశ్, భారత్ మధ్య బలమైన సంబంధాలు ఉండేవి. 1971లో పాకిస్తాన్‌తో యుద్ధం చేసి స్వతంత్ర దేశంగా అవతరించిన బంగ్లాదేశ్ ఇస్లామాబాద్ పట్ల వ్యతిరేకతను కనబర్చేది. అయితే షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చేసిన తర్వాత ఐటీవలి కాలంలో ఢాకా పాలకులు పాకిస్తాన్‌కు దగ్గరవడం మొదలైంది. ఢాకా-కరాచీ మధ్య నేరుగా విమానాల రాకపోకలు మొదలయ్యాయి. పాకిస్థాన్‌కు చెందిన అత్యున్నత అధికారులు బంగ్లాదేశ్‌లో పర్యటిస్తున్నారు. పాకిస్థాన్, చైనా కలిసి తయారు చేసిన జేఎఫ్17 ఫైటర్ జెట్లను కొనుగోలు చేయడానికి కూడా బంగ్లాదేశ్ ఆసక్తి కనబర్చింది.

## ఆరురోజులపాటు డెత్‌జోన్‌లో చిక్కుకుని మృత్యుంజయుడిగా తిరిగొచ్చిన షెర్పా





**న్యూఢిల్లీ, జూన్ 4:** ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతం ఎవరెస్ట్ శిఖరాగ్రంపై ఒక అద్భుతం జరిగింది. దాదాపు ఆరు రోజుల పాటు గడ్డకట్టే మైనస్ డిగ్రీల చలిలో, ఆక్సిజన్ కూడా అందని డెత్ జోన్‌లో చిక్కుకుపోయి చనిపోయాడనుకున్న నేపాలీకు చెందిన అనుభవజ్ఞుడైన పర్వతారోహణ గైడ్ ప్రాణాలతో తిరిగి వచ్చాడు. ఆరు రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత అతడు ఒంటరిగానే బేస్ క్యాంప్‌నకు పాక్కుంటూ రావడం చూసి రెస్క్యూ బృందాలు సైతం ఆశ్చర్యపోయాయి. నేపాల్‌కు చెందిన ప్రముఖ క్లైంబింగ్ గైడ్ హిల్లారీ దవా షెర్పా మే 29వ తేదీ సాయంత్రం 5 గంటల ప్రాంతంలో బ్రిటన్ మాజీ రాయల్ నేవీ పర్వతారోహకుడు క్రిస్ బ్రాల్‌తో కలిసి 8,849 మీటర్ల ఎత్తులో ఉన్న ఎవరెస్ట్ శిఖరాన్ని విజయవంతంగా అధిరోహించాడు. మే 30వ తేదీ తెల్లవారుజామున తిరుగు ప్రయాణంలో ఎవరెస్ట్ పైభాగంలో అతడు అకస్మాత్తుగా అదృశ్యమయ్యాడు. ఆ తర్వాత అతడి కోసం భారీగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఎలాంటి ఆనవాళ్లు లభించలేదు. దీంతో అతడు మంచు తుఫానులో చిక్కుకుని చనిపోయి ఉంటాడని అందరూ భావించారు. బ్రిటిష్ క్లైంబర్ క్రిస్ బ్రాల్ సైతం సోషల్ మీడియా వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. హిల్లారీ దావా షెర్పాకు సంతాపం కూడా వ్యక్తం చేస్తూ తన మనసులోని మాటలను వెల్లడించాడు. అనాటి భయానక పరిస్థితులను గుర్తు చేసుకున్నారు. సాధారణంగా షెర్పాలు విశ్రాంతి తీసుకుని మళ్లీ వేగంగా మమ్మల్ని అందుకుంటారు కాబట్టి నేను ముందుకు వెళ్లాను. దారిలో నాకు ఇద్దరు పోలిష్ పర్వతారోహకుడు ఆక్సిజన్ అయిపోయి, మంచు తీవ్రతకు చేతులు పడిపోయి ప్రాణాపాయ స్థితిలో కనిపించాడు. ఆ సమయంలో వెనక్కి వెళ్లి హిల్లరీని తీసుకురావాలా? లేదా కష్టకాలంలో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న పర్వతారోహకుడిని కాపాడాలా అనే గందరగోళంలో ఉన్నాను.

## ఢిల్లీ అగ్నిప్రమాద ఘటనలో ఒకే కుటుంబంలో ఎనిమిది మందిమృతి

**న్యూఢిల్లీ, జూన్ 4:** దక్షిణ ఢిల్లీలోని మాలవీయ నగర్ రెస్టారెంట్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఎనిమిది మంది మరణించడం తీవ్ర విషాదాన్ని నింపింది. గురుగ్రామ్‌లోని సెక్టార్ 46కు చెందిన వివేక్ అగర్వాల్ అనే చార్టర్డ్ అకౌంటెంట్ ఢిల్లీలోని మాక్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న తన తండ్రిని పరామర్శించడానికి ఢిల్లీకి వచ్చారు. అతనితో పాటు అతని భార్య తర్జనీ అగర్వాల్, ఇద్దరు కుమార్తెలు జివిషా, వర్య తో నలుగురు బంధువులు కూడా వచ్చారు. అగ్నిప్రమాదం జరిగిన ఫ్లోరిష్ స్టే బెడ్‌అండ్‌బ్రేక్‌ఫాస్ట్‌లోనే వివేక్ రెండు గదులను బుక్ చేసుకున్నారు. అగ్నిప్రమాదం జరిగినప్పుడు ఆ బృందం హోటల్ రెస్టారెంట్‌లో అల్పాహారం తీసుకుంటోంది. ఈ అగ్నిప్రమాదంలో మొత్తం ఎనిమిది మంది మరణించారు. వివేక్ కుటుంబంలో ప్రాణాలతో మిగిలిన ఏకైక వ్యక్తి వివేక్ అగర్వాల్ తండ్రి రాధే శ్యామ్ అగర్వాల్(80). కుటుంబంలోని ఎనిమిది మంది మరణించడంతో గురుగ్రామ్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. డీఎస్‌పీ టెస్టుల అనంతరం బంధువులకు మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు తెలిపారు. అయితే ఈ రెస్టారెంట్‌కు ఒకే ప్రవేశ, నిష్క్రమణ మార్గముండటం దర్యాప్తు అధికారులు తెలిపారు. ప్రమాదం నుంచి తప్పించుకునేందుకు అవకాశం లేకపోవడంతో బాధితులు మంటల్లో చిక్కుకుని ఉంటారని తెలుస్తున్నది. స్థానికులు రోడ్డుపై పరుపులు పరచడంతో భవనంలోని మూడవ అంతస్తులో చిక్కుకున్న పలువురు వ్యక్తులు పైనుంచి కిందికి దూకారు. ఓ మహిళ తన చంటిబిడ్డను పట్టుకుని 3వ అంతస్తు నుంచి కిందకు దూకగా ఆమెకు కాలు విరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. డీఎఫ్ఎస్‌తోపాటు ఢిల్లీ విపత్తు నిర్వహణ సంస్థ సిబ్బంది, పోలీసులు, అంబులెన్సు సర్వీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. హోటల్‌లో బస చేసిన విదేశీయులు సెంట్రల్ ఆసియా, ఆఫ్రికా నుండి చికిత్స కోసం వచ్చినట్లు అధికారులు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని బెడ్ అండ్ బ్రేక్‌ఫాస్ట్ పథకం కింద ఈ హోటల్ నడుస్తున్నది.

### జేవార్ ఎయిర్‌పోర్టు ఫ్లైఓవర్ నిర్మాణపనుల్లో ప్రమాదం

## క్రేన్‌కూలి ఇద్దరు మృతి, మరో ముగ్గురి పరిస్థితి విషమం

**ఫరీదాబాద్, జూన్ 4:** జేవార్ ఎయిర్‌పోర్టు ఫ్లైఓవర్ నిర్మాణపనుల్లో ఉపయోగించిన భారీ క్రేన్ తిరగబడటంతో ముగ్గురు కార్మికులు చనిపోయారు. అలాగే శిథిలాలకింద అనేకమంది కార్మికులు చిక్కుకున్నట్లు తేలింది. జేవార్ ఎయిర్‌పోర్టు ఫ్లైఓవర్ నిర్మాణంలో పాంహెరా ఖుర్ద్ వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రక్షణ చర్యలు కొనసాగుతున్నాయి. అత్యవసర బృందాలను ఈప్రాంతానికి రప్పించి శిథిలాలు తొలగించి చిక్కుకున్నకార్మికులను వెలికితీసే చర్యలుచేపట్టారు. నిర్మాణపనులు జరుగుతుండగానే ఈ భారీ క్రేన్ కూలిపడిందని తెలిపారు. తీవ్రస్థాయిలో వచ్చిన గాలులవల్ల క్రేన్ తిరగబడి కూలడంతో ఇద్దరిని రక్షించామని, మరో ఇద్దరుముగ్గురు కూలిన ఫ్లైఓవర్ సామాగ్రి శిథిలాల కింద ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. సంఘటన ప్రాంతంలో భారీ నిర్మాణ సామాగ్రి ఉంది. ఎంతమంది చనిపోయారన్నది వాస్తవ సమాచారం వెలుగులోకి రాలేదు.

# కిడ్నీలను తాత, అమ్మమ్మ, నాన్నమ్మలు కూడా ఇవ్వొచ్చు

## కిడ్నీ రోగులకు స్వాంతన :మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జూన్ 4, ప్రభాతవార్త ప్రతినిధి :** కిడ్నీ(మూత్ర పిండం) బాధిత రోగులకు అవయవ మార్పిడి విషయంలో కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయాన్ని తీసుకుంది. అవయవాల స్వాప్ (పరస్పర మార్పిడి) విధానానికి కూటమి ప్రభుత్వం చట్ట బద్ధత కల్పించింది. ఒక కుటుంబంలోని దాత మరో కుటుంబంలోని గ్రహీతకు కిడ్నీని ఇచ్చి, బదులుగా వారి రోగికి అవసరమైన కిడ్నీని సదరు కుటుంబం నుంచి తీసుకునే విధానాన్ని కిడ్నీ స్వాప్ డొనేషన్ గా వ్యవహరిస్తున్నారు. దీనికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యాక్ట్ 2011ను రాష్ట్రంలో అమలుచేసేందుకు మంత్రివర్గం గురువారం ఆమోదం తెలిపిందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఒక ప్రకటనలో వెల్లడించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం జీవన్మృతుల అవయవదానాన్ని ప్రోత్సహించడంతో అనేక తీసుకుంటున్న పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాజా నిర్ణయాన్ని తీసుకున్నామన్నారు. కుటుంబ సభ్యుల్లో ఒకరు ముందుకొచ్చినా కిడ్నీ మార్పిడికి కుదరడంలేదు. ప్రస్తుతం జీవించి ఉన్న కుటుంబ సభ్యులు (తల్లి, తండ్రి, కవలపిల్లలు) నుంచి మాత్రమే మూత్రపిండాలను బాధిత రోగులకు అమర్చుతున్నారు. 1995 నుంచి అమల్లో ఉన్న చట్టాన్ని అనుసరించి ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే...ఒక్కోసారి కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీలు తీసి, బాధితులకు అమర్చేందుకు చికిత్సపరంగా సాధ్యంకావడంలేదు. రోగి, దాత(డోనార్) బ్లడ్ గ్రూపు మ్యాచ్ కాకపోవడం, ఒకవేళ బ్లడ్ గ్రూపు ఒకటే ఉన్నా కిడ్నీ అవసరమైన బాధితుడు, దాతలోని టిష్యూ టైపింగ్ సరిగా ఉండదు. ఇతర ప్రమాణాల ప్రకారం.. సాధ్యంకానప్పుడు మార్పిడి జరగడంలేదు. ఈ పరిస్థితుల్లో కిడ్నీ బాధితులకు స్వాంతన చేకూర్చేందుకు కేంద్ర హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ యాక్ట్ 2011 చట్టం ద్వారా ఖపరస్పర మార్పిడిఖ(స్వాప్) విధానాన్ని అమల్లోకి తెచ్చింది. దీనిని మంత్రివర్గం ఆమోదం తెలిపిందని ఆరిన్ జారీ జరగనుంది. తదనుగుణంగా నిబంధనలు జారీ అవుతాయి బాధితులు కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీలు పొందేందుకు శస్త్ర చికిత్సపరంగా(కొంద కుటుంబాల్లో) కుదరదని వైద్యులు నిర్ధారించినప్పుడు..సమీప బంధువుల నుంచి కూడా స్వీకరించొచ్చు. ఇరు కుటుంబాల్లో కిడ్నీ అవసరమైన వారు ఉంటారు. కుటుంబ సభ్యుల నుంచి కిడ్నీలు పొందేందుకు వైద్యపరంగా సాధ్యం కానప్పుడే ఖపరస్పర మార్పిడిఖ విధానాన్ని అనుసరించాల్సి ఉంది. ఈ కేసుల్లో పరిక్షల (బ్లడ్ గ్రూపు, ఇతర పరీక్షలు) అనంతరం వైద్యులు ఇచ్చే సలహాలు, సూచనలు అనుసరించి పరస్పర అంగీకారంతో కిడ్నీలు మార్పుకోవచ్చు. ప్రస్తుత విధానంలో మాదిరిగానే సదరు కుటుంబాల వారు జిల్లా వారీగా ఉన్న మెడికల్ బోర్డులకు దరఖాస్తు చేసుకోవాలి. ఆమోదం పొందాలి. రాష్ట్రంలో కిడ్నీల కోసం జీవన్ దాన్ ట్రస్ట్ కు ఖ దరఖాస్తు చేసిన వారు రాష్ట్ర వ్యాప్తంగా 3,634 మంది ఉన్నారు. బాధితులు కిడ్నీ లేదా కాలేయాన్ని తల్లిదండ్రులు, పిల్లల నుంచి మాత్రమే ప్రస్తుతం పొందుతున్నారు. ఈ జాబితాలోనికి తాత, అమ్మమ్మ, నాన్నమ్మలను కూడా చేర్చారు. చిన్న వయస్సు కలిగిన పిల్లలకు ఈ నిర్ణయం ఉపయోగకరంగా ఉంటుంది.చనిపోయిన వ్యక్తుల నుంచి కార్నియా, నర్వ్, టెండాన్, స్కిన్ అవసరమైన వారికి ఇస్తున్నారు. ఈ కేటగిరి ప్రస్తుతం ఆర్గాన్ డొనేషన్ జాబితాలో ఉంది. వీటిని "టిష్యూ జాబితాలోనికి చేర్చారు. సాంకేతికంగా ఈ మార్పు జరిగింది జీవన్మృతుల అవయవదానం ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది. గడచిన రెండేళ్లలో మొత్తం 209 మంది 663 అవయవాలను దానం చేశారు. జీవన్మృతుల కుటుంబాలకు రూ. 10,000 చొప్పున నగదు పారితోషికాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. అలాగే అవయవ దానం చేసిన మృతులకు ప్రభుత్వ లాంఛనాలతో అంత్య క్రియలు చేస్తున్నారు.

## భార్య విడాకులిస్తానని చెప్పడంతో

# జెసిబితో ఇల్లుకూల్చేసిన భర్త!



**పెన్సిల్వేనియా, జూన్ 4:** అమెరికాలోని పెన్సిల్వేనియాలో ఒక వ్యక్తి తన భార్య తనకు విడాకులు ఇస్తానని చెప్పడంతో ఎవరూ ఊహించని ఒక పని చేశాడు. ఏకంగా జేసీబీని వేసుకు వచ్చి ఇంటిని కూల్చేశాడు. అతడు ఇల్లు కూల్చుతున్న సమయంలో అతని భార్య, ఇద్దరు కుమార్తెలు ఆ ఇంటి లోపలే ఉన్నారు. అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్‌లో జరిగిన ఈ ఘటన ప్రస్తుతం సంచలనంగా మారింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. నువ్వు వద్దంటే ఇల్లు కూడా వద్దు పెన్సిల్వేనియాకు చెందిన 48 ఏళ్ల ఎరిక్ పెయిర్చ్ అతని భార్యకు మధ్య కొంతకాలంగా విభేదాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలో మే 26వ తేదీన భార్య అతనితో.. "నాకు నీతో కలిసి జీవించడం ఇష్టం లేదు.. మనం విడాకులు తీసుకుందామని స్పష్టం చేసింది. ఈ మాట వినగానే ఎరిక్‌కు విపరీతమైన కోపం వచ్చింది. ఆగ్రహంతో ఊగిపోయిన అతడు.. "మన బంధం ముగిసిపోతే.. ఇక ఈ ఇల్లు కూడా ఉండకూడదని నిశ్చేయ. వెంటనే దీన్ని నేను కూల్చేస్తాను" అంటూ భార్యను హెచ్చరించాడు. హెచ్చరించిన కొద్ది నిమిషాల్లోనే ఎరిక్ ఉన్మాదిలా ప్రవర్తించాడు. బయట ఉన్న ఒక భారీ జేసీబీ యంత్రంలోకి ఎక్కి, తన సొంత నివాస గృహాన్ని ధ్వంసం చేయడం ప్రారంభించాడు. ఆ సమయంలో అతని భార్య, భయాందోళనలతో వణికిపోతున్న ఇద్దరు కుమార్తెలు ఇంట్లోనే చిక్కుకుపోయారు. ప్రాణ భయంతో భార్య వెంటనే అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 911కు ఫోన్ చేసి పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫోన్ మాట్లాడే సమయంలో నేపథ్యం నుంచి భయంకరమైన కేకలు, ఇల్లు కూలిపోతున్న శబ్దాలు, యంత్రాల గర్జనలు స్పష్టంగా వినబడ్డాయని ఎమర్జెన్సీ ఆపరేటర్లు తెలిపారు. ఎరిక్ కోపంతో శక్తిమంతమైన యంత్రాన్ని ఆపి ఇంటి లోపలికి పరిగెత్తి, ఒక డఫిల్ బ్యాగ్ తీసుకుని వేరే నగరానికి పారిపోయాడు. సమాచారం అందుకున్న అప్పర్ టౌన్‌షిప్ పోలీసులు రంగంలోకి దిగి, అదే రోజు నిందితుడిని అరెస్ట్ చేశారు. అదృష్టవశాత్తూ భార్య, పిల్లలకు ఎలాంటి శారీరక గాయాలు కాలేదని ఆ భారీ యంత్రం దాడి కారణంగా ఇంటి పునాదులు, నిర్మాణాత్మక స్థిరత్వం పూర్తిగా దెబ్బతిన్నాయని పోలీసులు వెల్లడించారు. నిందితుడిపై ఎరిక్ పెయిర్చ్‌పై పోలీసులు అత్యంత తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ముగ్గురు వ్యక్తుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టడం, విపత్కర కారణం కావడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం వంటి ఆరోపణలపై కేసులు పెట్టారు. ప్రస్తుతం అతడిని బట్లర్ కౌంటీ జైలులో ఉంచారు. ఈయనకు బెయిల్ మంజూరు చేయాలంటే భారత కరెన్సీ ప్రకారం సుమారు రూ.9.57 లక్షలు పూచీకత్తును విధించారు.

**తొలి గ్రాండ్ స్లామ్ టైటిల్ దిశగా రష్యా యువ సంచలనం**

# ఫ్రెంచ్ ఓపెన్ ఫైనల్లో ఆండ్రీవా




**పారిస్:** రష్యా యువ సంచలనం మీర్రా ఆండ్రీవా... ఫ్రెంచ్ ఓపెన్ మహిళల సింగిల్స్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో ఉక్రెయిన్‌కు చెందిన మార్టా కోస్టియుక్‌పై 6-1, 6-3తో వరుస సెట్లలో అలవోకగా గెలుపొందింది. 19 ఏళ్ల ఆండ్రీవా అద్భుత ఆటతీరుతో కోస్టియుక్‌కు అవకాశం లేకుండా చేసింది. ఈ విజయంతో మీర్రా ఆండ్రీవా కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను అందుకునే దిశగా ఫైనల్ అడుగు వేసింది.

తొలి సెట్ ప్రారంభంలోనే మూడు బ్రేక్ పాయింట్లను కాపాడుకున్న ఆండ్రీవా... వరుస విన్నర్లతో 4-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. కోస్టియుక్ ఒకే ఒక సారి సర్వీసును నిలబెట్టుకుంది. తొలి సెట్‌ను సునాయాసంగా సొంతం చేసుకున్న రష్యన్ స్టార్.. రెండో సెట్‌లోనూ ఆధిపత్యం కొనసాగించింది. బలమైన సర్వీసులతో ఉక్రెయిన్ ప్లేయర్‌ను ఉక్కిరిబిక్కిరి చేసింది. కోస్టియుక్ చివర్లో కొంత ప్రతిఘటన చూపించినా ఆండ్రీవా జోరు ను అడ్డుకోలేకపోయింది.

**సంకల్పమే గెలిపించింది-ఆండ్రీవా**

మ్యాచ్ అనంతరం ఆండ్రీవా మాట్లాడుతూ.. "ఇది నా తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్. ఈ క్షణం అద్భుతంగా ఉంది. ఎలాంటి పరిస్థితులు వచ్చినా చివరి వరకు పోరాడాలనే ఆలోచనతోనే కోర్టులోకి దిగాను. అదే నన్ను గెలిపించింది"అని పేర్కొంది.

**నో షేక్‌హ్యాండ్, నో గ్రూప్ ఫోటో**

మ్యాచ్ పాయింట్‌ను ఖాయం చేసిన వెంటనే ప్రేక్షకులకు అభివాదం చేస్తూ ఆండ్రీవా ఆనందాన్ని పంచుకుంది. మరోవైపు మార్టా కోస్టియుక్ మాత్రం నెట్ వద్ద ఆగకుండా, షేక్ హ్యాండ్ ఇవ్వకుండా నేరుగా కోర్టు వీడి వెళ్లింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఉక్రెయిన్ ఆటగాళ్లు.. రష్యా, బెలారస్ క్రీడా కారులతో కరచాలనం చేయక పోవడం గత కొన్నేళ్లుగా కొనసాగుతోంది. అదే పరిస్థితి ఫ్రెంచ్ ఓపెన్ సెమీఫైనల్లోనూ కనిపించింది. సాధారణంగా మ్యాచ్ అనంతరం ఇద్దరు ఆటగాళ్లు కలిసి దిగే ఫొటో, షేక్ హ్యాండ్ కనిపించలేదు.



# ఎర్రమట్టిలో టాప్ సీడ్ల ఖేల్ ఖతమ్

*నాలుగు గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలలో ఫ్రెంచ్ ఓపెన్‌ది ప్రత్యేకం. ఎర్రమట్టి సమరంలో విజేతగా నిలవాలన్నది టెన్నిస్ బ్యాట్ పట్టిన ప్రతి ఒక్కరిది ఆశయం. వింబుల్డన్, యుఎస్ ఓపెన్, ఆస్ట్రేలియన్ ఓపెన్లు నెగ్గినా పారిస్‌కు వచ్చేసరికి వెనకబడడం రివాజుగా మారుతోంది. ఫ్రెంచ్ ఓపెన్‌లోనూ ఈ సారి టాప్ సీడ్లు అందరూ ఇప్పటికే ఇంటిముఖం పట్టారు. ఇటు పురుషుల సింగిల్స్‌లో, అటు మహిళల సింగిల్స్‌లో కొత్త ఛాంపియన్లు ఆవిర్భవించబోతున్నారు.*

**పారిస్:** గ్రాండ్‌స్లామ్ టోర్నీలకు స్టార్ ఆటగాళ్లే ప్రధాన ఆకర్షణ. అయితే ఈసారి ఫ్రెంచ్ ఓపెన్ స్టార్ కళ చివరి కొచ్చేసరికి తగ్గిపోయింది. రోలాండ్ గారోస్‌లో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. క్వార్టర్ ఫైనల్ దశకే పురుషులు, మహిళల సింగిల్స్‌లో పలువురు అగ్ర శ్రేణి ఆటగాళ్ల ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్‌లో అయితే వరల్డ్ నెంబర్ వన్ యానిక్ సినర్, జకోవిచ్ మధ్య... మహిళల సింగిల్స్‌లో అయితే సబలెంకా, గాఫ్‌ల మధ్యే పోటీ ఉంటుందని భావించిన అభిమానులకు ఇది పెద్ద షాక్‌గా మారింది.

**అల్కరాజ్‌తో మొదలు**

ఫ్రెంచ్ ఓపెన్ ప్రారంభానికి ముందే టైటిల్ ఫేవరెట్ కార్లోస్ అల్కరాజ్ గాయంతో దూరమయ్యాడు. తొలి రౌండ్‌లోనే డానిల్ మెద్వెదేవ్‌కు షాక్ తగిలింది. ఆ తర్వాత ప్రపంచ నంబర్ వన్ యానిక్ సినర్, 24 గ్రాండ్‌స్లామ్‌ల విజేత జకోవిచ్ కూడా వరుసగా నిష్క్రమించడం సంచలనంగా మారింది. టేలర్ ఫ్రిట్జ్, ఆండ్రే రుబ్లెవ్, కాస్పర్ రూడ్, ఫ్రాన్సెస్ టియాఫో వంటి ఆటగాళ్లు కూడా ఆశించిన స్థాయిలో రాణించలేక ఇంటిదారి పట్టారు.

**మహిళల సింగిల్స్‌లోనూ అంతే**

మహిళల సింగిల్స్‌లోనూ పరిస్థితి భిన్నంగా ఏమీ లేదు. టాప్ సీడ్ సబలెంకా, అమెరికన్ స్టార్ కోకో గాఫ్, ఎలెనా రిబాకినా వంటి అగ్ర శ్రేణి క్రీడాకారిణులు సెమీస్‌కు ముందే ఓటములతో టోర్నీకి దూరమయ్యారు. 2021 యూఎస్ ఓపెన్ తర్వాత తొలిసారి గ్రాండ్‌స్లామ్ సెమీస్, ఫైనల్స్‌లో టాప్ సీడ్ల ప్రభావం కనిపించకుండా పోయింది. గ్రాండ్‌స్లామ్‌ల ఆదాయంలో ఆటగాళ్ల వాటా పెంచాలని పలువురు స్టార్ ప్లేయర్లు బహిరంగంగానే డిమాండ్ చేశారు. తగిన గుర్తింపు, ఆదాయం లభించకపోతే భవిష్యత్తులో కఠిన నిర్ణయాలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పుడు అదే ఆటగాళ్లు ముందుగానే నిష్క్రమించడంతో టెన్నిస్ వర్గాల్లో కొత్త చర్చ మొదలైంది. ఇది కేవలం ఆటలో భాగంగా జరిగిన ఫలితాలేనా? లేక టోర్నీ ఆకర్షణ తగ్గించేలా ఏదైనా పరోక్ష సందేశమా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అయితే అండర్‌డాగ్ ఆటగాళ్ల అద్భుత ప్రదర్శనలతో స్టార్‌లను ఓడించడం హైలైట్‌గా నిలుస్తోంది.

**కొత్త ఛాంపియన్లు ఖాయం**

మొత్తానికి ఫ్రెంచ్ ఓపెన్‌లో కొత్త ఛాంపియన్లు ఖాయమయ్యారు. ఈసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో అన్‌సీడెడ్లు షాక్‌ల మీద షాక్‌లు ఇస్తూ దూసుకువస్తున్నారు. ముఖ్యంగా రష్యా 19ఏళ్ల యువ సంచలనం మీర్రా ఆండ్రీవాకు టైటిల్ నెగ్గేందుకు సువర్ణావకాశం.

## ప్రపంచ యోగాకు 60 దేశాలు

**అహ్మదాబాద్:** మొట్టమొదటి ప్రపంచ యోగాసన ఛాంపియన్‌షిప్ అహ్మదాబాద్‌లో ప్రారంభమైంది. అయిదు రోజుల పాటు జరిగే ఈ పోటీలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. పోటీ క్రీడగా గుర్తింపు ఇవ్వడం ద్వారా ఈ ఛాంపియన్‌షిప్ యోగాకు ఒక కొత్త దశకు నాంది పలికిందన్నారు. భవిష్యత్తులో ఒలింపిక్స్‌తో సహా అంతర్జాతీయ క్రీడా వేదికల్లో యోగాకు చోటు దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ పోటీల్లో 400 మందికి పైగా అథ్లెట్లు పాల్గొంటున్నారు. అమెరికా, ఘనా, కెన్యా, మలేసియా, శ్రీలంక, ఉజ్బెకిస్థాన్‌తో పాటు 60 పైగా దేశాల అథ్లెట్లు పోటీపడుతున్నారు.



## కేఎస్ భరత్ క్రికెట్‌కు వీడ్కోలు

**విశాఖ:** ఆంధ్ర క్రికెటర్ కేఎస్ భరత్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. 32 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. 2023లో ఆస్ట్రేలియాపై నాగ్‌పూర్‌లో టెస్టు అరంగేట్రం చేసిన భరత్... టీమిండియాకు 7 టెస్టులు ఆడి 221 పరుగులు చేశాడు. వికెట్‌కీపర్‌గా 18 క్యాచ్‌లు, ఒక స్టంపింగ్ నమోదు చేశాడు. దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర రంజీ జట్టు తరపున మంచి ట్రాక్ రికార్డు ఉంది. 113 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 6102 పరుగులు చేశాడు. ఇందులో 11 సెంచరీలు, 34 అర్ధసెంచరీలు ఉన్నాయి. ఓ ట్రిపుల్ సెంచరీ కూడా ఉంది. దేశవాళీ టీ20ల్లో 91 మ్యాచ్‌లు ఆడి 11 అర్ధ సెంచరీల సాయంతో 1812 పరుగులు చేశాడు. ఐపీఎల్‌లో భరత్ 11 మ్యాచ్‌ల్లో ఓ అర్ధ సెంచరీ సాయంతో 199 పరుగులు చేశాడు. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికినప్పటికీ.. భవిష్యత్తులో కోచింగ్, మెంటరింగ్ ద్వారా యువ ఆటగాళ్లకు మార్గనిర్దేశం చేస్తానని భరత్ వెల్లడించాడు. టీమిండియా తరపున ఆడటం తన జీవితంలో అత్యున్నత గౌరవంగా పేర్కొన్నాడు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన కుటుంబ సభ్యులు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లు, బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు.



# ఆన్ చేతిలో సింధూ పదోసారీ

**బాలీ:** ఇండోనేషియా ఓపెన్‌లోనూ భారత ఏస్ షట్లర్ పీవీ సింధూకు నిరాశే ఎదురైంది. మరోసారి ప్రపంచ నెంబర్ వన్ ఆన్ సే యంగ్ చేతిలో ఓటమితో క్వార్టర్ ఫైనల్లోనే దూరమైంది. ఇటీవలి సింగపూర్ ఓపెన్‌లోనూ ఆన్ సే యంగ్ అడ్డంకిగా నిలిచింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్లో పీవీ సింధూపై 21-17, 21-14తో ఆన్ సే యంగ్ గెలుపొందింది. సింధూపై ఆమె విజయాల రికార్డు పదికి చేరింది. రెండుసార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పీవీ సింధూ... ఆన్ సే యంగ్‌తో ఢీ అంటే ఢీ అనే స్థాయిలో ఆరంభంలో పాయింట్లు సాధించింది. తొలి గేమ్‌లో 10-10తో సమంగా సాగిన తర్వాత, సింధూ పాయింట్ సాధించి స్వల్ప ఆధిక్యం సాధించింది. కానీ ఆన్ వరుస పాయింట్లతో ఆధిక్యాన్ని 19-16కు పెంచుకుంది. చివరకు ర్యాలీతో ఆన్ తొలి గేమ్‌ను కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లో ఆన్ 13-6 ఆధిక్యంతో ముందుకొచ్చింది. సింధూ వెనుకబడినా, ప్రతి పాయింట్ కోసం పోరాడుతూ కొన్ని సందర్భాల్లో స్కోరు దగ్గర చేసింది. అయితే, ఆన్ స్థిరమైన ఆటతీరు, నెట్ గేమ్ నిర్ణయాత్మకంగా నిలిచాయి. సింధూపై నెగ్గి ముందంజ వేసింది. కాగా డబుల్స్‌లో హరిహరన్, అర్జున్ జోడీ మరో గెలుపు అందుకుంది. తొలి గేమ్ ఓడినా.. తరువాతి గేమ్‌ల్లో పుంజుకుని 16-21, 21-14, 21-19తో అమెరికా జోడీపై నెగ్గారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో భారత జోడీ కపూర్-గద్దెకు పరాజయం ఎదురైంది. పురుషుల సింగిల్స్‌లో ఆయుష్ ఆశాకిరణంగా ఉన్నాడు.



## ప్రభుత్వ బాండ్ల విదేశీ ఇన్వెస్టర్లకు ఎల్టీసీజీ రద్దు

**ముంబయి, జూన్ 4:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లను మరింతగా ఆకర్షించేందుకువీలుగా పెటుబడులు పెట్టే ఎఫ్‌పిఐలకు దీర్ఘకాలిక మూలధన లబ్దిపన్ను 12.5శాతాన్ని తొలగించేందుకు ప్రభుత్వం పరిశీలనచేస్తోంది. అంతేకాకుండా విదేశీ పెట్టుబడిదారులపై విధించే 20శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను కూడా తొలగించాలనినిర్ణయించింది. విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఎవరైతే ప్రభుత్వ బాండ్లు, సెక్యూరిటీల్లో పెట్టుబడులు పెడతారో వారికే ఈ రాయితీ లభిస్తుంది. ఇటీవలికాలంలో పెట్టుబడులు తరలిపోతుండటంతో వాటిని కట్టడిచేసేందుకుఎన్డీయే సర్కారు ఈ వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు అంచనా. విదేశీ ఇన్వెస్టర్లు పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇప్పటివరకూ రూ.2.5 లక్షలకోట్ల పెట్టుబడు లను భారత మార్కెట్లనుంచి విత్‌డ్రాచేసుకున్నారు.

విదేశీ డెట్ నిధుల రాకపై భారత్ అధిక సుంకాలు, ట్యాక్స్‌లు వసూలుచేస్తుందన్న ఆందోళన కూడా ఉంది. విదేశీ బాండ్ల హోల్డర్లకు ఈ మినహాయింపు తక్షణమే అమలులోకి వస్తుందని అంచనా. ఇందుకోసం ప్రభుత్వం ఒక ప్రత్యేక ఆర్డినెన్స్‌ను తీసుకువచ్చింది. అయితే ఈ మినహాయింపు 12నెలలకు పైగా పెట్టుబడులను స్థిరంగా కొనసాగించిన ఇన్వెస్టర్లకే వర్తిస్తుందని కూడా కేంద్రం ప్రకటించింది. ప్రభుత్వ బాండ్లపై వడ్డీ ఆర్జించిన ఇన్వెస్టర్లకు 20శాతం విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను కూడా రద్దు చేయనున్నది. 2023లోప్రభుత్వం ఐదుశాతం రాయితీరేట్‌ను తొలగించింది. ఈ ఏడాది భారీ మొత్తాలు విత్‌డ్రాచేయడంతో వీటిని కట్టడిచేసేందుకు ఎఫ్‌పిఐలకు ఊరటనిచ్చే ఆర్డినెన్స్‌ను తెచ్చింది.



# స్పేస్ ఎక్స్ ఐపిఒతో 74బిలియన్ డాలర్ల టార్గెట్

**న్యూయార్కు, జూన్ 4:** బిలియనీర్‌పారిశ్రామికవేత్త ఎలాన్‌మస్క్ ఆధ్వర్యంలో ఉన్న స్పేస్‌ఎక్స్ అధికారికంగా ఐపిఒకు పత్రాలను దాఖలు చేసింది. అంతేకాకుండా తమ ఇష్యూధరను ఒక్కో షేరుకు 135 డాలర్లుగా పేర్కొంటున్నది. దీనితో ప్రపంచంలోనే అతిపెద్ద ఐపిఒగా స్పేస్ ఎక్స్ ఇపుడు నిలుస్తోంది. ఈ ఐపిఒ ద్వారా 74.4బిలియన్ డాలర్లనిధులు సమకూర్చుకోవాలని టార్గెట్ పెట్టుకుంది. ఇదే విజయవంతం అయితే 2019లో సౌదీలోని ఆరామ్‌కో కంపెనీ జారీచేసిన ఐపిఒ కంటే మరింత పెద్దదిగా నమోదవుతుంది. సౌదీ ఆరామ్‌కో గతంలో 1.7 లక్షలకోట్ల డాలర్ల విలువైన కంపెనీగా పేర్కొంటూ 2019లో ఐపిఒ జారీచేసి 29 బిలియన్ డాలర్లు సమీకరించింది. ప్రస్తుతం ఎలాన్ మస్క్ కంపెనీ కూడా అంతకు మించి నిధులు సమీకరించే లక్ష్యంతో ఉంది. కంపెనీ విలువలు అమెరికా డాలర్లలోనే 1.77 లక్షలకోట్లుగా ప్రకటించారు. గత ఫిబ్రిరిలో కంపెనీ విలువలు 1.25 లక్షలకోట్ల డాలర్లకంటే ఎక్కువ విలువలకు చేరింది. అందువల్లనే స్పేస్‌ఎక్స్‌కు 74.4 బిలియన్ డాలర్ల నిధులను సమీకరించేందుకు నిర్ణయించింది. స్పేస్‌ఎక్స్ పరంగాచూస్తే ఇపుడు స్టార్‌లింక్ ఒక్కటే లాభదాయక సంస్థగా నిలిచింది. 11.4 బిలియన్ డాలర్ల రాబడులు సాధించింది. 2025లోనే నిర్వహణ రాబడులు 4.4 బిలియన్ డాలర్లు సాధించింది. స్పేస్ ఎక్స్‌లో 50శాతం వాటా ఎలాన్ మస్క్‌కు ఉంది. ఈ మొత్తం విలువలు 752 బిలియన్‌డాలర్లుగా చెపుతున్నారు. కంపెనీ నిర్దిష్టమైన మైలురాళ్లు బ్రేక్‌చేసే వరకూ మస్క్ మాత్రం తన వాటా షేర్లను విక్రయించకూడదని నిర్ణయించుకున్నారు. స్పేస్ ఎక్స్‌తో పాటే ఓపెన్ ఎఐ, ఆంథ్రోపిక్ సంస్థలు కూడా ఐపిఒలకు వస్తున్నాయి. ఆంత్రోపిక్ 900 బిలియన్ డాలర్ల విలువగల కంపెనీగా ఉంది. ఓపెన్ ఎఐ గోల్డ్‌మాన్‌శాక్స్, మోర్గాన్ స్టాన్లీలతోకలిసి చేస్తోంది. ఐపిఒ కార్యకలాపాలు మొత్తం తొలిత్రైమాసికంలో 251 లావాదేవీలద్వారా 42.6 బిలియన్ డాలర్లు నిధుల సేకరణ జరిగిందని కెపిఎంజి గ్లోబల్ వెల్లడించింది.


## పశ్చిమాసియా ఉద్రిక్తతలు యధాతథం

# సెన్సెక్స్, నిఫ్టీల్లో ట్రేడిగ్ నామమాత్రం




**ముంబయి, జూన్ 4:** రిజర్వుబ్యాంకు మానిటరీ పాలసీ సమీక్షనిర్ణయాలు వెలువడనుండటంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా ట్రేడింగ్‌చేయడంతో ఈక్విటీ సూచీలు ఎక్కడికక్కడే ముగిసాయి. వీటికితోడు ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ కాల పరిమితి ముగింపు కూడా తోడయింది. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు అనిశ్చితితో ఇన్వెస్టర్లు ఈక్విటీపెట్టుబడులు విత్‌డ్రాచేయడం కూడా లాభాల జోరుకు కళ్లెం పడింది. మిడ్‌క్యాప్ సూచీ స్మాల్‌క్యాప్‌సూచీల్లో కొనుగోళ్లు కనిపించాయి. పిఎస్‌యు బ్యాంక్‌షేర్లు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ సూచీల్లో కొంతమేర మద్దతిచ్చాయి. ఎస్‌అండ్‌పి బిఎస్‌ఇ సెన్సెక్స్ 13.84 పాయింట్లుపెరిగి 74,360.01 పాయింట్లవద్ద ట్రేడింగ్ నిలిపివేసింది. నిఫ్టీ 50 సూచీ కూడా 10.95 పాయింట్లు పెరిగి 23,416.55 పాయింట్లవద్ద ట్రేడింగ్ ముగించింది. టైటాన్ కంపెనీ 3.48శాతం, ఎటర్నల్ 2.98, ఐసిఐసిఐబ్యాంకు 0.78శాతంచొప్పున పెరిగి సూచీలకు కొంతమద్దతిచ్చాయి. బిఎస్‌ఇలో 2244 షేర్లు పెరిగితే 1940 షేర్లు క్షీణించాయి. మరో 182 షేర్లు స్థిరంగా కొనసాగాయి. ఇక విదేశీ కరెన్సీ మార్కెట్‌లో భారత్‌రూపాయి 95.83వద్ద ముగిసింది. అంతకుముందురోజు 95.76వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు ఆగస్టు 6 తేదీ సెటిల్‌మెంట్ దరలు 0.47 శాతం పెరిగి రూ.1,59,270గా నిలిచింది. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడి చమురుజులై సెటిల్‌మెంట్‌దరలు 1.11 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 96.70 డాలర్లుగా కొనసాగింది. యూరోపియన్ షేర్లు పైపైకి ఎగబాకాయి. ఇజ్రాయెల్ లెబనాన్‌మధ్య కాల్పులవిరమణ ఒప్పందం జరగడమే ఇందుకు కీలకం. ఇక వాల్‌స్ట్రీట్‌లో ఎస్‌అండ్‌పి 500తొమ్మిదిరోజుల లాభాల వెల్లువకు బ్రేకులు పడ్డాయి. డౌజోన్స్ పారిశ్రామిక సగటు 620.72 పాయింట్లవద్ద ముగిసింది. ఎస్‌అండ్‌పి 500 0.74శాతం క్షీణిస్తే నాస్‌డాక్‌కాంపోజిట్ కూడా 0.89శాతంచొప్పున క్షీణించింది. ఇక స్టాక్స్‌పరంగాచూస్తే సెబీ చర్యలకు గురయిన రాజేష్ ఎక్స్‌పోర్ట్స్ ఐదుశాతం దిగువన ముగిసింది. హీరో మోటోకార్ప్ 0.85శాతం, ఐడియా ఫోర్జ్ టెక్నాలజీ ఐదుశాతం, ఫిజిక్స్‌వాలా 15.64శాతం, విభార్ స్టీల్ ట్యూబ్స్ 1.45శాతం పెరిగినట్లు ఎక్స్ఛేంజి నివేదికలు చెపుతున్నాయి. జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ 6.58శాతం, అగర్వాల్ ఇండస్ట్రియల్‌కార్పొరేషన్ 20శాతం చొప్పున పెరిగాయి. హెచ్‌పిసిఎల్‌నుంచి రూ.477.5 కోట్ల కాంట్రాక్టు సాధించడమే ఇందుకు కీలకంగా నిలిచింది

## 3500 కోట్ల టార్గెట్‌గా కుకు టెక్నాలజీస్ ఐపిఒ



**ముంబయి, జూన్ 4:** స్టాక్ మార్కెట్లలో ఐపిఒల దూకుడు పెరిగింది. ప్రముఖ ఆడియో అండ్ వీడియో కంటెంట్ ప్లాట్‌ఫాం కుకు ఎఫ్‌ఎం, కుకు టీవీ పేరెంట్ కంపెనీ కుకు టెక్నాలజీస్. ఐపివోకు వస్తోంది. సెబీకి రహస్యంగా ఐపీఓ పత్రాల్ని సమర్పించింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు రూ. 3500 కోట్ల వరకు నిధుల్ని సమీకరించాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఇక కంపెనీ విలువ రూ.15వేల కోట్లుగా అంచనా వేస్తోంది. ఈ ఐపీఓ కోసం కోటక్ మహీంద్రా, జెఫరీస్, యాక్సిస్ క్యాపిటల్, జేఎం ఫైనాన్షియల్ వంటివి మర్చంట్ బ్యాంకర్లుగా వ్యవహరిస్తున్నాయి. రహస్య మార్గంగా ఐపీఓ అంటే దీనిని కాన్ఫిడెన్షియల్ రూట్ అని పిలుస్తారు. ఇక్కడ కంపెనీ తన ఆర్థిక వివరాల్ని, ఇతర వ్యాపార వివరాల్ని రహస్యంగా ఉంచుతుంది. ఇది సాధారణ ప్రజలకు, పోటీ కంపెనీలకు కనిపించవు. సెబీ మాత్రమే పరిశీలిస్తుంది. ఏమైనా మార్పులు ఉంటే చెబుతుంది. సెబీ ఆమోదించాక మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చే సమయంలో వివరాల్ని సాధారణ ప్రజల కోసం వెబ్‌సైట్లలో ఉంచుతారు. ఈ ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూతో పాటు ఇప్పటికే ఉన్న ఇన్వెస్టర్ల నుంచి కూడా షేర్ల విక్రయం ఆఫర్ ఫర్ సేల్ ఉండనుంది. ఐపీఓ ద్వారా వచ్చే నిధుల్ని ప్రధానంగా ఏఐ, టెక్నాలజీ మౌలిక సదుపాయాలు, కంటెంట్ డెవలప్‌మెంట్, విస్తరణ కోసం వినియోగించనున్నట్లు పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీ ఆదాయం సుమారు రూ.1400కోట్ల వరకు ఉంది. భారత దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీకి కుకు టెక్నాలజీస్ కంపెనీతో మంచి సంబంధం ఉంది.

# మారుతినుంచి తొలి ఇ20 ఫ్లెక్స్‌ఫ్యూయల్ వ్యాగన్‌ఆర్

**న్యూఢిల్లీ, జూన్ 4:** దేశంలో ప్రత్యామ్నాయ, స్వచ్ఛ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా వాహన తయారీ దిగ్గజం మారుతి సుజుకి తొలి ఫ్లెక్స్ ఫ్యూయల్ ప్యాసింజర్ కారు వ్యాగన్‌ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ ప్రోటోటైప్‌ను గురువారం ఆవిష్కరించింది. ఈ కొత్త మోడల్ ఇ-20 (20 శాతం ఇథనాల్) నుంచి ఇ100 (100 శాతం ఇథనాల్)వరకు ఎలాంటి ఇథనాల్‌పెట్రోల్ మిశ్రమంతోనైనా నడిచే సామర్థ్యం కలిగి ఉండటం విశేషం. పెట్రోల్‌పై ఆధారపడటాన్ని తగ్గించి, జీవ ఇంధనాల వాడకాన్ని పెంచాలన్న భారత ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఈ కారును అభివృద్ధి చేసినట్లుమారుతి తెలిపింది. కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ పెట్రోలియం మంత్రి హార్‌దీప్‌సింగ్ పూరి హాజరయ్యారు.

ప్రత్యామ్నాయ ఇంధన వ్యూహంలో భాగంగా డీజిల్‌లో 15 శాతం ఐసోబ్యూటనాల్‌ను కలిపే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని వెల్లడించారు. పాత వాహనాలను యూరో 6 ప్రమాణాలకు అనుగుణంగా ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికల్స్‌గా మార్చేందుకు కృషి చేయాలని మారుతి సుజుకి, హీరో మోటోకార్ప్ వంటి సంస్థలను గడ్కరీ కోరారు. మారుతి సుజుకి ఎండీ, సీఈఓ హిసాషి టేకూచి మాట్లాడుతూ, కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ), హైడ్రోజన్ వంటి ఇతర క్లీన్ టెక్నాలజీలపై కూడా తాము దృష్టి సారించామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో దేశంలో అమ్ముడైన మొత్తం గ్రీన్ వెహికల్స్‌లో దాదాపు సగం మారుతి సుజుకివేనని కంపెనీ మార్కెటింగ్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పార్థో బెనర్జీ తెలిపారు. కేవలం ఓలా, ఉబర్ వంటి ఫ్లీట్ ఆపరేటర్లు, కమర్షియల్ అవసరాల కోసం మాత్రమే అందుబాటులోకి తెచ్చారు.

కొత్త వ్యాగన్‌ఆర్‌లో 1.2లీటర్, 4సిలిండర్ ఓ12వి ఇంజిన్‌ను ఉపయోగించారు. అధిక ఇథనాల్ వాడకానికి అనువుగా ఉండేలా ఇంజిన్‌లో ప్రత్యేక మార్పులు చేశారు. ఇ20 ధరలు రూ.8.50 లక్షలవరకూ ఉంటుందని అంచనా.




# యేడాదికే బోర్డు తిప్పేసిన ఐటి స్టార్టప్ రోడ్డునపడ్డ ఐదువేల మంది ఉద్యోగులు




**పూణె, జూన్ 4:** మహారాష్ట్రలోని పూణె హింజేవాడి ఐటీ హబ్‌లో ఏడాది కిందట స్టార్ట్ అయిన ఒక ఐటీ స్టార్టప్‌ను హటాత్తుగా మూసివేసి కార్యకలాపాల్ని నిలిపివేసింది. దీంతో వందలాది ఐటీ ఇంజినీర్లు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇంటర్న్లు రోడ్డున పడ్డారు. హైశాలరీలు, ల్యాప్‌టాప్స్ ఇస్తామని మంచి కెరీర్ ఉంటుందని స్థిరమైన జీతాలు ఇస్తామని ఇలా ఆకర్షణీయ ఆఫర్లు ప్రకటించి చేరిన యువకుల్ని భారీ మోసం చేసింది. 2025లోనే భారీ స్థాయిలో ఫ్రెషర్లను నియమించుకుంది. ఈ ఏప్రిల్‌లో ఒక్కసారిగా మూతపడింది. రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసింది థింక్‌టెక్ యాజమాన్యం. జనవరి నుంచి జీతాలు కూడా చెల్లించలేదు. ఇచ్చిన చెక్స్ కూడా బౌన్స్ అయ్యాయి.

ఆఫీసుకు వెళ్లిన ఉద్యోగులు తాళం వేసి ఉండటం చూసి షాకయ్యారు. 700 మందికిపైగా ఉద్యోగులు వీరిలో చాలా వరకు ఫ్రెషర్లుఉన్నారు. ప్రారంభంలో ఒక్కొక్కరి నుంచి రూ. 15 వేల వరకు సెక్యూరిటీ డిపాజిట్ పేరుతో వసూలు చేసి ఆ డబ్బును దుర్వినియోగంచేసిందన్న ఫిర్యాదులున్నాయి. కొందరికి ల్యాప్‌టాప్స్ ఇవ్వకపోగా ఇంకా డిపాజిట్ కూడా తిరిగి ఇవ్వలేదని చెబుతున్నారు. బాధితుల పిర్యాదుతో ఐటీ ఉద్యోగుల ఫోరమ్ ఎఫ్‌ఐటిఇ ఆధ్వర్యంలో ఫిర్యాదుచేసారు. హింజేవాడి పోలీసులు సీఈఓ హర్షల్ ఠాక్రే సహా మరో ఇద్దరు ఎగ్జిక్యూటివ్స్‌ను మోసం, నమ్మక ద్రోహం ఆరోపణలతో అరెస్ట్ చేశారు. గత 8 నెలల్లో పుణెలో మూతబడిన ఐదో కంపెనీ అని తెలుస్తోంది. మొత్తం మీద 4 వేల నుంచి 5 వేల మంది వరకు ఉద్యోగులు రోడ్డునపడ్డారు. ఈ ఘటన ఐటీ రంగంలో స్టార్టప్స్ పేరిట జరుగుతున్న మోసాన్ని మరోసారి గుర్తుచేసిందని చెప్పొచ్చు. ఇది ఉద్యోగ భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. చేరే ముందు కంపెనీ బ్యాక్‌గ్రౌండ్ తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని హెచ్చరిస్తోంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# అపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా రక్షణ చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన సదస్సు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి జూన్ 4 (ప్రభాతవార్త)** కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం అపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా కార్మికులకు మహిళా రక్షణ చట్టాలు, పోక్సో చట్టం, శక్తి యాప్, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత అంశాలపై అవగాహన సదస్సును పెద్దాపురం సబ్ డివిజనల్ పోలీస్ అధికారి ఎ .బి .జి . తిలక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు తమ భద్రత కోసం శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, వివిధ రకాల మోసాల గురించి అవగాహన కలిగి ఉండాలని వివరించారు.అదేవిధంగా ఫ్యాక్టరీకి వచ్చేటప్పుడు, వెళ్లేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. పిల్లల విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా తగిన పర్యవేక్షణ కలిగి ఉండాలని పేర్కొన్నారు. హాస్టళ్లలో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల మహిళా కార్మికులు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని, వారి వివరాలు మరియు బంధువుల సమాచారాన్ని యాజమాన్యం సేకరించి భద్రపరచాలని సూచించారు. అలాగే వారు ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చిన సందర్భాల్లో ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.అత్యవసర పరిస్థితుల్లో మహిళలు తమ రక్షణ కోసం 112 అత్యవసర సేవ లేదా శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం ఎస్ఐ మౌనిక, సీఐ వై ఆర్ కె, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.




తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం.
డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
రాజమహేంద్రవరం | శుక్రవారం 05 జూన్ 2026 | I


## పులిమెట్ల కుటుంబ సభ్యుల కుల నిర్ధారణపై అభ్యంతరాల ఆహ్వానం కలెక్టర్ కె.దినేష్ కుమార్



**అడ్డతీగల, జూన్ 04, ప్రభాతవార్త** అడ్డతీగల మండలం గొండోలు గ్రామానికి చెందిన పులిమెట్ల వీరభద్రరావు కుటుంబ సభ్యుల ఎస్టి వాల్మీకి కుల నిర్ధారణకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె.దినేష్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గొండోలు గ్రామానికి చెందిన పులిమెట్ల ఉదయ భాస్కర కుమారి, పులిమెట్ల మధురిమ, పులిమెట్ల మధు సంజయ్, పులిమెట్ల మిన్నీ నలుగురి తండ్రి వీరభద్రం, పులిమెట్ల వీరభద్రం, పులిమెట్ల వెంకట రమణమూర్తి, పులిమెట్ల అప్పలకొండ ముగ్గురి తండ్రి సంజీవరావు, పులిమెట్ల రాజేష్ కుమార్, పులిమెట్ల సరస్వతి, పులిమెట్ల రాజ్కుమార్ ముగ్గురి తండ్రి రాజారావు కులధృవీకరణ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరితో పాటు పులిమెట్ల కార్తీక్, పులిమెట్ల మాధవి, పులిమెట్ల స్వర్ణలత ముగ్గురి తండ్రి చిట్టిబాబు, పులిమెట్ల లిఖిత్ తండ్రి వెంకట రమణమూర్తి, పులిమెట్ల ప్రసాద్, పులిమెట్ల రూపావతి, పులిమెట్ల ప్రవీణ్ కుమార్ ముగ్గురి తండ్రి అప్పారావు, పులిమెట్ల వెంకటేశ్వర్లు తండ్రి భూషణం అనువారు జిల్లా స్థాయి పరిశీలన కమిటీ ద్వారా తమను వాల్మీకి షెడ్యూల్డ్ ట్రైబ్ కులస్తులుగా గుర్తించి, కులధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరినట్లు కలెక్టర్ వివరించారు. వారం రోజుల్లోగా గడువు సదరు దరఖాస్తుదారులకు కులధృవీకరణ ఉత్తర్వులు మంజూరు చేయడంపై ఎవరికైనా ఏవైనా అభ్యంతరములు ఉన్నయెడల, సరియగు ఆధారములతో వారం రోజులలోపు జిల్లా కలెక్టర్ కార్యాలయపు మేజిస్ట్రియల్ సెక్షన్ నందు గానీ, లేదా అడ్డతీగల మండల తహాశీల్దారు కార్యాలయంలో గానీ తెలియపరచాలని పత్రికా ప్రకటన ద్వారా కోరడమైనది.


## హామీలను విస్మరించిన కూటమి.... ఎంఎల్సీ బొమ్మి

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,జూన్4,ప్రభాతవార్త.**



కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినప్పటికీ ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా తుంగలోకి తొక్కి ప్రజలను వెన్నుపోటు పొడిచిందని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లలో సుమారుగా 3 లక్షల 56 వేల కోట్ల రూపాయలు కేంద్రం నుండి అప్పుల నుండి అప్పుచేసి తమ జేబుల్లో నింపుకున్నారే తప్ప, ప్రజలకు చేసిందేమీ లేదని అన్నారు. ప్రతి సంవత్సరం నిరుద్యోగులకు జాబ్ కాలెండర్ ద్వారా 4 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి,ఈ రెండు సంవత్సరాలకు 8 లక్షల ఉద్యోగాలు కల్పించవలసిన ప్రభుత్వం నిరుద్యోగులను తీవ్రం గా వెన్నుపోటు పొడిచిందని తెలియజేశారు.ప్రతి నిరుద్యోగికి ప్రతినెల 3వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి రెండు సంవత్సరాలు గడుస్తున్న కనీసం దాని ఊసే తీయడం లేదని,కూటమి ప్రభుత్వం నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, నిరుద్యోగ భృతి ఇవ్వకుండా వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. ప్రతి నిరుద్యోగికి 24 నెలలకు 72 వేల రూపాయలు కూటమి ప్రభుత్వం బాకీ పడిందని దీనిని వెంటనే చెల్లించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 18 నెలలు నిండిన ప్రతి ఆడ బిడ్డకు నెలకు1500 చొప్పున సంవత్సరానికి రూ18 వేలు ఆడబిడ్డ నిధి కింద ఇస్తామని హామీ ఇచ్చి ఆడబిడ్డలను కూడా వెన్నుపోటు పొడిచిందని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన మహిళలకు 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు 4000 రూపాయలు పింఛన్ చెల్లిస్తామని చెప్పి మహిళలను కూడా తీవ్రంగా వెన్నుపోటు పొడిచిందని తెలియజేశారు. అలాగే అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు సంవత్సరానికి 20,000 రూపాయలు పెట్టుబడి సాయం ఇస్తానని తెలియజేసి రైతులను కూడా వెన్నుపోటు పొడిచిందని, స్త్రీశక్తి పథకంద్వారా సంవత్సరా నికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెప్పి దానిని కూడా సక్రమంగా ఇవ్వకుండా స్త్రీలను వెన్నుపోటు పొడిచిందని, అదేవిధంగా గ్యాస్, పెట్రోల్, డీజిల్,కరెంట్ ధరలు పెంచి వాహన వినియోగదారు లను,వ్యాపారస్తులను వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను, మహిళలను, రైతులను, వ్యాపారస్తులను, వాహన దారులను ప్రతి ఒక్కరిని వెన్నుపోటు పొడిచి తీవ్రంగా నష్టం కలిగించిందని అని, ఈ ప్రభుత్వం మాటల ప్రభుత్వమే అని, చేతల్లో చేసేది శూన్యమని, వెన్నుపోటు పొడిచేది అధికమని, ఇది "వెన్నుపోటు ప్రభుత్వం" అని ఎంఎల్సీ బొమ్మి ధ్వజమెత్తారు.

## పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌తో
# కుటుంబాలకు ఆర్థిక భద్రత
### అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్4,ప్రభాతవార్త.** భారత తపాల శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పి ఎల్ ఐ) పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ పథకం పాలసీదారుల కుటుంబాలకు ఆర్థిక భద్రతను కల్పిస్తోందని అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్. శ్రీకర్ బాబు తెలిపారు. అమలాపురానికి చెందిన దివంగత పి. విద్యాసాగర్ రూ.5 లక్షల విలువైన పి ఎల్ ఐ పాలసీని 11 ఏప్రిల్ 2022న ప్రారంభించి, సంవత్సరానికి రూ.25,310 ప్రీమియం చెల్లిస్తూ కొనసాగించారు. అయితే, కేవలం మూడు సంవత్సరాల తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మృతి చెందారు. ఈ నేపథ్యంలో పాలసీ నామినీ అయిన పి. ప్రసన్న కుమార్‌కు రూ.6,10,018 విలువైన క్లెయిమ్ చెక్కును పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీకర్ బాబు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పి ఎల్ ఐ), రూరల్ పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (ఆర్ పి ఎల్ ఐ) పథకాల ద్వారా తక్కువ ప్రీమియంతో అధిక భద్రత లభిస్తుందని తెలిపారు. అనుకోని పరిస్థితుల్లో కుటుంబాలకు ఆర్థిక అండగా నిలిచే ఈ పథకాల్లో ప్రజలు చేరి తమ కుటుంబ భవిష్యత్తును సురక్షితం చేసుకోవాలని సూచించారు.ఈకార్యక్రమంలో అమలాపురం హెడ్ పోస్టాఫీస్ పోస్ట్‌మాస్టర్ బి.వెంకన్న,సీపీసీ ఇన్‌చార్జ్ ఎం.ఏకాంబరం తదితర తపాలాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# అంతర్వేది నరసింహుని కల్యాణం రాష్ట్ర పండుగగా ఉత్తర్వులు...





**సఖినేటిపల్లి జూన్ 4, ప్రభాత వార్త:** డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం ను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం రాష్ట్ర పండుగగా అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్వేదిలో ప్రతి ఏడాది నిర్వహించే లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. దీనిని కృషి, పట్టుదలతో రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ సాధించినట్లు తెలుస్తున్నది.

# ఎమ్మెల్సీ అనంతబాబు బెయిల్ పిటిషన్ రద్దు.

**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 4( ప్రభాతవార్త)** ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసులో సంబంధించి సాక్షుల విచారణ అనంతరం గురువారం జిల్లా కోర్టులో బెయిల్ పిటిషన్ పై వాదోపవాదములు జరిగాయి. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ముప్పాల సుబ్బారావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ అనంతబాబు కొంతమంది సాక్షులను విచారించారు కాబట్టి తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. ఈ పిటిషన్ పై ఇరువర్గాలు తరఫున ప్రాసిక్యూషన్ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న ఏసీబీ ఇంచార్జ్ కోర్ట్ న్యాయమూర్తి వెంకటేశ్వరరావు బెయిల్ తిరస్కరిస్తూ ఆదేశాలు ఇచ్చారు. జిల్లా జడ్జి స్పెషల్ కోర్టు వెకేషన్ లో ఉన్నారు కాబట్టి ఈ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఈనెల తొమ్మిదో తేదీన కోర్టులో మరల వాదనలు ప్రారంభమైతాయని ఆయన వివరించారు.

## కల్లేరు నుండి మధుగురు వరకు బిటి రోడ్డు నిర్మాణం చేపట్టాలి

### ఆదివాసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం డిమాండ్.



**చింతూరు జూన్ 4 ప్రభాత వార్త.** ఆదివాసి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనకు శ్రీకారం చుడుతున్నారు. చింతూరు మండలంలోని కల్లేరు నుంచి మధు గురు వరకు బీటీ రోడ్డు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు, మధుగూరు గ్రామం లో మంచినీటి వాటర్ ట్యాంక్ ఏర్పాటు చేసి ప్రతి కుటుంబానికి నీరు అందించాలని, అల్లిగూడెం నుండి స్టాపర్ పేట వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సీసం సురేష్ డిమాండ్ చేశారు. గురువారం మధుగురు గ్రామంలో పంచాయతీ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి పల్లపు వెంకట్, జిల్లా కమిటీ సభ్యులు సిసం సురేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తుందని కల్లేరు పంచాయతీ లో కల్లేరు నుండి మదుగురు వరకు రోడ్డు చాలా అస్తవ్యస్తంగా రవాణాకు అ సౌకర్యంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడే విధంగా,మోటార్ సైకిల్ సైతం ప్రమాదాలకు గురై స్థానిక ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చదువుకునే విద్యార్థులు మండల కేంద్రానికి రావాలన్న ఆరోగ్య అవసరాలకు ఆసుపత్రికి రావాలిన్న అత్యవసరానికి కూడా పనికిరాని విధంగా ఈ రోడ్డు ఉన్నదని అన్నారు.రోడ్డు సమస్య పరిష్కరించాలని అనేకసార్లు ఐటీడీఏ అధికారులకు,స్థానిక గ్రామ సచివాలయ అధికారి దృష్టికి విన్నవించిన ప్రభుత్వం నిధులు కేటాయించడం లేదని ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అంతేకాకుండా ఈ రోడ్డుపై ఉన్న వంతెనలు పూర్తిగా శిథిలమై ప్రమాదాలకు నిలయంగా ఉన్నాయని ఈ మధుగూరు రోడ్డుకి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి రోడ్డు నిర్మాణం చేపట్టాలని అన్నారు. అంతే కాకుండా పంచాయతీ పరిధిలోని మధుగురు, సూరన్నగొంది, స్టాపర్ పేట గ్రామాలలో రోడ్లు మరియు విద్యుత్ సమస్యలు త్రాగునీటి సమస్యలు అనేకం ఉన్నాయని గ్రామీణ ప్రాంత సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.మధుగూరు గ్రామంలో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి వాటర్ ట్యాంక్ నిర్మాణం చేపట్టి ప్రతి కుటుంబానికి నీరు అందించాలని పంచాయతీలోని స్టాపర్ పేట గ్రామానికి కూడా కనీసం రహదారి లేక నాలుగు కిలోమీటర్లు ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సమస్య పరిష్కరించడానికి ఉపాధి హామీ నిధుల ద్వారా అల్లిగూడెం నుండి స్టాపర్ పేట వరకురోడ్డు నిర్మాణం చేపట్టాలని అన్నారు పంచాయతీ పరిధిలో అనేక గ్రామాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని తక్షణమే గ్రామాల్లో అధికారులు పర్యటించి సమస్య పరిష్కారానికి కొత్త చేతిపంపులు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా కోరారు ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, నాయకులు పండ్రు సుబ్బారావు, ఓగిల గంగయ్య, సోయం భారతి, సోడి రెడ్డి, సోడే రాఘవయ్య, రాములమ్మ, బుచ్చమ్మ, కారం శేఖర్, సీతయ్య పొడియం జానీ, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు

## జంట వంతెనల నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఆనందరావు



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, జూన్ 4,ప్రభాతవార్త.** అమలాపురం పట్టణ పరిధిలోని పరంజ్యోతి పబ్లిక్ స్కూల్ ఎదురుగా, నల్లా గార్డెన్‌ను కలుపుతూ ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న జంట వంతెనల నిర్మాణ పనులను స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విత్తనాల వారి కాలువ రెండు గట్లను అనుసంధానం చేస్తూ సాగుతున్న ఈ వంతెనల నిర్మాణ ప్రగతిని ఆయన అధికారులతో కలిసి పరిశీలించి,పనుల వివరాలను అడిగి తెలుసు కున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ విత్తనాల వారి కాలువ వాస్తవానికి 108 లింకులు అంటే దాదాపు 93 అడుగుల వెడల్పు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం తీవ్ర ఆక్రమణల కారణంగా 30 అడుగులు కూడా లేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిని మార్చి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే తమ ప్రాధాన్యతని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే నల్లా గార్డెన్ వైపువున్న గట్టును 30 అడుగుల కు విస్తరించి,అక్కడ నుండి సరాసరి కూరసాల వారి వీధి రాఖీ ఎవెన్యూ సెంటర్ వరకు అనుసంధానం చేయాలనే ఆలోచనతో ముందుకు సాగుతున్నామని తెలిపారు.అదేవిధంగా, ప్రస్తుతం పూర్తిగా ఆక్రమితమై ఉన్న కాలువ ఎడమ గట్టును కూడా 30 అడుగుల వెడల్పుతో నూతన రోడ్డుగా తీర్చిదిద్ది,చిందాడగరువు వద్ద నేషనల్ హైవేకు కలప బోతున్నామని వివరించారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే నామంత్రమని పునరుద్ఘాటించిన ఎమ్మెల్యే, పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి,మౌలిక వసతులను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పనులను వేగవంతం చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు నాయకులు పాల్గొన్నారు

## పర్యావరణ హిత ప్రత్యన్మాయల వైపు అడుగులు వేయాలి
### జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 4( ప్రభాతవార్త)** ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణహిత ప్రత్యామ్నాయలవైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి పిలుపునిచ్చారు. గురువారం రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో వరల్డ్ ఎన్విరాన్మెంట్ డే పురస్కరించుకుని పుష్కర ఘాట్ జంక్షన్ వద్ద పర్యావరణ మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్పు అనేది ప్రతి ఒక్కరి నుంచి ప్రారంభం కావాలని చిన్నప్పటి నుంచే పిల్లలకు క్లాత్ బ్యాగులు పర్యావరణహిత వాటర్ బాటిల్స్ వినియోగంపై అవగాహన కల్పించవలసిన అవసరం ఉందన్నారు. తిరుమలలో అమలవుతున్న ప్లాస్టిక్ నిషేధ విధానాలు త్వరలోనే రానున్నాయని పుష్కరాల నాటికి తూర్పుగోదావరి జిల్లాలోనూ, రాజమహేంద్రవరంలో కూడా కఠిన చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి ప్రత్యామ్నాయలను అవలంబించాలని పిలుపునిచ్చారు. కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ మై గోదావరి మై ప్రైడ్ కార్యక్రమంలో భాగంగా ప్రారంభించిన మై గోదావరి మై రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం గోదావరి రేవుల పరిరక్షణలో కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. రానున్న పుష్కరాలు నాటికి ఘాట్లను మరింత శుభ్రంగా ఆరోగ్యంగా తీర్చిదిద్దేందుకు స్వచ్ఛంద సంస్థలు కార్పొరేట్ సంస్థలు విద్యాసంస్థలు భాగస్వామితో కార్యాచరణ చేపడుతున్నట్లు తెలిపారు. నగరాన్ని పరిశుభ్రమైన కాలుష్య రహిత నగరంలో తీర్చేదించడంలో ప్రజలు భాగస్వామ్యం అత్యంత అవసరమని పేర్కొన్నారు. అనంతరం ఈ కార్యక్రమానికి సంబంధించి బ్రోచర్లను ఆవిష్కరించారు. కలిసికట్టుగా నడుద్దాం గోదావరి ని కాపాడుకుందాం అనే నినాదాలతో మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రెటరీ శైలజ వల్లి ఎస్ ఇ రిట ఎం హెచ్ ఓ ఏ వినోద్ నా మేనేజర్ అబ్దుల్ మాలిక్ రెవిన్యూ అధికారి సిహెచ్ శ్రీనివాసరావు వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# పులి బాధితులను ఆదుకుంటాం

**రూ:2,17,000/-లు నష్ట పరిహార చెక్కులు అందించిన ఎమ్మెల్యే**

**పులిని త్వరలోనే పట్టుకునేందుకు ముమ్మర చర్యలు**

**రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి**



**దేవీపట్నం మే 4 ప్రభాతవార్త** :పులి బాధితులను అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామ ని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. దేవీపట్నం మండలం పాత గంగపాలెంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె అటవీశాఖ రేంజర్ కొండలరావు సమక్షంలో , మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు సౌజన్యంలో పులి బాధితులకు నష్టపరిహార చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పులి దాడిలో మృతిచెందిన పశువుల యజమానులకు నష్ట పరిహారం అందించటంతో పాటూ సహాయ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలోనే పులిని ఇక్కడ నుండి పట్టుకునేందుకు ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో పులిదాడిలో మరణించిన14 దూడలకు రూ;1,77,000/- లు చెక్కు అందించారు. అలాగే ఏప్రిల్ చనిపోయిన వాటికి రూ;40, 000/- లు చెక్కులు పంపిణీ చేశారు. వెరసి రూ;2,17,000/- లు నష్ట పరిహారం అందించారు. కార్యక్రమంలో ఆమె వెంట రేంజర్ కొండలరావు, సెక్షన్ అధికారి రామకోటి, మండల పార్టీ అధ్యక్షులు గోళ్ల చంటిబాబు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మరిచెట్ల వెంకటేశ్వర రావు, సొసైటీ అధ్యక్షులు మాగాపు బాబురావు, చావీజ డైరెక్టర్ జొన్నల రాంబాబు, క్లస్టర్ ఇంచార్జి ముచ్చు చిన్ని, మహిళ నాయకురాలు కారం పోశమ్మ, కొత్తపల్లి సత్యనారాయణ, తుర్రం చంద్రరావు, మడకం వెంకన్నదొర, మాజీ మండల పార్టీ అధ్యక్షులు ముండ్రు మధుసూదన్ రావు, మండల ఎస్టి కమిటీ అధ్యక్షులు సోది వెంకన్న దొర , ఉపాధ్యక్షులు మిర్తివాడ వీరబాబు, ఐ టి డి పి ప్రధాన కార్యదర్శి తాళ్లూరు కుటుంబ రెడ్డి, అటవీ శాఖ రేంజర్ కొండలరావు, సెక్షన్ అధికారి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

# వాడపల్లి వాసా- భక్త జన భాందవ...
## వెంకన్న ఆలయానికి అశేష భక్తజనం.
### శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.50,116/- విరాళం...







**ఆత్రేయపురం, జూన్ 04(, ప్రభాత వార్త).** ఏడువారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం అశేష భక్తజనంతో షోబిల్లింది.ఏడు వారాల నోము పూర్తయిన భక్తులు అష్టోత్తర శతనామావళి, నిత్య కళ్యాణం, గోపూజలలో పాల్గొని మొక్కలు తీర్చుకున్నారు.ఉదయం శ్రీవారికి మేలుకొలుపు, శ్రీలక్ష్మి వెంకటేశ్వర ఐశ్వర్య హోమం, అష్టోత్తర శతనామావళి, నిత్యకళ్యాణం,బాల భోగం, నివేదన, తదితర కార్యక్రమాలు అర్చక స్వాములు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీ స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు. రాజానగరం మండలం,కానవరం చెందిన గాయత్రి ఎడ్యుకేషనల్ ఇన్సట్యూషన్స్ వారు, వీరాతి వీర వెంకట సత్యనారాయణమూర్తి, దేవి బంగారం దంపతులు, వారి కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన పథకానికి రూ. 50,116/- వేలు విరాళంగా అందించారు. వీరికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో శ్రీ స్వామివారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందించగా. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధరరావు, సూపరింటెండెంట్ పులపర్తి రాంబాబు లు శ్రీ స్వామివారి చిత్రపటం, తీర్థప్రసాదాలు, అందజేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవస్థానం అధికారులు ఉచిత ప్రసాదం, చలువ పందిళ్లు చల్లని తాగునీరు, మజ్జిగ చలివేంద్రం, అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు

# మంత్రి సుభాష్‌ను విమర్శించే స్థాయి సూర్య ప్రకాష్‌కు లేదు

### ఆధారాలు లేని ఆరోపణలు సిగ్గుచేటు ప్రజా సంక్షేమమే మంత్రి సుభాష్ ధ్యేయం

### -మీడియా సమావేశంలో కూటమి పార్టీ నాయకులు



**రామచంద్రపురం జూన్ 04 (ప్రభాతవార్త):** రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఆయన తండ్రి,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ వ్యవస్థాపకులు వాసంశెట్టి సత్యంపై వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్‌రావు చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని కూటమి పార్టీ నాయకులు మండిపడ్డారు.గురువారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రిక సమావేశంలో కూటమి నాయకులు మాట్లాడారు.రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పాలన, నియోజకవర్గంలో మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు చూసి ఓర్వలేక వైసీపీ నేతలు అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని నాయకులు విమర్శించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్న ప్రభుత్వంపై ప్రజల్లో అపోహలు కల్పించే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు.ప్రజలు స్వచ్ఛందంగా వైసీపీ పాలనను తిరస్కరించి కూటమికి అధికారం అప్పగించారని,దానిని "వెన్నుపోటు దినం"గా అభివర్ణించడం ప్రజా తీర్పును అవమానించడమేనని ముందుగా వైసీపీ తమ పాలనలో జరిగిన "గొడ్డలిపోటు రాజకీయాల" గురించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పదిమందికి సహాయం చేయడం మంత్రి సుభాష్ కుటుంబానికి నిత్యకృత్యమని,సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు.సమాజానికి సేవ చేయని వారు విమర్శలు చేయడం హాస్యాస్పదమని నాయకులు అన్నారు.ప్రజల తీర్పును గౌరవిస్తూ నిర్మాణాత్మక రాజకీయాలు చేయాలని, ఆధారాలు లేని ఆరోపణలు, వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని వైసీపీ నాయకులకు హితవు పలికారు.ప్రజా సేవలో ముందున్న నాయకులను విమర్శించే ముందు తమ గత పాలనపై ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.ఈ మీడియా సమావేశంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవల్లి శివ,పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి కృష్ణ, జనసేన నాయకులు సత్యవాడ శ్రీహరి పంతులు,కె శ్రీనివాస్,పార్టీ సీనియర్ నాయకులు గరికపాటి సూర్యనారాయణ,బీజేపీ నాయకులు కొట్టువాడ హరిబాబు,క్లస్టర్ ఇన్‌చార్జ్ కంచుమర్తి బాబురావు,బీసీ సెల్ నాయకులు దంగేటి గౌరీశంకర్,లంక శ్రీను,కుడుపూడి ఫణితేజ ,కొమరిన వీర్రాజు,దిగుమర్తి వీరబాబు, వజ్రపు రాజేశ్వరి, దోమ్మలపాటి విజయలక్ష్మి,కార్యకర్తలు పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న భారతీయ విదేశీ నాణాల ప్రదర్శన



**పెద్దాపురం జూన్ 4(ప్రభాత వార్త )**పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో యాసలపు సూర్యారావు భవనం లో జరుగుతున్న సమ్మర్ క్యాంపు లో భారతీయ విదేశి నాణాల ప్రదర్శన ఆకట్టుకుంది. వంగలపూడి శివకృష్ణ, భరణికనా హరిబాబు సేకరణలో, తాళ్లూరి కామేశ్వరరావు పరవేక్షణలో ఈ ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా కామేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులు సేకరణ ఒక హాబీగా పెట్టుకోవాలని అన్నారు. డబ్బు రూపం నిరంతరం మారుతుందని, దాని విలువ ఆ కాలాన్ని బట్టి ఉంటుందని అన్నారు. పురాతన కాలం నుండి రాజుల కాలం, బ్రిటిష్ ఇండియా, విదేశీ నాణాలు, అమెరికా డాలర్స్ ప్రదర్శించారు. కార్యక్రమం లో పీసీసీ గౌరవ అధ్యక్షులు బుద్ధా శ్రీనివాస్, కార్యదర్శి రొంగల అరుణ్, వానపల్లి సాయి, వీరమళ్ళ బంగారం, ఉట్టా అంజలి, వడ్డి సత్యనారాయణ, రాజేష్ కుమార్ దేవత, ఉట్టా అంజలి, లలితా, లావణ్య, మెర్సీ, నవ్య, హర్ష, సందీప్, యోగేష్, సహస్ర, సత్య, నెక్కల జిస్విత తదితరులు పాల్గొన్నారు.

## టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పళ్ళ శ్రీనివాసరావు ను కలిసిన కోనసీమ నాయకులు



**ముమ్మడివరం జూన్ 4 ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్ల శ్రీనివాసరావును కలిసి పూలకుచ్చాలతో సత్కరిస్తున్న మంత్రి సుభాష్, జిల్లా అధ్యక్షులు గుత్తుల సాయి,ఉపాధ్యక్షులు తాడి నరసింహారావు.బీసీ ఉప కులాలకు నామినేటెడ్ పదవులు కేటాయించాలి అని కోరారు.ముమ్మిడివరం బీసీ సామాజిక వర్గంలో ఉన్న ఉప కులాలకు నామినేటెడ్ పదవులు కేటాయించి ఆయా కులాలను సంతృప్తి చేయాలని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, మంత్రి వాసంశెట్టి సుభాష్,జిల్లా ఉపాధ్యక్షులు తాడి నరసింహారావులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పళ్ళ శ్రీనివాసరావుకు విజ్ఞప్తి చేశారు.అమరావతిలోని కుంచనపల్లి లో ని శ్రీనివాసరావు స్వగృహంలో బుధవారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిసి కలిశారు. జిల్లాలోని పార్టీ పరిస్థితులను,పార్టీ క్యాడర్ పని తీరును రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావుకు వివరించారు.పార్టీకి పనిచేసిన కేడర్ కు నామినేటెడ్ పదవులు కేటాయించి వారిని సంతృప్తిపరిస్తే మరింత ఉత్సాహంతో వారు పార్టీ అభివృద్ధికి పని చేస్తారని విషయాలను రాష్ట్ర అధ్యక్షులకు వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు పూల మాలలు, దుశ్శాలువ సత్కరించారు. వారి వెంట కడలిపెద్ద తదితరులు ఉన్నారు..

## కార్మిక చట్టాలపై అవగాహనా పెంచుకోండి

### -పెద్దాపురం డిఎస్పి తిలక్



**పెద్దాపురం, జూన్ 4(ప్రభాత వార్త )** కార్మిక చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్పించుకుని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని పెద్దాపురం డి ఎస్పీ ఏబిజి తిలక్ అన్నారు. కాకినాడ జిల్లా ఎస్పీ శ్రీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు పెద్దాపురం అపెక్స్ ఫ్యాక్టరీలో గురువారం మహిళా కార్మికులకు మహిళా రక్షణ చట్టాలు మరియు ఫోక్సో యాక్ట్ ,శక్తి యాప్, సైబర్ నేరాల గురించి అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం డిఎస్పీ తిలక్ మాట్లాడుతూ ఎపెక్స్ ఫ్యాక్టరీలో మహిళా కార్మికులకు మహిళా రక్షణ చట్టాలు, శక్తి యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి అన్నారు. సైబర్ నేరాలు, మోసాల గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ రకాల మోసాల గురించి తెలియజేస్తూ ఫ్యాక్టరీ నుండి వెళ్లేటప్పుడు వచ్చేటప్పుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని సూచించారు. అలాగే పిల్లల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా వారిపై తగిన పర్యవేక్షణ ఉండాలని సూచించారు. అలాగే హాస్టల్లో ఉంటున్న ఇతర రాష్ట్రాల మహిళా కార్మికులు గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని, వాళ్ళ యొక్క, వారి బంధువుల యొక్క సమాచారాన్ని యాజమాన్యం వారు సేకరించుకోవాలన్నారు. అలాగే వారు ఇతర రాష్ట్రాలకు వెళ్లి వచ్చేటప్పుడు వాళ్ళ ప్రయాణంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. రక్షణ కోసం 112 కాల్ లేదా శక్తి యాప్ ను ఉపయోగించుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం సి ఐ వై ఆర్ కే శ్రీనివాస్, ఎస్ఐ మౌనిక మరియు సిబ్బంది పాల్గొన్నారు

## జె. ఈ. ఈ మెయిన్స్ ఉత్తీర్ణులను సత్కరించి ప్రశంసించిన ఎమ్మెల్యే



**రాజవొమ్మంగి, జూన్ 04, ప్రభాతవార్త** గిరిజన విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం తన వంతుగా ఆదుకునేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. గురువారం రాజవొమ్మంగి మండలం వట్టిగెడ్డ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జే ఈ ఈ మెయిన్స్ పరీక్షలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదివి రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించడం శుభ పరిణామని అన్నారు. దీనిలో భాగంగా గంగవరం మండలం నుండి కుంజం శ్రీలత, రాజవొమ్మంగి మండలం నుండి మొయ్యా జాన్ దినకరన్ లకు పూలమాలలు వేసి స్వీట్స్ ను అందించి, శాలువాలను కప్పి ఎమ్మెల్యే సన్మానం చేశారు. వారి తల్లిదండ్రులైన కుంజం చిన్నాలుదొర, రాజమ్మ, మొయ్యా స్టీవెన్ రాజు, యేసుమణి దంపతులను అభినందించారు. వారి ఉజ్వల భవిష్యత్తు రీత్యా ఉన్నత చదువులకు తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు విద్యార్థులు, తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

## వైసిపి శ్రేణులు నిరసన.



**పెద్దాపురం, జూన్ 4 (ప్రభాత వార్త )**స్థానిక దర్గా సెంటర్లో గురువారం వైసీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. నాలుగోళ్ల జంక్షన్ రోడ్డుపై కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నా చేపట్టారు. ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో నెరవేర్చాలని డిమాండ్ చేశారు. పెద్దాపురం నియోజవర్గ ఇన్చార్జి దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వైసిపి నాయకులు కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన మేనిఫెస్టో పత్రాలను తగలబెట్టారు. రెండేళ్ల అభివృద్ధిని జరగలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఆవాల లక్ష్మీనారాయణ, నెక్కంటి సాయి ప్రసాద్, గోపు మురళి, మిరియాల రాజా, నాగబోయిన రాజుబాబు, కనపర్తి చీమదొర, సుందరెడ్డి రాజు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ తో పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం...ఎమ్మెల్యే బండారు .



**ఆత్రేయపురం, జూన్ 04,(ప్రభాత వార్త)**నేడు పేద ప్రజలకు ఎవరు ఏ విధమైన వైద్యం చేయించుకున్నా, వారికి కష్టాల్లో చేదోడు వాదోడుగా ఉండాలని కనీస సహాయం అందించాలనే దృక్పథంతో ఆర్థిక సహకారాన్ని చెక్కుల రూపంలో అందరికీ అందిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు.రావులపాలెం క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుందని పేర్కొన్నారు.సీఎం రిలీఫ్ ఫండ్ క్రమం తప్పకుండా అందిస్తూ గొప్ప మానవతావాదిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నిలుస్తున్నారని ఆయన తెలిపారు . వైసీపీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి సహాయనిధి అనేది మృగ్యంగా ఉండేదని, ఎవ్వరికీ దొరికేది కాదన్నారు. ఆత్రేయపురం మండలానికి చెందిన 19 మందికి రూ.7,96,028ల విలువైన చెక్కులను, పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆకుల రామకృష్ణ, పల్లి భీమరావు, కంఠంశెట్టి శ్రీనివాస్, కరుటూరి నరసింహారావు, మండల టిడిపి అధ్యక్షులు కూసంపూడి రామకృష్ణంరాజు, పాలూరి సత్యానందం, చిలువురి సతీష్ రాజు, ఈదాల సత్తిబాబు, గనిశెట్టి వీరేష్, కొప్పిశెట్టి ప్రసాద్, వెలిచేరు పి ఎస్ సి ఎస్ చైర్మన్ నాగిరెడ్డి సత్యనారాయణ, గ్రామ టిడిపి అధ్యక్షులు కవాల సత్తిబాబు, సీనియర్ నాయకులు గంట శివరామకృష్ణ, మిద్దె గోపాలకృష్ణ, కొప్పుల సత్యనారాయణ, కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిత్యం విద్యుత్ అంతరాయాలతో...ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

### - సమస్య పరిష్కరించకపోతే విద్యుత్ కార్యాలయం ఎదుట ఆందోళన - సిపిఎం మండల కమిటీ



**కూనవరం, జూన్ 4, ప్రభాతవార్త :** కూనవరం మండలంలో గత కొన్ని రోజులుగా నిత్యం విద్యుత్ అంతరాయాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నపాటి గాలి దుమారం వచ్చినా, విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో మండలంలోని గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రులు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో చంటి పిల్లలు, వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవారు తీవ్ర ఉక్కపోత కారణంగా నిద్రలేమి రాత్రులు గడుపుతున్నారు. విద్యుత్ సరఫరాలో ఏర్పడ్డ అంతరాయాన్ని సకాలంలో గుర్తించి మరమ్మత్తులు చేపట్టడంతో విద్యుత్ శాఖాధికారులు పూర్తిగా విఫలమవుతున్నారని ప్రజలు సర్వత్ర విమర్శిస్తున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినా సంబంధిత శాఖ వారు ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారని, ఫోన్ చేసిన స్పందించరని, వినియోగదారులు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. మండలంలో విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ప్రజలను సమీకరించి విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళనా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని సిపిఎం మండల కమిటీ సమావేశంలో హెచ్చరించింది. ఈ సమావేశం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, మండల సిపిఎం నాయకులు మడకం నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ, ఆవుల మురళి, తాళ్లూరి శ్రీనివాసరావు, కర్నాటి శ్రీనివాసరావు, తెల్లం తమ్మయ్య, పొడియం రామారావు, తదితరులు పాల్గొన్నారు.

## రెండేళ్ల కూటమి పాలన సూపర్ సిక్స్ అట్టర్ ప్లాప్.

### -ఆత్రేయపురంలో నిరసన సెగ..కూటమి మేనిఫెస్టో లు దగ్ధం...



**ఆత్రేయపురం, జూన్ 04,(ప్రభాత వార్త)** కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను వదిలేసి సూపర్ సిక్స్ సూపర్ హిట్ అని చెప్పుకోవడం సిగ్గు చేటని రెండేళ్ల కూటమి పాలన అట్టర్ ప్లాప్ అయిందని, ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్ ధ్వజమెత్తారు .ఆత్రేయపురం ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లో గురువారం వైఎస్ఆర్సిపి నాయకులు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్సిపి అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల వైసిపి అధ్యక్షులు కనుమూరి శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ప్రజలను మోసం చేసి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. మహిళలను ఖాతాలలో నెలకు 1500 డబ్బులు వేస్తామని మోసగించారని అన్నారు. ఈ ప్రభుత్వం రెండేళ్లలో అన్ని వర్గాల ప్రజలను మోసగించి అన్ని రంగాలలో విఫలమైనట్లు వైఎస్ఆర్సిపి నాయకులు ఆరోపించారు. అనంతరం వైఎస్ఆర్సిపి కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి నిరసన నినాదాలు చేశారు. టిడిపి, కూటమి మేనిఫెస్టో లను పత్రాలను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. రెండేళ్ల కూటమిపాలన అట్టర్ ప్లాప్ అని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమాలలో జడ్పిటిసి సభ్యులు బోనం సాయిబాబు, మాజీ జెడ్పిటిసి సభ్యులు చిలువూరి రామకృష్ణంరాజు, వైయస్ఆర్సీపీ నాయకులు పత్సమట్ల రాజగోపాల రాజు, గొట్టుముక్కల గోపి రాజు, పాలా నాగేశ్వరరావు, తూము రాంబాబు, బీహెచ్. సుధీర్ వర్మ, ఎం సునీల్ వర్మ, వేముల శ్రీనివాస్, కేతా ఏడుకొండలు, వేగేశ్న గోపి , దావీదు, బసవయ్య, గారపాటి సూరిబాబు, మారిశెట్టి సత్యనారాయణ, దాట్ల సూర్యనారాయణ రాజు, పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల పరిసరాలు,వంట పాత్రలు, పరిశుభ్రంగా ఉంచాలి...జిల్లా ఎం.డి.ఎం, ఏ.డి. సురేష్ .



**ఆత్రేయపురం, జూన్ 04,(ప్రభాత వార్త)** ప్రతీ ఒక్కరు పాఠశాల పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పాటించాలని జిల్లా ఎం.డి.ఎం, ఏ.డి. సురేష్ పేర్కొన్నారు.మండలంలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో నిర్వహించబడుతున్న ' డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' వంట నిర్వాహకులకు గురువారం ఒకరోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్ని జిల్లా ఎం.డి.ఎం, ఏ.డి. సురేష్ పాఠశాల పరిసరాలు, పాత్రలు పరిశీలించి ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను కోరారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఉచ్చిలిలో మండల విద్యాశాఖాధికారులు పి.వి. ప్రసాదరావు, ఏ.సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్ని ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిసరాల, విద్యార్థులకు వండించే వంట పాత్రలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.అలాగే పాఠశాలలో అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు అగ్నిమాపక శాఖ సిబ్బంది మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వివరించారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులు తయారుచేసిన వంటలను రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వి.ప్రకాష్, ఉపాధ్యాయుని పద్మశ్రీ, సి.ఆర్.పి.జాన్ బాబు, మండలంలో అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


## పీసా కమిటీ లకు నిర్వహణకు ఆర్థిక తోడ్పాటు స్వయం ప్రతిపత్తిని కల్పించాలి



**రాజవొమ్మంగి, జూన్ 04, ప్రభాతవార్త** గురువారం విజయవాడ పీసా కమిటీలు పనితీరు.. అధికారులు సహకారంపై జాతీయ ఎస్టీ కమీషన్ చైర్మన్ ముఖ్య అతిథిగా రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా కేంద్ర ఎస్టీ కమీషన్ చైర్ పర్సన్ అంతర్ సింగ్ హాజరయ్యారని కింద్ర పీసా కమిటీ గంపా నాగరాజు తెలిపారు. పాడేరు, రంపచోడవరం డివిజన్ ల నుండి హాజరైన పీసా కమిటీ అధ్యక్షులు జాతీయ ఎస్టీ కమీషన్ చైర్మన్ కు వినతిపత్రం ను ఇచ్చారు. పీసాకు ప్రత్యేక బడ్జెట్ మద్దతు, సంస్థాగత జవాబుదారీతనం ద్వారా గ్రామ సభలను బలోపేతం చేయడానికి పలు అంశాలను ప్రస్థావిస్తూ వినతిపత్రంను ఇచ్చారు.. గ్రామసభలకు స్వయం పరిపాలన యొక్క ప్రాథమిక విభాగాలుగా పనిచేసే అధికారాన్ని కల్పించినప్పటికీ, పరిపాలన, ఆర్థిక మద్దతు లేకపోవడం వల్ల వాటి సామర్థ్యం గణనీయంగా దెబ్బతింటోందన్నారు. గ్రామ సభలు ప్రస్తుతం ఎటువంటి స్వతంత్ర ఆర్థిక కేటాయింపు లేకుండా పనిచేస్తున్నాయి. ప్రతి పీసా గ్రామసభకు ఒక ప్రత్యేకమైన, షరతులు లేని బడ్జెట్ను కేటాయించాలన్నారు. గ్రామ సభలు సమర్పించిన అన్ని తీర్మానాలు, వినతులు, ఫిర్యాదులను ఒక నిర్దిష్ట కాలపరిమితిలోగా స్వీకరించి, పరిశీలించి, వాటికి అధికారికంగా లిఖితపూర్వక సమాధానాలు అందించాలని క్షేత్రస్థాయి ప్రభుత్వ అధికారులందరికీ మీ కార్యాలయం స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో అల్లూరి, పోలవరం జిల్లాలు నుండి పీసా కమిటీలు తెల్లం చెల్లన్నదొర, చిట్టిబాబు ,సింహాచలం, నాగరాజు, రెడ్డి పాల్గొన్నారు.

## ప్రభుత్వ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ...

**సఖినేటిపల్లి జూన్ 4, ప్రభాత వార్త:** అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండల




ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఒకరోజు శిక్షణను నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమాన్ని మండల విద్యాశాఖ అధికారులు డి. కిషోర్ కుమార్, ఎం. వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా సమగ్ర శిక్ష అధికారి బొరుసు సుబ్రహ్మణ్యం పథకం నిర్వహణ, నాణ్యమైన ఆహార తయారీ, పరిశుభ్రత తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. మండల పరిషత్ అధ్యక్షుడు వీరా మల్లిబాబు వంట కార్మికులకు తగిన సూచనలు అందజేశారు. గ్యాస్ పొయ్యిలపై వంట చేసే సమయంలో అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు రమణ, విజయ్ ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా నిర్వాహకులకు అవగాహన కల్పించారు. ఫుడ్ ఫెస్టివల్లో మండలంలోని పాఠశాలల వంట కార్మికులు తయారు చేసిన వివిధ వంటకాలను పరిశీలించి, రుచి చూసి, న్యాయ నిర్ణేతలు మూల్యాంకనం చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజ్కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ కావ్య, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పోటో వీడియో గ్రాపర్ల క్రికెట్ టోర్నమెంట్....



**సఖినేటిపల్లి జూన్ 4, ప్రభాత వార్త:**ది ప్రోపెసనల్ ఫోటో మరియు వీడియో గ్రాఫర్ అసోసేషన్ అద్వర్యం లో క్రికెట్ టోర్నమెంట్ ను చొప్పల ఆనంద్ అడోనై క్రియేషన్, దొండపాటి జీవన్, జీవన్ డిజిటల్ అర్థిక సహాయంతో టోర్నమెంట్ నిర్వహించేసామని తెలిపారు. సఖినేటిపల్లి మండల ఫోటోగ్రాఫర్లు నాలుగు టీమ్లుగా విభజించి క్రికెట్ ఆడగా, సఖినేటిపల్లి సన్రైసెస్ విజేతగా, అంతర్వేది రాయల్స్ రన్నర్ గా నిలిచింది. లూదరన్ చర్చి గురుమండల అద్యకులు రెవ. బి. పీటర్సన్, ఫోటోగ్రాఫర్ ప్రెసిడెంట్ నల్లి శ్రీనివాస్, సెక్రటరి బుంగ రత్నకుమార్, ట్రెజరార్ నల్లి శేకర్, వంశీ, కిషోర్, స్టాలిన్, మీనన్, చిన్ని, పి షేకర్, కె శ్రీనివాస్, భాను రాజా, రవితేజ సంఘం సభ్యుల సమక్షంలో మొదటి బహుమతికి ట్రోపి తో 10 వేలు, రన్నరగా 5 వేలు నగదును అందజేసినారు. ఈ మొత్తం ను సంఘం అభివృద్ధి నిమితం తిరిగి ఇరువురు కెప్టెన్ లు నిర్ణయించు కున్నారు, అధ్యక్షుడు నల్లి శ్రీనివాస్ కు బహుమానం ను అందజేసినారు.

## పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

### -ఎంఈఓ పి. శ్రీనివాసరావు



**అడ్డతీగల, జూన్ 04, ప్రభాతవార్త** మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు 'సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర' కిట్లను మండల స్టాక్ పాయింట్ నుండి విజయవంతంగా పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి 2 పి. శ్రీనివాసరావు తెలియజేశారు.ఈ కిట్లలో భాగంగా ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల కోసం కింది వస్తువులను పాఠశాలలకు చేరవేశారు: సెమిస్టర్-1 పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలుడిక్షనరీలు పాఠశాలలు పునఃప్రారంభమయ్యే మొదటి రోజే విద్యార్థులందరికీ ఈ పుస్తకాలను అందజేయాలని, అంతవరకు వీటిని పాఠశాలల్లో చాలా భద్రంగా దాచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కిట్లకు సంబంధించిన మిగిలిన వస్తువులు అందిన వెంటనే వాటిని కూడా త్వరలోనే పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఈశ్వరరావు, వీరబాబు, సూర్యనారాయణ, వాసు, రవి, వెంకట్ మరియు ఎంఆర్సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో ఘనంగా ప్రారంభమైన ఉపాధ్యాయుల 'ఎఫ్ఎల్ఎన్' శిక్షణా తరగతులు



**అడ్డతీగల, జూన్ 4, ప్రభాతవార్త** 2026-27 విద్యా సంవత్సరాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎఫ్ఎల్ఎన్ ఫౌండేషనల్ లిట్రసీ అండ్ న్యూమరసీ ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యా జ్ఞానం ఉపాధ్యాయ శిక్షణా తరగతులు స్థానిక జెడ్పీహెచ్ఎస్ అడ్డతీగల పాఠశాల లో వేదికగా ఘనంగా ప్రారంభమయ్యాయి.మండల కేంద్రమైన అడ్డతీగలను క్లస్టర్ సెంటర్గా ఎంపిక చేసి, దీని పరిధిలోకి వచ్చే నాలుగు మండలాల ఉపాధ్యాయులకు ఈ ఉమ్మడి శిక్షణను ఏర్పాటు చేశారు. రాజవొమ్మంగి, వై. రామవరం, గంగవరం, అడ్డతీగల మండలాలకు చెందిన మొత్తం 233 మంది ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరవుతున్నారు.ఈ నెల 4వ తేదీ నుండి 9వ తేదీ వరకు మొత్తం 6 రోజుల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఉపాధ్యాయులకు సులభతర బోధనా పద్ధతులపై అవగాహన కల్పించడానికి 11 మంది ప్రత్యేక రిసోర్స్ పర్సన్స్ (ఆర్పీలు) రంగంలోకి దిగారు. వీరి పర్యవేక్షణలో శిక్షణా తరగతులు అత్యంత విజయవంతంగా సాగుతున్నాయి.ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ-1 కె. రమేష్, అడ్డతీగల జడ్పీ హెచ్ ఎస్ ప్రధానోపాధ్యాయురాలు బి. వెంకటలక్ష్మి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు ప్రాథమిక తరగతుల విద్యార్థుల్లో చదవడం, రాయడం మరియు ప్రాథమిక గణిత నైపుణ్యాలను ఎఫ్ఎల్ఎన్ పెంపొందించడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని, రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందించడమే దీని ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

**సీతానగరం, జూన్ 04, (ప్రభాతవార్త):** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.భారతి తెలిపారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించనున్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే అధికారులు తప్పనిసరిగా తమ శాఖల పూర్తి నివేదికలతో రావాలని ఎంపీడీవో సూచించారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ చైర్మన్లు హాజరుకావాలని ఎంపీడీవో కోరారు.


## అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వైసిపి.



**రాజమహేంద్రవరం సిటీ, జూన్ 4( ప్రభాతవార్త)** అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించడం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన అజెండాగా మారిందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ విమర్శించారు. గురువారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. నగర ప్రతిష్టను దెబ్బతీయడం ప్రతి సంఘటనను రాజకీయ లబ్ది కోసం వాడుకోవడం అలవాటుగా మారిందన్నారు. తనపై తన కుటుంబం పై వైసీపీ నాయకులు వ్యక్తిగత విమర్శలు చేసినప్పటికీ తాను ఎప్పుడూ హద్దులు దాటలేదని అన్నారు. సామాజిక వర్గాల పేరుతో రాజకీయం చేయవద్దని భరత్ తీరుపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి సంక్షేమం ప్రజా సమస్యలపై చర్చకు ఎప్పుడు సిద్ధంగా ఉన్నానని వైసీపీ మాత్రం వ్యక్తిగత దూషణలతో అసత్య ప్రచారాలతో రాజకీయాలు చేస్తుందని విమర్శించారు. ప్రతి ఘటనలను కూటమి ప్రభుత్వంపై నెట్టేయడమే వైసిపి ప్రధాన లక్ష్యంగా మారిందన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని సోషల్ మీడియాలో వ్యూస్ లైక్స్ వస్తే వాటిని ఓట్లుగా భావించడం రాజకీయ అవివేకమని ఎద్దేవా చేశారు. 47 వ డివిజన్ లో మహిళలపై జరిగిన దాడి ఘటనలను వైసిపి నాయకులు రాజమహేంద్రవరంలో శాంతి భద్రతలు లేవంటూ పోస్టులు పెట్టారని అయితే వాస్తవాలు పరిశీలిస్తే మహిళలపై దాడి చేసిన వ్యక్తి వైసీపీకి చెందిన కార్యకర్తని అదే కార్యకర్త ఎక్కడ మాజీ ప్రజా ప్రతినిధి గతంలో చేసిన ర్యాలీలో అతను వెనుక ఉన్నాడని ఎమ్మెల్యే సదరు ఫోటోలను చూపించారు. గతంలో ఆ వ్యక్తిపై అనేక కేసులు ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వం అతనిపై రౌడీ షీట్ కూడా ఓపెన్ చేయలేదని అన్నారు. ప్రస్తుతం అతనిపై స్థానిక మహిళల ఫిర్యాదు మేరకు రౌడీ షీట్ ఓపెన్ చేశారని కఠిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం ఏమీ చేయలేదని కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక పేపర్ మిల్ కార్మికులకు న్యాయం చేసిందని వారికి అండగా ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు కూటమి నాయకులు రెడ్డి మునేశ్వర రావు పిక్కి నాగేంద్ర కడియాల వీరభద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వం

### -మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా




**సీతానగరం, జూన్ 04, (ప్రభాతవార్త) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నేటికీ అమలు చేయలేదని మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పేర్కొన్నారు. గురువారం సీతానగరం బస్టాండ్ సెంటర్ లో నిర్వహించిన 'వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమంలో భాగంగా..కూటమి మేనిఫెస్టో ప్రతులను వైకాపా శ్రేణులు దగ్ధం చేశారు. అనంతరం నాయకులు, కార్యకర్తలు మానవహారంగా ఏర్పడి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ.. 'సూపర్ సిక్స్' పేరుతో ఎన్నికల సమయంలో మోసపూరితమైన హామీలు ఇచ్చి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. ఈ నెల 12వ తేదీన రాజానగరంలో రిలే నిరాహార దీక్ష చేపడతానని ప్రకటించారు. అనంతరం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే బహిరంగ సభలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, హామీల అమలులో వైఫల్యం గురించి ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, చల్లమళ్ళ సుజీరాజు, గంట శ్రీనివాస్, కరుటూరి హరిబాబు, వైస్ ఎంపీపీ సత్యం మదన్ మోహన్ బాబు, పెద్దపాటి రమేష్ బాబు, కొండ్రపు ముత్యాలు, పెందుర్తి దేవదాసు, పిచ్చుకుల విజయ్, సత్యం శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు ఏమయ్యాయి?.. రెండేళ్ల పాలనపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీసిన చెల్లుబోయిన వేణు



**కడియం, జూన్ 4 ( ప్రభాతవార్త)** ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని తూర్పుగోదావరి జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ (వేణు) విమర్శించారు.మండల కేంద్రం కడియంలోని దేవీచౌక్ సెంటర్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో "హామీలకు రెండేళ్లు -- అమలు ఎక్కడ?" అనే నినాదంతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడియం మండల పార్టీ అధ్యక్షుడు యాదవుల సతీష్ చంద్ర స్టాలిన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి నియోజకవర్గ కోఆర్డినేటర్,జిల్లా పార్టీ అధ్యక్షులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్లమెంట్ ఇన్చార్జి గూడూరు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయినా ప్రజలకు చెప్పుకోదగ్గ ప్రయోజనం ఏదీ అందలేదని ఆరోపించారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వాటి అమలును పూర్తిగా విస్మరించిందని, ప్రజల ఆశలను నెరవేర్చడంలో విఫలమైందని అన్నారు.పేదల సంక్షేమం, ఉపాధి కల్పన, అభివృద్ధి కార్యక్రమాల పేరుతో ప్రచారం జరుగుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించడం లేదని విమర్శించారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేస్తూ ప్రభుత్వం భారీ మొత్తాల్లో రుణాలు తెస్తోందని, అయితే వాటి ఫలితాలు ప్రజలకు అందడం లేదని పేర్కొన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రజలు మరిచిపోయేలా చేసే ప్రయత్నం జరుగుతోందని, కానీ ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, సంక్షేమ పథకాల అమలులో జాప్యం వంటి సమస్యలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు.ప్రజల విశ్వాసంతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఇప్పుడు వారి ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన పరిస్థితి వచ్చిందని, అయితే సమస్యల పరిష్కారంపై దృష్టి సారించకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తూ ప్రజల చెవిలో పువ్వులు పెడుతున్నారని విమర్శించారు.ఈ కార్యక్రమంలో మాజీ పార్లమెంట్ సభ్యుడు గిరిజాల స్వామినాయుడు, రాష్ట్ర కార్యదర్శి గిరిజాల బాబు, తిరుమలశెట్టి శ్రీను, వెలుగుబంటి అచ్యుతరామయ్య, తాడాల చక్రవర్తి, కొత్తపల్లి శివాజీ, సంగీత వెంకటేశ్వరరావు, ఊటుకూరి శైలజ, చింతపర్తి రాంబాబు, టేకి శ్రీను, లావేటి రమేష్, చిలుకూరు రామకృష్ణ, నాగిరెడ్డి మోహన్, ఆకుల సుధాకర్, బత్తిన శ్రీధర్, గుబ్బల రామ్మూర్తి, బుడ్డికి పండు, గంగారావు తదితరులు పాల్గొన్నారు.

## పాతిక లక్షల బంగారం అప్పగించి నిజాయితీ చాటిన లక్ష్మణ్‌కు ఘన సత్కారం

### -మంచి మనసులను ప్రోత్సహిస్తేనే సమాజంలో మానవత్వం - పెరుగుతుంది: గిరజాల బాబు



**కడియం ,జూన్ 4 (ప్రభాతవార్త)** సమాజంలో మంచి విలువలు, మానవత్వం పెంపొందేందుకు ఆదర్శప్రాయమైన వ్యక్తులను ప్రోత్సహించడం అవసరమని బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు అన్నారు. ఇటీవల ఆటోలో ప్రయాణిస్తూ ఓ కుటుంబం పోగొట్టుకున్న సుమారు పాతిక లక్షల రూపాయల విలువైన బంగారాన్ని నిజాయితీగా పోలీసుల ద్వారా బాధితులకు అందజేసిన ఏడిద గ్రామానికి చెందిన నామాల లక్ష్మణ్‌ను గురువారం ఆయన నివాసంలో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా గిరజాల బాబు మాట్లాడుతూ, నిరుపేద కూలీగా జీవనం సాగిస్తున్న లక్ష్మణ్ తనకు దొరికిన విలువైన బంగారాన్ని స్వార్థం లేకుండా యజమానులకు చేరవేయడం గొప్ప మానవత్వానికి నిదర్శనమని కొనియాడారు. నేటి యువతకు లక్ష్మణ్ ఆదర్శంగా నిలుస్తాడని పేర్కొన్నారు.మంచి ఎక్కడ కనిపించినా, మానవత్వం ఎక్కడ వెలుగొందినా అలాంటి వ్యక్తులను గుర్తించి అభినందించడం తమ సంస్థ ధ్యేయమని తెలిపారు. గతంలో విజయవాడలో నిరుపేద చిన్నారులకు చెప్పులు కొనిపెట్టిన ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకటరత్నాన్ని, అలాగే ఆలమూరు మండలం సందిపూడి గ్రామంలో స్వంత ఖర్చుతో ప్రజలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపట్టిన దొడ్డా సత్తిపండును కూడా సన్మానించినట్లు గుర్తుచేశారు."కొన్ని మంచి పనులు మనం చేయలేకపోయినా, వాటిని చేసిన వారిని అభినందించడం కూడా సమాజ సేవలో భాగమే. ఇలాంటి ఆదర్శ వ్యక్తులకు అందరూ మద్దతుగా నిలిస్తే సమాజంలో మరింత మంచి పెరుగుతుంది" అని గిరజాల బాబు అన్నారు.కార్యక్రమంలో గ్రామ పెద్దలు పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, వాసిరెడ్డి అర్జున్, టీవీ గోవిందరావు, ఉంగరాల వీరభద్రరావు, షేక్ సర్కార్ భాషా, చిలుకూరి శ్రీనివాసరావు, దామిశెట్టి అశోక్, కొక్కిరాల వెంకటేశ్వరరావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ ఆధ్వర్యంలో టీడీపీ మేనిఫెస్టో దగ్ధం.



**రౌతులపూడి, జూన్ 4.(ప్రభాత వార్త)** ప్రత్తిపాడు వై ఎస్ ఆర్ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆ పత్రాలను గురువారం రౌతులపూడిలో వై ఎస్ ఆర్ పార్టీ ఇన్చార్జి ముద్రగడ గిరిబాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు తగలబెట్టారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. హామీలు నెరవేర్చేవరకు ప్రభుత్వం పై సాగిస్తూనే ఉంటామని తెలియజేశారు. ఈ కార్య క్రమంలో తుని,పెద్దాపురం నియోజక వర్గాల పార్టీ పరిశీలకుడు వాసిరెడ్డి జమీలు, జెడ్ పీ టి సి చినదివానం, వాసిరెడ్డి భాస్కరబాబు,కాకి నాని తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్ ఓఎస్డి కి ఘన సత్కారం



**పెదపూడి.ప్రభాతవార్త** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఓ ఎస్ డి గా పని చేసిన పడాల సత్యనారాయణ రెడ్డి (బాబ్జి) ని గొల్లలమామిడాడకు చెందిన చింతా దొరబాబు ఘనంగా సత్కరించారు. పెదపూడి మండలం గొల్లల మామిడాడ గ్రామంలో కీర్తిశేషులు కొవ్వూరి బసివి రెడ్డి కాంస్య విగ్రహం ఏర్పాటులో ముఖ్య భూమిక పోషించిన ఓ ఎస్ డి పడాల సత్యనారాయణ రెడ్డి (బాబ్జి) సేవలు యావత్ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రం గర్వించదగ్గ విషయమని చింతా దొరబాబు అన్నారు.అనంతరం పడాల సత్యనారాయణ రెడ్డి (బాబ్జి) జన్మదినోత్సవం సందర్భంగా ఆయనను చింతా దొరబాబు మరియు చింతా దొరబాబు యూత్ సభ్యులు ఘనంగా సత్కరించి పూలమాలలు,బొకేలు,సాలువాలతో ఘనంగా సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కొవ్వూరి బసివి రెడ్డి విగ్రహ ఏర్పాట్లు ఆయన చేసిన కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సబ్బెళ్ల అమ్మిరెడ్డి, మేడపాటి తాతారెడ్డి, చింతా దొరబాబు యూత్ సభ్యులు పాల్గొన్నారు

## షాపులకు వెయ్యకుండా ఈ పాస్ మిషన్ లోకి రేషన్ సరుకు



**అయినవిల్లి జూన్ 4 ప్రభాతవార్త** రేషన్ షాపులకు సరుకు వేయకుండానే కొన్ని షాపుల ఈ పాస్ మిషన్లో గత కొద్ది నెలలుగా బియ్యం పంచదార నిలవలు చూపించడం పట్ల రేషన్ డీలర్లు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు ఇప్పటికే ఈ విషయంపై జెసికి కోనసీమ రేషన్ డీలర్ల సంగం ఆధ్వర్యంలో ఫిర్యాదు చేయడం జరిగింది మొంతా తుఫాన్ సమయంలో కొన్ని షాపులకు పేదలకు ఉచితంగా పంచేందుకుగాను బియ్యాన్ని దిగుమతి చేశారు ఆ సమయంలో షాపులకు పంచదార వేయకుండానే ఈ పాస్ మిషన్ లో ఎక్కించడంతో డీలర్ల వద్ద ఈపాస్ మిషన్లో నిలవలుగా చూపిస్తున్నాయి ఈ సమస్య వల్ల కొన్ని షాపులు విజిలెన్స్ తనిఖీల్లో 6ఏ కేసులు పెట్టడం కూడా జరిగింది సరుకు లేకుండా రేషన్ షాపు ఈ పాస్ మిషన్ లోకి సరుకులు ఎలా ట్రాన్స్ఫర్ చేశారనే దానిపై అనేక అనుమానాలు కలుగుతున్నాయి మీూా స్పాయింట్ నుండి సరుకులు వేసినప్పుడే ఈపాస్ మిషన్ లోకి డీలర్ వేలిముద్ర ద్వారా ఎక్కవలసి ఉంది ఏమీ లేకుండా డైరెక్ట్ గా ఈపాస్ పేషన్లో సరుకులు ఎక్కించారు ఇది ఒక కుంభకోణంగా పలువురు భావిస్తున్నారు దీనిపై సమగ్ర విచారణ జరపవలసి ఉంది గత సంవత్సరం అంబాజీపేట మీూా పాయింట్లో లారీల కొలది రేషన్ బియ్యం అవకతలకలు జరగడంతో అక్కడ పనిచేసే గోడౌన్ ఇంచార్జ్ మరో ఇద్దరు సిబ్బందిని ఇప్పటికే తొలగించి యున్నారు కోనసీమ జిల్లాలో సివిల్ సప్లై పనితీరు ఏ విధంగా ఉందో దీన్ని బట్టి అర్థమవుతుంది

# గంజాయి బ్యాచ్‌లపై పోలీసుల 'రాపిడ్' టెస్ట్ లు

## -ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ముమ్మరంగా డ్రగ్స్ స్క్రీనింగ్ టెస్టులు- 21 మందికి పరీక్షలు.. ఒకరికి పాజిటివ్



**ప్రత్తిపాడు, జూన్ 04 (ప్రభాతవార్త)**కాకినాడ జిల్లాను డ్రగ్స్, గంజాయి రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఆదేశాల మేరకు గురువారం పెద్దాపురం సబ్ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లో పోలీసులు గంజాయి నిర్మూలనకై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. పెద్దాపురం డీఎస్పీ తిలక్ పర్యవేక్షణలో, ప్రత్తిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సూర్య అప్పారావు నేతృత్వంలో ఈ ఆపరేషన్ కొనసాగింది. - ?అత్యాధునిక కిట్లతో పరీక్షలు..ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి మండలాల పరిధిలో గంజాయి సేవించి తిరుగుతున్నారనే సమాచారంతో, అనుమానితులైన 21 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారికి అక్కడికక్కడే అత్యాధునిక 'రాపిడ్ డ్రగ్ స్క్రీనింగ్ టెస్ట్ కిట్' ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఒకరికి గంజాయి సేవించినట్లు (పాజిటివ్) నిర్ధారణ అయింది. ?డీ-అడిక్షన్ సెంటర్లకు తరలింపు..ఈ సందర్భంగా ప్రత్తిపాడు సీఐ సూర్య అప్పారావు మాట్లాడుతూ జిల్లాలో గంజాయి సంస్కృతిని పూర్తిగా అణచివేసే వరకు ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు. పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన యువకుడికి, వారి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇస్తామని తెలిపారు. వ్యసనానికి బానిసైన సదరు యువకుడిలో మార్పు తీసుకురావడానికి డీ-అడిక్షన్ కేంద్రానికి పంపిస్తామని ఆయన పేర్కొన్నారు. యువత డ్రగ్స్ వంటి మహమ్మారులకు దూరంగా ఉండి, భవిష్యత్తును పాడుచేసుకోవద్దని కోరారు.ఈ ముమ్మర తనిఖీల్లో ప్రత్తిపాడు ఎస్.ఐ ఎస్. లక్ష్మి కాంతం, ఏలేశ్వరం ఎస్.ఐ ఎన్. రామలింగేశ్వరరావు, అన్నవరం ఎస్.ఐ జి. శ్రీహరిబాబు, ఎస్.ఐ ఎన్. వెంకటేశ్వర రావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనాలే కొనుగోలు చేయాలి

**సీతానగరం, జూన్ 04, (ప్రభాతవార్త) :** రైతులు నాణ్యమైన, ధృవీకరించబడిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని మండల వ్యవసాయాధికారి ఏ.గోరేదేవి సూచించారు. ఖరీఫ్ సీజన్ నేపథ్యంలో ప్రభుత్వం అనుమతి పొందిన డీలర్లు, సహకార సంఘాల నుండే విత్తనాలను కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు. ప్యాకెట్లపై ఉండే పంట రకం, లాట్ నంబర్, మొలక శాతం, గడువు తేదీలను గమనించిన తర్వాతే కొనుగోలు చేయాలన్నారు. విత్తే ముందు ఇంటి వద్దనే మొలక పరీక్ష నిర్వహించి మొలక శాతాన్ని నిర్ధారించుకున్న అనంతరం వినియోగించుకోవాలని సూచించారు. అదే విధంగా మన ప్రాంత వాతావరణానికి అనుకూలమైన, వ్యవసాయ శాఖ సిఫారసు చేసిన రకాలను ఎంచుకుంటే మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సమీప రైతు సేవా కేంద్రం లేదా విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌ను సంప్రదించాలని కోరారు.

## వెలుగు జీడిపిక్కలు చోరీపై కేసు నమోదు ..

### - ఆరుగురు అరెస్ట్.. పిక్కలు స్వాధీనం



**రాజవొమ్మంగి, జూన్ 04, ప్రభాతవార్త** జడ్డంగి కమ్యూనిటీ భవనంలో ఉంచిన గల వన్ ధన్ వికాస కేంద్ర గోదాం ( వెలుగు ) నిల్వ ఉంచిన 19 బస్తాల జీడిపిక్కలు (950 కిలోలు ) చోరీ జరిగినట్లు మండల వెలుగు ఏ.పి. యం. రామానుజేయులు ఇచ్చిన పోలీస్ స్టేషన్ కు ఈ నెల 2 తేదీన ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్. ఐ చినబాబు పత్రికా ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. ఎస్. ఐ చినబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నయ్యపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు ఈ చోరీకి పాల్పడినట్లు ప్రకటనలో తెలిపారు. గోదాంలో నిల్వ ఉంచిన జీడిపిక్కలను ఆరుగురు అపహరించినట్లు అంగీకరించారని, మధ్యవర్తుల సమక్షంలో అరెస్టు చేసినట్లు తెలిపారు. జీడి పిక్కలను మధ్యవర్తుల సమక్షంలో స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్ లో భద్రపర్చడం జరిగిందన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా పోలీసులకు సమాచారాన్ని ఇవ్వాలని ఎస్. ఐ కోరారు. ఈకార్యక్రమంలో ఎస్. ఐ. చినబాబు, వీఆర్వోలు సీతారామ్ నానాజీ, సంపతి నాగేశ్వరరావు, కానిస్టేబుల్ ప్రసాద్ రెడ్డి, సురేష్, హోం గార్డు చిన్నారావు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు నెరవేర్చాలి..

### -అంబాజీపేటలో వైసిపి నాయకులు నిరసన..



**అంబాజీపేట, జూన్ 4, (ప్రభాతవార్త):** కూటమి పార్టీలు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండేళ్లు గడిచినా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని, వెంటనే హామీలు నెరవేర్చాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. వైసిపి మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల సెంటర్లో నిరసన వ్యక్తం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు వైసిపి నాయకులు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు ఎప్పుడూ హామీలు ఇవ్వడమే తప్ప వాటిని అమలు చేయడని, హామీలు నెరవేర్చే వరకు వైసిపి కూటమి ప్రభుత్వంపై పోరాటం చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆర్భాటంగా ప్రకటించిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. అనంతరం నాలుగు రోడ్ల సెంటర్లో టిడిపి ప్రకటించిన మేనిఫెస్టో, చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ లు సంతకాలు చేసిన బాండ్, పత్రికా ప్రకటనల కాపీలను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వర్లు, జడ్పిటిసి బూడిద వరలక్ష్మి,జిల్లా సోషల్ మీడియా అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పేరి కామేశ్వరరావు, ఎం.ఎం.శెట్టి, కొర్లపాటి కోటబాబు, సూదాబత్తుల రాము,దేవరపల్లి గౌతమ్, కోట బేబీరాణి, పేరి శ్రీనివాస్,చిట్టూరి రాధాబాయి,కుసుమ వరలక్ష్మి, ముత్యాలపల్లి ప్రశాంత్, గంటి శ్రీరామ్మూర్తి, కాంగ్రెస్ గోపి, నీతిపూడి విలసిత మంగతాయారు,మట్టపర్తి హరి, వాసంశెట్టి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## యువకుడిపై దాడి.. కేసు నమోదు..


**అంబాజీపేట, జూన్ 4, (ప్రభాతవార్త):** పాత గొడవల నేపథ్యంలో ఓ యువకుడిపై మరో యువకుడు దాడి చేసి గాయపరిచిన ఘటనలో కేసు నమోదు చేశారు. దీనికి సంబంధించి అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. స్థానిక హుస్సేన్ కాలనీకి చెందిన దొండపూడి సిద్ధార్థ, తొండవరం గ్రామానికి చెందిన గోసంగి ధరణీకుమార్ లకు పాత గొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సిద్ధార్థ ఈ నెల 3 రాత్రి తొండవరం బ్రిడ్జి వద్దకు వెళ్లి ధరణీకుమార్ ను వెనుక నుండి కొట్టి గాయపరిచాడు. దాంతో ధరణి కుమార్ ను స్థానికులు అమలాపురం ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ మెరుగైన వైద్యం కోసం శ్రీనిధి ఆస్పత్రిలో చేర్పించారు. క్షతగాత్రుడు ధరణీకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చైతన్య కుమారి తెలిపారు.

## కత్తిపూడిలో కూటమి ప్రభుత్వ మోసాలపై వైసీపీ నిరసన!




**శంఖవరం జూన్ 4 ప్రభాతవార్త** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇచ్చిన హామీలతో ప్రజలను వంచించింది, ఆంధ్రప్రదేశ్‌కు వెన్నుపోటు పొడిచి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబు పిలుపు మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి గ్రామంలో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. శంఖవరం మండల వైసీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో చంద్రబాబు మేనిఫెస్టోను, పత్రికా ప్రకటనలను పథకాలకు సంతకాలు చేసిన బాండ్లను రోడ్డుపై తగలబెట్టి నిరసన తెలియజేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై వైసీపీ శ్రేణులు గళమెత్తాయి. తక్షణమే ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌతు స్వామి, నగాల శ్రీను, కాదిమంచి సూర్యప్రకాశరావు,అడపా సోమేశ్, పెయ్యల రాజా,సకురు గుర్రాజు, చల్లా ప్రసాద్, చప్పా రాంబాబు,పెయ్యల కృష్ణ, జీలకర్ర లక్ష్మణ్, తిరుగటి సతీష్, మిరియాల పద్మావతి, పెయ్యల సూరిబాబు,నమ్మి తాతారావు, మడికి ప్రకాష్, ఎద్దు సుబ్రహ్మణ్యం, తదితరులు నియోజకవర్గ ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## గజ్జనపూడి లో గర్జన అరుంధతి యూత్ ఆధ్వర్యంలో డాక్టరేట్ గ్రహీత గండేటి కిషోర్ కుమార్ కు ఘన సన్మానం



**ప్రత్తిపాడు, జూన్ 4 (ప్రభాతవార్త) :** మండలంలోని గజ్జనపూడి గ్రామంలో గర్జన అరుంధతి యూత్ ఆధ్వర్యంలో మాదిగ పేట ఎస్సీ కమ్యూనిటీ హాల్ లో డాక్టరేట్ గ్రహీత గండేటి కిషోర్ కుమార్ ను గురువారం ఘనంగా సన్మానించారు. ఇటీవల చెన్నై భారతీయ విద్యా భవన్ లోహ్యూమన్ రైట్స్ విభాగంలో యునైటెడ్ అమెరికన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం మర్రివీడు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, న్యాయవాది గండేటి కిషోర్ కుమార్ కు హ్యూమన్ రైట్స్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. ఈ నేపథ్యంలో గర్జన అరుంధతి యూత్ సభ్యులు ఆధ్వర్యంలో డాక్టర్ గండేటి కిషోర్ కుమార్ ను శాలువా కప్పి పూల మాలలతో సత్కరించారు. గ్రామ పంచాయతీ సర్పంచ్ గా, న్యాయవాదిగా, హ్యూమన్ రైట్స్ విభాగంలో ప్రజలకు సేవలందిస్తున్న కిషోర్ కుమార్ కు డాక్టరేట్ తో గౌరవించడంపట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా డాక్టరేట్ గ్రహీత గండేటి కిషోర్ మాట్లాడుతూ గత 10సంవత్సరాలుగా హ్యూమన్ రైట్స్ ద్వారా ఎన్నో కుటుంబాలకు న్యాయం అందించామని అన్నారు. ఈ డాక్టరేట్ తో నాపై మరింత బాధ్యత పెరిగిందని అన్నారు. న్యాయ పరమైన అవసరాలలో ప్రజలకు నిత్యం అదుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి ,స్వీట్లు పంచిపెట్టి మందు గుడు సామాగ్రి తో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి చిన్నారావు, గెడ్డం నాగరాజు, పలివేల దొంగలు, వేమగిరి బ్రహ్మానందం, పలివేల పెద రమణ, పలివేల జగదీష్, పలివేల లోవరాజు, పలివేల చిన్న రమణ, కాకాడ నాగేశ్వరరావు, గేడ్డం రవి, మరియు గర్జన అరుంధతి యూత్ మహిళలు, యువత, ఈ పాల్గొన్నారు,

## కూటమి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయిన సందర్భంగా కూటమి నాయకుల సంబరాలు.



**అనపర్తి జూన్ 4 (ప్రభాత వార్త )**సార్వత్రిక ఎన్నికలలో కూటమి ఘన విజయం సాధించి నేటికీ రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, యువనేత మనోజ్ రెడ్డి, టిడిపి, బిజెపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో అనపర్తి లో ఘనంగా వేడుకలు నిర్వహించడం జరిగింది. అనపర్తి గాంధీ బొమ్మ సెంటర్లో జాతిపిత మహాత్మా గాంధీ గారి విగ్రహానికి నివాళులు అర్పించిన అనంతరం కూటమి నాయకుల నడుమ ఎమ్మెల్యే నల్లమిల్లి, యువనేత మనోజ్ లు కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. గాంధీ బొమ్మ సెంటర్ నుండి దేవీ చౌక్ వరకు ర్యాలీ నిర్వహించి కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు

## బాలుడి కుటుంబానికి పలువురు ఆపన్న హస్తం.




**తాళ్ళరేవు, మే 4 (ప్రభాతవార్త)-** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీపాత కోరంగి గ్రామానికి చెందిన నీలం రాంబాబు, లక్ష్మీ దుర్గ దంపతుల 15 రోజుల బాలుడికి గుండెలో రంధ్రాలు ఉండడంతో వైద్య ఖర్చుల నిమిత్తం లక్షలాది రూపాయలు అవసరం కాగా పలువురు ఆ బాలుడి కుటుంబానికి ఆపన్న హస్తం అందించారు. ఈ మేరకు తాళ్ళరేవు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ 1,00,000లు, తాళ్ళరేవు టుడే, వివిధ సోషల్ మీడియాగ్రూప్ లు, తాళ్లరేవు హై స్కూల్ పూర్వవిద్యార్థులు, 62,058లు, తాళ్ళరేవు లయన్స్ క్లబ్ 25,000 లతో కలిపి మొత్తం రూ.1,64,558 లు పాత కోరంగి గ్రామంలోని ఆ కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు.అదేవిదంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రివర్యులు వాసంశెట్టి సుభాష్ ఆ బాబు పరిస్థితి ని తెలుకొని రూ.40,000 ల చెక్కును స్థానిక మండల నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర శెట్టిబలిజ కార్పోరేషన్ డైరెక్టర్, టేకుమూడి లక్ష్మణరావు, రాష్ట్ర శెట్టిబలిజ సాధికార సమితి డైరెక్టర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్ పీటీసీలు బొంతు మోహన్, గంజా సూరిబాబు, జనసేన నాయకులు బండారు దొరబాబు, రాయుడుగోవిందు, లయన్స్ క్లబ్ సభ్యులు నడింపల్లి వినోద్ రాజు, బిళ్లకుర్తి శ్రీనివాస్ రెడ్డి, కట్ట ఆదినారాయణ, పొన్నాడ పేరయ్య రాజు, నరేంద్ర రెడ్డి, చోడే శ్రీనివాస్, కొప్పిశెట్టి బాబి, పెయ్యల రమేష్,దంగేటి అన్వేష్, మేడిశెట్టి ఫవన్, శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ నాయులు మేడిశెట్టి నారాయణ రావు, పితాని బాలవెంకటరమణ, సూరంపూడి కుమార్, కుడుపూడి మల్లేశ్వరరావు, నీలం లోవరాజు, కముజు ఆనంద్ కుమార్, గుత్తుల మల్లేశ్వరరావు లు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి..



**ప్రత్తిపాడు, జూన్ 04 (ప్రభాతవార్త)**మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రత్తిపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఉమ్మిడి వెంకట్రావు, పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను డిమాండ్ చేశారు. ఏపీసీసీ పిలుపు మేరకు గురువారం కాంగ్రెస్ బృందం ధర్మవరం, ఒమ్మంగి, ఉత్తరకంచి, లంపకలోవ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరంలో పనికి తగ్గ కూలి రావడం లేదని, ఒమ్మంగిలో పని దినాలు, పనిముట్లు సరిగ్గా లేవని, ఉత్తరకంచిలో జాబ్ కార్డులు లేక కూలీలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఎండలు ఉన్నప్పటికీ పని ప్రదేశాల్లో టెంట్లు, తాగునీరు, కనీస పనిముట్లు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని మండిపడ్డారు.అనంతరం, నిన్న లంపకలోవ గ్రామంలో ఉపాధి పనికి వెళ్లి వడదెబ్బతో మృతి చెందిన కూలి లింగంపల్లి వీరభద్రరావు కుటుంబాన్ని కాంగ్రెస్ నేతలు పరామర్శించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుండి రావలసిన పరిహారం, స్కీములు అందేలా పోరాడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్. సూర్యనారాయణ, డి. సుబ్బరాజు, కె. కోటేశ్వరరావు, డి. వెంకటేశ్వరరావు, డి. చంద్రశేఖర్, పి. వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## అడ్డతీగలలో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ అవగాహన



**అడ్డతీగల జూన్ 04 ప్రభాతవార్త** పోలవరం జిల్లా అడ్డతీగల పోలీస్ స్టేషన్‌లో సీఐ గజేంద్ర కుమార్,ఎస్ఐ బి వినోద్ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లతో రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన సమావేశం నిర్వహించారు. డ్రైవర్లు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. అనుమతికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని, మద్యం సేవించి వాహనం నడపవద్దని హెచ్చరించారు. గంజాయి, కల్తీ మద్యం, అక్రమ పశువుల రవాణా వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులకు సహకరించాలని డ్రైవర్లకు విజ్ఞప్తి చేశారు.

## సమ్మర్ క్యాంప్ లో క్విజ్ పోటీలు నిర్వహణ.



**తాళ్లరేవు, మే 4 (ప్రభాతవార్త):** సమ్మర్ క్యాంప్ లో భాగంగా చిల్డ్రన్స్ క్లబ్ తాళ్ళరేవు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు లో భాగంగా ఏడవ రోజు చిన్నారులకు ఉపాధ్యాయులు కాశి రవీంద్ర క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జూనియర్ సీనియర్స్ విభాగాల్లో ఈ పోటీలు జరిగాయి. అనంతరం తాళ్లరేవు హై స్కూల్ ఇంగ్లీషు ఉపాధ్యాయులు జగన్నాథ రాజు పార్టీ స్పోకెన్ ఇంగ్లీష్ లో పాటించాల్సిన మెలకువలను తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు కొప్పిశెట్టి శ్రీకృష్ణ మహేశ్వర్ స్పెషల్ తెలుగు లో భాగంగా వేమన పద్యాలు, అమ్మ భాష గొప్పతనాన్ని చక్కగా విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా చిన్నారులకు చిట్టూరి లక్ష్మణరావు, ఆర్మీ కి చెందిన మధు స్నాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చిల్డ్రన్స్ క్లబ్ ప్రతినిధులు గుత్తుల మల్లేశ్వర రావు, పాలిక శ్రీనివాస్, పులప కూర కృష్ణ, కొప్పిశెట్టి అనంతలక్ష్మి, వెదురుపావులూరి నాని, చిట్టితల్లి తదితరులు పాల్గొన్నారు.

# గో మాంసం తరలిస్తున్న ఆటో సీజ్

## -ముగ్గురుపై కేసు నమోదు

**గొల్లప్రోలు,(ప్రభాతవార్త)**గో మాంసం తరలిస్తున్న టాటా ఏసీ వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశారు.పోలీసులు తెలిపిన వివరాలు పరిశీలిస్తే పశు మాంసం అక్రమంగా రవాణా చేస్తున్నట్లు ముందుగా అందిన సమాచారం మేరకు గురువారం గొల్లప్రోలు టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు చేపట్టారు.అదే సమయంలో గొల్లప్రోలు నుండి పిఠాపురం వైపుగా వెళుతున్న టాటా ఏసీ వాహనాన్ని నిలిపి పోలీసులు తనిఖీలు చేపట్టగా గో మాంసం బయటపడింది.దీంతో పోలీసులు డ్రైవర్ ను అదుపులోకి తీసుకొని వాహనంతో పాటు పోలీస్ స్టేషన్ కు తరలించారు. మండల పరిధి చెందుర్తి గ్రామానికి చెందిన కట్టమూరు ప్రసన్న కుమార్ గత కొంత కాలంగా కొంత మంది కూలీలతో శంఖవరం మండలం కొత్త వజ్రకూటం గ్రామ సమీపంలో గల కొండ ప్రాంతంలో గోవులను వధిస్తూ మాంసాన్ని ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నాడు.దీనిలో భాగంగా గోవులను వధించడం ద్వారా వచ్చిన సుమారు 100 కేజీల గోమాంసాన్ని పిఠాపురం మార్కెట్ లో గల అక్బల్ అనే వ్యక్తికి వాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ప్రసన్నకుమార్ పంపిస్తున్న గోమాంసాన్ని అక్బల్ ప్రతిరోజు కాకినాడ లో గల పలు హోటల్స్ లో అమ్ముతుంటాడని పోలీసులు తెలిపారు.గోవులను వధిస్తున్న చెందుర్తి గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్, గో మాంసాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ఆటో డ్రైవర్,యజమాని చెప్పుల సుధీర్, గోమాంసం కొనుగోలు చేస్తున్న పిఠాపురం పట్టణానికి చెందిన అక్బల్ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గొల్లప్రోలు ఎస్సై రామకృష్ణ తెలిపారు. పట్టుబడిన గోమాంసాన్ని వీఆర్వో సమక్షంలో పూడ్చి వేసినట్లు తెలిపారు.మటన్ లో మిక్స్ చేస్తున్న పశు మాంసం పశు మాంసాన్ని కాకినాడలో గల పలు హోటల్స్ లో అమ్ముతున్నట్లు నిందితులు గొల్లప్రోలు పోలీసుల విచారంలో అంగీకరించడం కలకలం సృష్టిస్తుంది.కొంతమంది హోటల్స్ నిర్వాహకులు లాభార్జనే ధ్యేయంగా గుట్టు చప్పుడు కాకుండా పశు మాంసాన్ని కొనుగోలు చేసి మటన్ లో కలుపుతున్నట్లు తెలియ వచ్చింది.గడచిన కొన్ని సంవత్సరాలుగా ఈ కల్తీ వ్యవహారం జరుగుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## లీఫ్ కార్వింగ్ ద్వారా పర్యావరణ పరిరక్షణ పై అవగాహన



**గొల్లప్రోలు, (ప్రభాతవార్త)** లీఫ్ క్వారింగ్ కళ ద్వారా గురువారం ఒక ఉపాధ్యాయుడు పర్యావరణ పరిరక్షణ పై అవగాహన కల్పిస్తున్నాడు.కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చెందుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో (నూకలమ్మ గుడి) జీవ శాస్త్ర ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న పిల్లి గోవిందరాజులు జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని యాపిల్ ఆకుపై లీవ్ కార్వింగ్ కళ ద్వారా చెట్లు యొక్క ఉపయోగాలు,వృక్షాలు పర్యావరణ సమతుల్యతను ఏ విధంగా కాపాడుతున్నాయో తెలియజేయడం,చెట్ల మీద ఆధారపడే ఇతర జంతువుల జీవన విధానం,ఆహారపు గొలుసు, ఆహారపుజాలకశీ,జల,భూమి, వాయుకాలుష్యాలు తదితర గ్లోబల్ వార్నింగ్ విధానంపై తెలిసే విధంగా చిత్రీకరించారు.యాపిల్ ఆకుపై ప్రపంచ పర్యావరణంపై అవగాహన కల్పించినందుకు ఉపాధ్యాయుడు గోవిందరాజులను జిల్లా విద్యాశాఖ అధికారి పిల్లి రమేష్,ఉప విద్యాశాఖ అధికారి కెవివి సత్యనారాయణ, జిల్లా సైన్స్ ఆఫీసర్ కేసరి శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారులు వెన్న శ్రీనివాస్ బివి శివప్రసాద్, ప్రధానోపాధ్యాయులు సబ్బవరపు సతీష్,విద్యా కమిటీ చైర్మన్ జగ్గరపు శ్రీనివాస్ రావు,ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

## ఉపాధ్యాయులతోనే విధ్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు

### -కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి రమేష్



**శంఖవరం జూన్ 4 ప్రభాతవార్త** ప్రాధమిక తరగతుల్లో భోదించే ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయడం ద్వారా విధ్యార్థులకు ప్రాధమిక స్థాయిలోనే బలమైన విద్యాభ్యానం పొందడంతో వారికి ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పి రమేష్ అన్నారు. శంఖవరం మండలం లోని కత్తిపూడి జెడ్పీ హైస్కూలులో ప్రాధమిక స్థాయి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా తరగతులు గురువారం ప్రారంభం కాగా, డిఇఓ రమేష్ శిక్షణ కేంద్రాన్ని అకస్మికంగా సందర్శించారు. ఫౌండేషన్ లిటరసీ మరియు న్యూమరసి శిక్షణలో 243 మంది ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. ఈ శిక్షణలో డిఇఓ రమేష్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు కష్టపడి పనిచేయడం వలన పేద, బడుగు, బలహీన వర్గాలపిల్లలకు మంచి భవిష్యత్తు లభిస్తుందని, ఉపాధ్యాయుల సమర్ధవంతమైన భోదన ద్వారా ప్రభుత్వ బడులు బలోపేతం అయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి చేయడం, వెనుకబాటు పిల్లలకు అదనపు సమయంలో తర్ఫీదు ఇచ్చి, పిల్లల్లో అభ్యాసన స్థాయిలు మెరుగయ్యే వరకూ భోదనకు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇఓలు ఎస్వీ రమణ, టి గోవిందు, హెచ్ఎమ్‌లింగేశ్వరరావు, రిసోర్స్ పర్సన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల హామీలు అమలులో ప్రజలకు వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వం



**అనపర్తి జూన్ 4 ( ప్రభాత వార్త)** ఎన్నికల హామీల అమలులో ప్రజలకు కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని వైయస్ఆర్‌సీపీ నాయకులు అన్నారు. పార్టీ ఆధ్వర్యంలో అనపర్తి లో గురువారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు."చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో చేపట్టిన ఈ కార్యక్రమంలో అనపర్తి మండలం కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు),జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, ఎంపీటీసీ కొండేటి భీమేష్,మండ శ్రీను, కానూరి కృష్ణ, యాసిడ్ రాము, తిరగటి శివ, సత్తి గంగిరెడ్డి, పెద్ద బుజ్జి,సుమన్, మల్లేశ్వర, ఏసు, ఇబ్రహీం,సునీల్,శివ , శ్రీనివాసరెడ్డి, సత్తి సూరారెడ్డి, సత్తి వెంకటరెడ్డి, కనకారెడ్డి, తాడి సూరారెడ్డి,మల్లిడి వీరాఘవరెడ్డి, కర్రి సర్రెడ్డి, గొలుగూరి దుర్గారెడ్డి, కర్రి గాంధీరెడ్డి, నల్లమిల్లి వెంకట ప్రభాకర రెడ్డి, వల్లభ శెట్టి రామ సతీష్, శేఖర్, సాయి, సత్యనారాయణ రెడ్డి, పడాల సూరారెడ్డి, బుజ్జి, సత్తిరెడ్డి, కుతుకులూరు నాగిరెడ్డి, ఆర్కె, రుక్మిణి, మణికంఠ రెడ్డి,సత్యనారాయణ రెడ్డి, బాల మణికంఠ రెడ్డి, నాగిరెడ్డి, తేజ, వీరెడ్డి, జయంత్ రెడ్డి, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వెన్నుపోటుకు రెండేళ్లు, చంద్రబాబు పాలనలో ప్రజలకు మోసమే మిగిలింది . వైకాపా



**కాట్రేనికోన, జూన్ 04(ప్రభాతవార్త) :**కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా వెన్నుపోటుకు రెండేళ్లు పేరుతో కాట్రేనికోన మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, ముమ్మిడివరం నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ పిలుపు మేరకు గురువారం ఈ పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. కాట్రేనికోన మావుళ్ళమ్మ అమ్మవారి గుడి వద్ద నుంచి గేటు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. "చంద్రబాబు పాలన వెన్నుపోటు పాలన", "బాబు షురిటీ మోసం గ్యారంటీ ", "మాయదారి పాలన మాకొద్దు పాలన" జగనన్న పాలనే... బంగారు పాలన అంటూ నినాదాలు చేస్తూ గేటు సెంటర్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా నడింపల్లి సూరిబాబు మాట్లాడుతూ"రెండేళ్లలో ఇచ్చిన ఒక్క హామీనైనా నెరవేర్చారా? రైతులకు, మహిళలకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట తప్పారని, ఇది అభివృద్ధి పాలన కాదు, వెన్నుపోటు పాలన" అని విమర్శించారు. జడ్పిటిసి నేల కిషోర్ మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో పేదలకు మేలు జరగడం లేదని, వైఎస్సార్ పథకాలు రద్దు చేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీకోలాటి సత్యవతి సత్యం, మాజీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, మండల కన్వీనర్ నల్లా నరసింహమూర్తి,ఏడిద సుబ్బు,నాతి సత్యనారాయణ, మల్లాడి వీర బాబ్జి, మోకా చంద్ర నాగరత్నం,అక్కల శ్రీధర్ , తట్టవర్తి వెంకటరత్నం,సందీప్ వర్మ, నల్లా చిన్నాజి, శ్రీనివాసరావు,సత్య నారాయణ,రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి నాయకులు, ఎంపీటీసీలు ,సర్పంచ్‌లు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద వశాత్తు కాలువలో పడి వ్యక్తి మృతి



**కాట్రేనికోన, జూన్ 04(ప్రభాతవార్త):** ప్రమాదవశాత్తు కాలువలో జారీ పడి వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన కాట్రేనికోనలో గురువారం చోటుచేసుకుంది. కాట్రేనికోన కుమ్మరి వీదికి చెందిన రాయపూడి గణపతి రావు (75) మురుగు కాలువ గట్టుకు (ఓల్డ్ ఐనాపురం డ్రైన్ గట్టు ) తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి మృతి చెందినట్లు వారి కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని కాలువ నుండి ఒడ్డుకు తీసుకువచ్చి పోస్టుమార్టం నిమిత్తం ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రికి పంపించామని, కేసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అవినాష్ తెలిపారు. మృతునికి భార్య,ముగ్గురు పిల్లలు ఉన్నారు.

## మధ్యాహ్న భోజన నిర్వాహకులకు శిక్షణ



**కాట్రేనికోన, జూన్ 4 (ప్రభాతవార్త)**మండల పరిధిలో గల మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు వన్డే ఓరియెంటేషన్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ చెయ్యేరు జిల్లా పరిషత్ హై స్కూల్లో గురువారం నిర్వహించారు. ట్రైనర్ మెండు మణి వారికి మధ్యాహ్న భోజనం వండేటపుడు పాటించవలసిన, తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి తెలియజేశారు. మండల విద్యాశాఖాధికారి ఎం. వెంకటరమణ మాట్లాడుతూ అందరూ తప్పని సరిగా మెనూ ప్రకారం తాజా ఆకుకూరలు, కాయగూరలు వాడాలని, వండే ప్రదేశం, చేతులు పరిశుభ్రంగా ఉండాలని తెలియజేశారు. ఈ ప్రోగ్రామ్ కు అగ్నిమాపక సిబ్బంది కూడా హాజరై గ్యాస్ పై వంట చేసేటప్పుడు ఏ దైన ప్రమాదం సంభవిస్తే ఏమి చేయాలి? అనే విషయం పై పూర్తి అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్య క్రమంలో హెచ్ ఎం వెంకటేశ్వరరావు, సి ఆర్ ఎం టి లు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు తదితరులు హాజరయ్యారు.



తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం. డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## మోడల్ ఘాట్‌గా మునికూడలి ఘాట్ అభివృద్ధి

### -జూన్ 24న ఉప ముఖ్యమంత్రి క్షేత్రస్థాయి పరిశీలనకు సిద్ధం చేయాలి-కలెక్టర్ కీర్తి చేకూరి



**సీతానగరం, జూన్ 04, (ప్రభాతవార్త) :**2027 గోదావరి పుష్కరాల నేపథ్యంలో సీతానగరం మండలం మునికూడలిలోని దేవాన్ష్ ఘాట్‌ను మోడల్ గ్రామీణ పుష్కర ఘాట్‌గా అభివృద్ధి చేసేందుకు అన్ని శాఖల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నట్లు కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. గురువారం జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా, నాన్ కేడర్ ఎస్పీ ఏ.వి.సుబ్బరాజు తదితర అధికారులతో కలిసి రెండు గంటలకు పైగా క్షేత్రస్థాయిలో విస్తృతంగా పరిశీలించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, 2027 రాజమహేంద్రవరం కేంద్రంగా జరిగే గోదావరి పుష్కరాల సందర్భంగా ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే యాత్రికులకు మునికూడలి ఘాట్ ప్రధాన కేంద్రంగా మారనుందని తెలిపారు. గత పుష్కరాల్లో ఒకే రోజు 50 వేల మందికి పైగా ఇక్కడ భక్తులు పుణ్యస్నానాలు ఆచరించగా, 2027 పుష్కరాల్లో రోజుకు 80 వేల మంది వరకు భక్తులు స్నానం చేసే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. భక్తులు ఘాట్‌కు చేరుకునే విధంగా రహదారులు, ట్రాఫిక్ ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రస్తుతం 49 మీటర్ల పొడవున్న ఘాట్‌ను మరో 35 మీటర్లు విస్తరించి మొత్తం 84 మీటర్లుగా అభివృద్ధి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. గోదావరి హారతి కోసం ప్రత్యేక వేదిక, పిండప్రదానాల కోసం ఐదు మీటర్ల వెడల్పుతో ప్రత్యేక ఘాట్ నిర్మించాలని సూచించారు. గోదావరి వరదలకు ముందుగానే నిర్మాణ పనులు పూర్తి చేసి శాశ్వత ఉపయోగానికి అనుకూలంగా ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. పుష్కరాల సందర్భంగా రోజుకు సుమారు 200 ఆర్టీసీ బస్సులు నడిపే విధంగా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. పార్కింగ్ స్థలాలు, వన్‌వే ట్రాఫిక్ డైవర్షన్లు, హోల్డింగ్ ఏరియాలు, భక్తుల విశ్రాంతి కేంద్రాలు, అన్నదాన కేంద్రాలు, డ్రెస్సింగ్ రూములు, త్రాగునీటి సదుపాయాలు, చేతులు కడుక్కునే ప్రాంతాలు, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను సమగ్రంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల పరిధిలోని 13 ఘాట్లకు అవసరమైన పారిశుద్ధ్య ఏర్పాట్ల కోసం 100 మంది పంచాయతీ సిబ్బంది, 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించేలా ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. త్రాగునీటి కోసం బోర్లు ఏర్పాటు చేసి సింటెక్స్ ట్యాంకుల ద్వారా సరఫరా చేయాలని, 100 మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా కాటవరం సబ్‌స్టేషన్ నుంచి ప్రత్యేక ఫీడర్ లైన్, ముగ్గళ్ళ ఫీడర్ లైన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. ప్లాస్టిక్ రహిత పుష్కర ఘాట్‌గా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా మాట్లాడుతూ, వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై శాఖల వారీగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రోన్ కెమెరాల ద్వారా ఖాళీ స్థలాలను గుర్తించి పార్కింగ్ ప్రాంతాలుగా అభివృద్ధి చేయాలని, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్ల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, హోల్డింగ్ ఏరియాలు, భక్తుల సౌకర్యాల కల్పనపై సమగ్ర రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని సూచించారు. ప్రాధాన్యత శాఖలకు అవసరమైన ఈకో ఫ్రెండ్లీ బస్ స్టాండ్ నిర్మాణం కూడా చేపట్టాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ వై. మేఘా స్వరూప్ మాట్లాడుతూ 2027 పుష్కరాల్లో పెరిగే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని మానవ వనరులు, మౌలిక సదుపాయాలు, వసతి, రవాణా, పారిశుద్ధ్య ఏర్పాట్లపై ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు. నాన్ కేడర్ ఎస్పీ ఏ.వి. సుబ్బరాజు మాట్లాడుతూ, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, క్రౌడ్ మేనేజ్‌మెంట్, వీవీఐపీ భద్రత, పార్కింగ్ నిర్వహణ, వన్‌వే ట్రాఫిక్ డైవర్షన్ వ్యవస్థలను పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో 20 పడవలు, రెండు పెట్రోలింగ్ బోట్లు, కాకినాడ నుంచి ప్రత్యేక స్విమ్మర్లు, లైఫ్ సేవింగ్ పరికరాలు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు ఫ్లోటింగ్ జెట్టి, బోట్ అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, నదిలో భద్రతా చర్యల్లో భాగంగా మెష్ వ్యవస్థను పరిశీలించాలని సూచించారు. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో రెండు ఫైర్ ఇంజన్లు, వైద్యశాఖ ఆధ్వర్యంలో రెండు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. మునికూడలి చారిత్రక, ఆధ్యాత్మిక విశిష్టతను ప్రజలకు తెలియజేసేలా డాక్యుమెంటరీ రూపొందించి విస్తృత ప్రచారం చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. మునికూడలి ప్రాశస్త్యాన్ని పుస్తక రూపంలో ప్రచురించడంతో పాటు సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని కోరారు. జూన్ 10న మరోసారి క్షేత్రస్థాయి సమీక్ష నిర్వహించి, అన్ని శాఖలు ఆర్థిక, ఆర్థికేతర అంశాలు, మానవ వనరులు, మౌలిక సదుపాయాలపై సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను సమర్పించాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. జూన్ 24న ఉప ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాన్ కేడర్ ఎస్పీ ఏ.వి. సుబ్బరాజు, ఆర్డీవో ఆర్ శివ రాముడు, పుష్కర్ స్పెషల్ అధికారి మహేశ్, ఇరిగేషన్ ఎస్.ఈ జీ . శ్రీనివాసరావు, వి. శాంతామణి, ఎస్ఈ కె. తిలక్ కుమార్, కె. లక్ష్మీనారాయణ, ఎం వి ఐ సీహెచ్. సంపత్ కుమార్, డీఎస్పీలు, ట్రాఫిక్ డీఎస్పీ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యం గెలిచిన రోజునా ఘనంగా విజయోత్సవ వేడుక

### - కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం



**రామచంద్రపురం జూన్ 04 (ప్రభాతవార్త):** పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజా తీర్పుదినం సందర్భంగా కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి,స్వీట్లు పంచుకొని ప్రజాస్వామ్య విజయాన్ని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ,సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే రోజున ఆంధ్రప్రదేశ్ ప్రజలు విధ్వంసకర,కక్షపూరిత పాలనకు ముగింపు పలికి ప్రజాస్వామ్యానికి పట్టం కట్టారని అన్నారు. ప్రజల ఆకాంక్షలు, అభివృద్ధి పట్ల ఉన్న ఆశయాలు ఘన విజయం సాధించిన చారిత్రాత్మక రోజు ఇదని పేర్కొన్నారు.ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని,రాజధాని లేని పరిస్థితికి రాష్ట్రాన్ని నెట్టివేసి అభివృద్ధిని పూర్తిగా అడ్డుకున్నారని ఆయన విమర్శించారుముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దే పనులు వేగంగా సాగుతున్నాయని సత్యం తెలిపారు. "మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునే రోజులు సీఎం చంద్రబాబు తీసుకొచ్చారని ఆయన అన్నారు. ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా అమలు చేసిందని, సంక్షేమశీ-అభివృద్ధి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న ఈ ప్రజా ప్రభుత్వాన్ని చూసి వైసీపీ నేతలు తట్టుకోలేక అసత్య ప్రచారాలు,విష ప్రచారాలకు పాల్పడుతున్నారని సత్యం విమర్శించారు.సీఎం చంద్రబాబు నాయుడు పరిపాలనా అనుభవం,జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ప్రధాని నరేంద్ర మోదీ ఆశీస్సులు కలిసి రాష్ట్ర పునర్నిర్మాణానికి బలమైన పునాది వేశాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల ఆశీస్సులతో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం,ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేస్తోందని తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆశయాలకు అనుగుణంగా జన రంజక పాలన అందిస్తున్నారన్నారు.ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఇచ్చిన ఈ చారిత్రాత్మక తీర్పు కూటమి ప్రభుత్వ బాధ్యతను మరింత పెంచిందని, రాష్ట్రాన్ని దేశంలో అగ్రగామిగా నిలపడానికి ఇదే స్ఫూర్తితో ముందుకు సాగుతామని వాసంశెట్టి సత్యం అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల సహకారం, ఆశీర్వాదాలు నిరంతరం ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

Print and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at 11-37, Morampudi, Rajamahendravaram-533 103. Phone : 2469407, 2469408. RNI No.64863/96, Editor : Damerla Sai Baba, Responsible for s election of News-under the PRB Act. Regd.: No.H/SD/337/09-11 Air Surcharge: Delhi : 40Ps